అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 22-06-2024

సంపుటి : 10 సంచిక : 173 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

తక్షణమే జోక్యం చేసుకోండి

- నూతన క్రిమినల్ చట్టాలపై స్టే విధించేలా చూడండి
- ఇండియా బ్లాక్ నాయకులు, ఎన్డీఏ మిత్రపక్షాలను కోరుతూ 3600 మందికి పైగా ప్రముఖుల లేఖ



వివరాలు 3లో

పదేండ్లు ఏం చేశారు?

- మీ హయాంలోనే సింగరేణి గనుల్ని వేలం వేశారు
- అవంతిక, అరబిందోకు అప్పగించింది మీరేగా...
- మాజీ మంత్రి కేటీఆర్‌కు సీఎం రేవంత్ కౌంటర్



వివరాలు 6లో

నైనీబ్లాక్ ఉత్పత్తి ప్రారంభించండి

సింగరేణికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సలహా

- గనుల కేటాయింపుపై ప్రధానితో చర్చిస్తామని హామీ
- 10వ విడత వాణిజ్య బొగ్గుగనుల వేలం ప్రారంభం
- మా గనులు మాకే ఇవ్వాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



బొగ్గుబ్లాక్ వేలాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఒడిశాలో సింగరేణి కాలరీస్‌కు కేటాయించిన నైనీబ్లాక్ నుంచి వెంటనే ఉత్పత్తి ప్రారంభించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి చెప్పారు. దీనికోసం ఏవైనా సమస్యలు ఉంటే అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సింగరేణి ఉత్పత్తిలో 15 శాతం అక్కడి నుంచే లభిస్తుందనీ, తక్షణం ఆ పనులు ప్రారంభించాలన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి ఓ ప్రయివేటు హోటల్‌లో 10వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలంపాటను ఆయన ప్రారంభించారు. 8 రాష్ట్రాల్లోని 67 బొగ్గుగనుల్ని వేలంలో ఉంచారు. వాటిలో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాక్ కూడా ఉంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడారు. సింగరేణి కాలరీస్‌ను ఎట్టిపరిస్థితుల్లో ప్రయివేటుపరం కానీయమనీ, ఆ ప్రచారమంతా గత రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్ర అని చెప్పారు. సింగరేణికి కొత్త గనుల కేటాయింపుపై ప్రధాని నరేంద్రమోడీతో చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశంలో బొగ్గు అవసరాలు గణనీయంగా పెరిగాయనీ, ఆ డిమాండ్, సుప్రీంకోర్టు ఉత్తర్వుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం పదవ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని చేపట్టిందని వివరించారు. పదేండ్ల క్రిత రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలు కరెంటు కోసం ఆందోళనలు చేశారనీ, వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడి ఉన్నదని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితుల్లో పూర్తి మార్పు వచ్చిందనీ, ఇదంతా కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న విధాన సంస్కరణల ఫలితంగానే సాధ్యమైందని చెప్పారు. దేశం సంపదను ఐదు లక్షల కోట్ల డాలర్లకు ...6లో

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా నేడు నిరసనలు : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలోని 60 బొగ్గుబావులను ప్రయివేటీకరించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ...6లో



కేంద్రవిద్యాశాఖమంత్రికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నిరసన

కేంద్రమంత్రికి నిరసన సెగ

యోగా డేలో పాల్గొనకుండానే ధర్మేంద్ర ప్రధాన్ వెనకడుగు

- కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించాలి: సీతారాం ఏచూరి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం ఉదయం యోగా డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ యూనివర్సిటీకి వెళ్లారు. అక్కడ ఆయనకు నల్లజెండాలతో విద్యార్థులు స్వాగతం పలికారు. నీట్, యూజీసీ నెట్ పరీక్షలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యోగా డే కార్యక్రమం కోసం వెళ్లిన కేంద్ర విద్యాశాఖ మంత్రిని విద్యార్థులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. నల్లజెండాలు చేబూని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. పోలీసులు అప్పటికే బారికేడ్లను ఏర్పాటు చేయగా, వాటిని తోసుకుంటూ ముందుకు వచ్చే ప్రయత్నం చేశారు. ఈ నిరసనలతో ఆయన యోగా డేలో పాల్గొనకుండానే వెనుతిరిగారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నిరసనగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నివాసం బయట యూత్ కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. దీంతో ...13లో

నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో

వివరాలు 13లో

47 లక్షల మంది రైతులు రూ.31 వేల కోట్లు

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ

- త్వరలో విధివిధానాలతో జీవో
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్‌డేట్
- రైతుభరోసాపై భట్టి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం
- జులై 15లోగా ప్రభుత్వానికి నివేదిక
- ప్రభుత్వ నిర్ణయాలు వెల్లడించే బాధ్యతలు మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబుకు : రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి



క్యాబినెట్ వివరాలు వెల్లడిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గతంలో ప్రకటించిన విధంగానే ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో రుణమాఫీ, రైతుభరోసాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానంతరం సహచర మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రివర్గ నిర్ణయాలను సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

రుణమాఫీతో రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాటకు కట్టుబడి తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయంతో తాము చెప్పిన రైతు రాజ్యం, సంక్షేమ రాజ్యంపై ప్రజలకు భరోసా వస్తుందన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీని నాలుగు విడతలుగా చేయడంతో రైతు రుణమాఫీ బ్యాంకుల వడ్డీల కిందికి వెళ్లిందని గుర్తు చేశారు. గత సర్కార్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతూ, రైతులను ఆత్మహత్యలవైపు నడిపించిందని విమర్శించారు. అలా కాకుండా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే మాట నిలబెట్టుకుంటోందని తెలిపారు.

రైతుభరోసాపై రకరకాల చర్చలు జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రోడ్లు, కొండలు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, ధనికులకు ఆ పథకం ఇస్తున్నారని చర్చ జరుగుతున్నదని చెప్పారు. అందుకే రైతు భరోసాను పారదర్శకంగా అందించేందుకు మంత్రివర్గ ఉపసంఘం నియమించామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా క్యాబినెట్ సబ్ కమిటీ నియమించమన్నారు. రైతులందరి ...13లో

హస్తం గూటికి పోచారం



- ఇంటికెళ్లి ఆహ్వానించిన సీఎం
- పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలి : మాజీ స్పీకర్
- జానారెడ్డితో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి భేటీ
- క్యూలైన్లో మరికొంత మంది ఎమ్మెల్యేలు : దానం నాగేందర్

6లో..

కేజ్రీవాల్ విడుదలకు బ్రేక్

- ఢిల్లీ హైకోర్టు స్టే
- మంగళవారం తుది నిర్ణయం
- అప్పటి వరకు జైల్లోనే



వివరాలు 13లో

కవిత కస్టడీ పొడిగింపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి పొడిగించింది. జులై 5 వరకు పొడిగిస్తూ స్పెషల్ జడ్జి ఉత్తర్వులు వెలువరించారు. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో శుక్రవారం కవితను ...13లో

మెగాడీఎస్సీకి 2.79 లక్షల దరఖాస్తులు

- ఎస్‌ఏకు 1.60 లక్షల మంది, ఎస్జీటీకి 85,916 మంది అప్లై
- లాంగ్వేజ్ పండిట్‌కు 18,211, పీఈటీలకు 11,992 దరఖాస్తులు
- స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు 3,551 మంది అప్లై

ఉచితంగా 23,919 మంది దరఖాస్తు

వివరాలు 3లో



పడావేనా..!

నిర్మాణం పూర్తైనా ఇచ్చుడెప్పుడో..

- డబుల్ ఇండ్ల కోసం లబ్దిదారుల ఎదురుచూపులు
- చాలా చోట్ల అసంపూర్తిగా ఇండ్లు...
- అలాట్‌మెంట్ చేసినచోటా పట్టాలివ్వలే...పొసెషన్ చూపలే
- పూర్తయిన వాటిని పేదలకు పంపిణీ చేయాలి : సీపీఐ(ఎం)

డబుల్ ఇండ్ల నిర్మాణంలో గత ప్రభుత్వం ఊరించి ఊరించి చివరికి చేతులెత్తేసింది. లక్షలాది మంది నిరుపేదల ఆశలను వమ్ముచేసింది. కొంతమందికే ఇచ్చి చేతులు దులుపేసుకుంది. సకాలంలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేయకుండా, పూర్తైన ఇండ్లను అర్హులైన పేదలకు కేటాయించకుండా, కేటాయించిన ఇండ్లకు పొసెషన్ చూపకుండా గందరగోళం సృష్టించింది. ఎన్నికల వేళ కొన్నిచోట్ల హడావుడి చేసి అలాట్‌మెంట్ చేసినా పట్టాలిచ్చి ఇండ్లు అప్పగించని పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని ప్రకటించింది. అయితే వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న వేలాది డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలని పేదలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వం ఇండ్లులేని పేదల కోసం డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వీటిని కేటాయించి నిర్మాణం చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 292938 ఇండ్లను నిర్మించాలని మంజూరు చేసింది. ఇందుకోసం రూ.12560 కోట్లను ఖర్చు చేసింది. మంజూరైన ఇండ్లల్లో 154389 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. వీటిలో కొన్నింటిని పేదలకు అలాట్ చేసి అప్పజెప్పారు. మరో 41925 ఇండ్లు నిర్మాణం చివరి దశలో ఉన్నాయి. ఇంకో 34022 ఇండ్లు మాత్రం వివిధ దశల్లో నిర్మాణం ఆగిపోయి ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 3506 డబుల్ ఇండ్ల కోసం మంజూరయ్యాయి. అయితే 4198 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. సిద్దిపేట జిల్లా కేసీఆర్, హరీశ్‌రావు ఇలాకా కావడంతో ఏకంగా 15860 డబుల్ బెడ్‌రూం ఇండ్ల మంజూరు చేశారు. వీటిల్లో 11803 ఇండ్ల నిర్మాణం పూర్తవ్వగా మరో 4 వేల ఇండ్ల నిర్మాణ పనులు స్థల వివాదాల వల్ల ప్రారంభం కాలేదు. మెదక్ జిల్లాలోనూ 1500 ఇండ్లు మంజూరవ్వగా 1250 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ ఇండ్ల ...13లో

ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి



కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

- మియాపూర్‌లో మహిళల ధర్నా

వివరాలు 13లో

ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లల్లో యథేచ్ఛగా పుస్తకాల అమ్మకాలు

అధిక ధరలకు విక్రయం తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

పుస్తకాల గదిని సీజ్ చేసిన అధికారులు

హిమాయత్‌నగర్ శ్రీ చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ అమ్మకాలను నిషేధిస్తూ ఇటీవల హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి సర్క్యులర్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా లెక్కచేయకుండా కొన్ని పాఠశాలలు యథేచ్ఛగా బుక్స్, యూనిఫామ్స్ అధిక ధరలకు అమ్ముతున్నాయని సమాచారం అందడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు హిమాయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద ధర్నాకు దిగారు. అనంతరం మండల డిప్యూటీ ఐవోఎస్ సుమన్‌కు సమాచారం అందించగా.. ఆయన అక్కడకు చేరుకుని పాఠశాల ఆవరణలోని పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలు అధికారుల మాటలు పెడచెవిన పెట్టి పుస్తకాలు, బట్టలు, టై, బెల్ట్‌లు అమ్ముతున్నాయని చెప్పారు. యూకేజీకి రూ.5400 నుంచి.. పదో తరగతికి రూ.18వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, టెక్నో, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ పేర్లతో బుక్స్ విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్ చేగువేరా, స్టాలిన్, శ్రీమాన్ లక్ష్మణ్, స్టాలిన్ విఘ్నేష్, భగత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 571 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డినీ, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు.

శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 575 దరఖాస్తులు అందాయని తెలిపారు.

రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 185, హౌసింగ్ 64, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖలకు 50, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 43, హోం శాఖకు సంబంధించి 42, ఇతర శాఖలకు సంబంధించి 191 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

28 నుంచి టీపీబీవో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీవో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 28 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల రెండో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ఆప్షన్ల నమోదు కోసం వెబ్ లింక్‌ను అందిస్తామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం ఎంపికైన అభ్యర్థుల వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంట తెచ్చుకోవాలని కోరారు. 175 టీపీబీవో పోస్టుల భర్తీకి 2022, సెప్టెంబర్ ఏడో తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

బీజేపీ, కాంగ్రెస్ లను
తెలంగాణ క్షమించదు

సింగరేణి గనుల వేలంపై కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి గనుల వేలంలో పాల్గొన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తెలంగాణ ఎన్నటికీ క్షమించబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు పార్టీలను గెలిపిస్తే తెలంగాణ జాతి ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గనుల వేలాన్ని వ్యతిరేకించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడెందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

ఆ సంస్థకు మరణశాసనం రాసే విధంగా గనుల వేలంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు నిస్సిగ్గుగా పాల్గొన్నారని కేటీఆర్ విమర్శించారు. ఇది కాంగ్రెస్ అవకాశవాద వైఖరిని తెలుపుతున్నదని తప్పుపట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించలేకపోతున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకెళ్లి ఫిరాయింపుల డ్రామాలాడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఆగమైందనీ, బీజేపీ నీతి లేని నిర్ణయాల్లో కాంగ్రెస్ కూడా భాగమైందనీ ఆరోపించారు.

ఉద్యోగం పేరుతో 150 మందిపై లైంగిక దాడి

బీహార్‌లో దారుణం వెలుగులోకి...

పాట్నా : ఉద్యోగాలిస్తామని ఆశచూపి 150 మంది మహిళలను రప్పించి వారిని బంధించి కొన్ని నెలలుగా లైంగిక దాడి చేస్తున్న కంపెనీ నిర్వాహకుల దారుణం బయటపడింది. బీహార్‌లో ఈ దారుణ ఉదంతం వెలుగుచూసింది. డీబీఆర్ నెట్‌వర్క్ పేరుతో వీరు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చేవారు.

కాల్‌సెంటర్‌కు మహిళా ఏజెంట్లు కావాలని ప్రకటించేవారు. అది నమ్మి ఇండ్ల నుంచి ఉద్యోగాల కోసం వచ్చిన మహిళలను ఒక రూములో బంధించి వారిపై నెలల తరబడి లైంగిక దాడి చేసేవారు. ఎవరికైనా చెబితే అంతుచూస్తామని బెదిరించే వారు. ఇలా 150 మంది మహిళలను వీరు బందీలుగా చేసి అకృత్యాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

ప్రజలపై ఆర్థిక ఒత్తిడి

ఇబ్బందుల్లో మూడింట ఒక వంతు మంది

- పెరిగిన కిరాణా సామగ్రి వ్యయం : కాంతర్ రిపోర్ట్



న్యూఢిల్లీ : భారత్‌లోని దాదాపు మూడింట ఒక వంతు మంది తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం ఇప్పటికే భారీగా పెరిగిన ధరలని స్పష్టమవుతోంది. ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయి నుంచి కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ వినియోగదారులు తమ ఖర్చులను నిర్వహించడం కష్టంగా మారిందని మార్కెట్ పరిశోధన సంస్థ కాంతర్ తన ఎఫ్ఎంసిజి పల్స్ రిపోర్ట్‌లో పేర్కొంది.

"ద్రవ్యోల్బణం కొంత స్థాయికి తగ్గుముఖం పట్టి ఉండవచ్చు. కానీ దాని ప్రతిఫలం వినియోగదారునికి చేరలేదు. రెండేళ్ల క్రితం నాటితో పోల్చితే మార్చి 2024తో ముగిసిన తొలి త్రైమాసికం(క్యూ1)లో సగటు వినియోగదారుడి వ్యయం 18 శాతం పెరిగింది. మూడు నెలలకు గాను ఒక సాధారణ భారతీయ కుటుంబ ఖర్చు రూ.49,418కి పెరిగింది. గ్రామీణ ప్రాంతంలోనూ రూ.41,215గా నమోదయ్యింది. గ్రామీణ కుటుంబాలతో పోల్చితే పట్టణ ప్రాంతం వారు ఆరు రెట్లు ఎక్కువ వ్యయం చేస్తారు. తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు మూడు మాసాల్లో కేవలం రూ.38,000 ఖర్చు చేస్తాయి. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చుల కంటే 0.9 రెట్లు ఎక్కువ." అని కంతార్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. దేశంలోని దక్షిణ ప్రాంతం ఇప్పుడు అత్యధికంగా ఖర్చు చేస్తుందని వెల్లడించింది. గత రెండేళ్లలో ఈ ప్రాంత ఖర్చులు 35 శాతం పెరిగాయని పేర్కొంది. త్రైమాసికంలోని మొత్తం వ్యయాల్లో 24 శాతం కిరాణా సామగ్రికే సరిపోతుంది.

జూన్ 2022 నుండి గృహోపకరణాలపై ఖర్చు 19 శాతం పెరిగింది. ఇది గృహ ఖర్చులలో త్రైమాసికానికి రూ.2,000 పెరిగింది. దీంతో కుటుంబాలు తమ ఖర్చులను నిర్వహించడం కష్టంగా మారింది. ఈ లెక్కన దేశంలో మూడవ వంతు కుటుంబాలు ఇప్పటికీ తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నాయి.

పార్లమెంట్‌లో సమరమే...

ప్రశ్నించటానికి ప్రతిపక్షాలు సిద్ధం

- నీట్, యూజీసీ-నెట్ నుంచి రైల్వే భద్రత వరకు
- ప్రతీ అంశాన్నీ లేవనెత్తే అవకాశం
- ప్రొటెం స్పీకర్ ఎంపిక పైనా 'ఇండియా' బ్లాక్ ఆందోళన
- ఆసక్తికరంగా మొదటి లోక్‌సభ సమావేశం
- ఆత్మరక్షణలో అధికార బీజేపీ సర్కారు
- రాజకీయ విశ్లేషకులు, నిపుణుల అంచనాలు



న్యూఢిల్లీ : మొదటి లోక్‌సభ సమావేశం కేంద్రంలోని అధికార బీజేపీకి సంక్లిష్టంగా మారనున్నదా? కాంగ్రెస్ వంటి ప్రధాన ప్రతిపక్షంతో పాటు ఇండియా బ్లాక్‌లోని పార్టీలు కాషాయ సర్కారును నిలదీయటానికి సిద్ధమయ్యాయా? అంటే అవుననే సమాధానాన్ని వినిపిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. 18వ లోక్‌సభ మొదటి సమావేశం ఈనెల 24 నుంచి జులై 3 వరకు జరగనున్నది. కేంద్రంలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లేకపోవటం, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం, ప్రతిపక్షం గతం కంటే బలంగా మారటంతో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

నీట్-యూజీ, యూజీసీ-నెట్ వివాదాలు ఇప్పటికే దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీశాయి. అలాగే, పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల చోటు చేసుకున్న రైల్వే ప్రమాదమూ మరొకసారి రైల్వే భద్రత సమస్యపై ఆందోళనను కలిగిస్తున్నది. ఈ అంశాలు 18వ లోక్‌సభ మొదటి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశమున్నదనీ, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో 18వ లోక్‌సభ మొదటి సెషన్ ఎన్డీఏ సర్కారుకు సంక్లిష్టంగా మారనున్నదని వారు అంటున్నారు. మొత్తానికి మోడీ సర్కారు ఆత్మరక్షణలో పడనున్నదని చెప్తున్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా ఎన్డీఏయేతర పక్షాల ఇష్యూ-బేస్డ్ కామన్ ఫ్రంట్‌ను సమీకరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నందున సోమవారం నుంచి ప్రారంభమయ్యే మొదటి సెషన్ ఆసక్తికరంగా మారనున్నదని చెప్తున్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక వంటి అంశాలపై కేంద్రంతో ఏకాభిప్రాయానికి రావటానికి ఇండియా కూటమి మొదట్లో సానుకూలంగా ఉన్నప్పటికీ, ఎనిమిది పర్యాయాలు కాంగ్రెస్ ఎంపీగా ఉన్న కొడిక్కున్నిల్ సురేష్‌ను ప్రొటెమ్ స్పీకర్‌గా ఎన్నుకోకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ప్రతిపక్ష శిబిరంలోని వర్గాలు తెలిపాయి. కటక్ నుంచి ఏడు సార్లు విజయం సాధించిన బీజేపీ ఎండీ భర్తృహరి మహతాబ్ ప్రొటెమ్ స్పీకర్‌గా వ్యవహరిస్తారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ప్రకటించిన విషయం విదితమే. అయితే, దీనిని కాంగ్రెస్ తప్పుబడుతున్నది. "ప్రధాన భాగం(బీజేపీ)కు లోక్‌సభలో మెజారిటీ లేదని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. 2014 నుంచి 2024 వరకు చేసినట్టుగా చేయగలమని వారు(బీజేపీ ప్రభుత్వం) భావిస్తే, పొరబడినట్టే. అది వారికి ప్రమాదమని వారు త్వరలోనే తెలుసుకుంటారు" అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎంపీ మనీశ్ తివారీ అన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇది సభలో మెజారిటీ కంటే 32 సీట్లు తక్కువ. మరోపక్క, ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 మంది ఎంపీలు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి అత్యధికంగా 99 మంది ఎంపీలు ఉన్న విషయం విదితమే. "కె సురేష్ ఎనిమిది పర్యాయాలు దళిత ఎంపీగా ఉన్నారు. ప్రోటెమ్ స్పీకర్ పదవికి అతడిని కాదని ఏడుసార్లు గెలిచిన తమ ఉన్నత తరగతి ఎంపీని ఎంచుకున్నది. ఇది దేనిని చూపిస్తుంది?" అని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ప్రశ్నించారు.

వివిధ మతాలు, లింగాలు, కులాలు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 543 మంది ఎంపీల ప్రమాణ స్వీకారానికి తమ సామాజికవర్గ సభ్యుడు అధ్యక్షత వహించే మైలురాయి అవకాశాన్ని మోడీ ప్రభుత్వం భారత్‌లోని దళిత వర్గానికి నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో ఆరోపించారు. "పార్లమెంటులో మోడీ గత పదేండ్లుగా వ్యవహరిస్తున్న తీరుకు భిన్నంగా వ్యవహరిస్తారని నేను ఆశించటం లేదు. ఆయన పార్లమెంటుకు గైర్హాజరవుతారు. మొదటి రోజు పార్లమెంట్ హౌస్ వెలుపల మీడియాతో మాట్లాడతారు. ప్రశ్నలకు దూరంగా ఉంటారు. ఆయన హౌస్ లోపల ఇండియా కూటమి నుంచి ఎటువంటి ప్రశ్నలనూ తీసుకోరు. తన ఇమేజ్‌ను కాపాడుకోవటానికి తన జూనియర్ మంత్రులకు వదిలివేస్తాడు. నీట్-యూజీ, అగ్నివీర్ లేదా దేనిపైనా ఎటువంటి ప్రకటనా ఉండదు"అని గొగోయ్ ఒక ఆంగ్ల వార్త మాధ్యమంతో అన్నారు. కాగా, కొన్ని సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష నేతలు శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ), వైసీపీ వంటి ఎన్డీఏయేతర పార్టీలు కూడా తమతో టచ్‌లో ఉన్నాయని ఇండియా కూటమి చెప్తున్నది.

సెషన్‌లో మొదటి రెండు రోజులు కొత్త ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం బుధవారం జరగనున్నది. స్పీకర్ ఎంపిక గురువారం జరగనున్నది. దీని తరువాత జులై 3 వరకు ప్రభుత్వ వ్యవహారాలు జరుగుతాయి. ఈ సమయంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య చర్చ హెూరాహెూరీగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాగా, దేశంలో ప్రస్తుతం నెలకొన్న కొన్ని పరిస్థితులు తమ ప్రభుత్వానికి మచ్చను తీసు కొచ్చాయనీ, సభలో ఇవి తమను డిఫెన్స్‌లోకి నెట్టేస్తాయని బీజేపీ నాయకులే చెప్తుండటం గమనార్హం. యూజీసీ-నెట్ పరీ క్షను రద్దు చేయటం, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్‌పై బీహార్, గుజరాత్‌లలో పోలీసుల విచారణ ప్రభుత్వానికి సంక్లిష్ట పరిస్థితులను తీసు కొచ్చాయని మరొక బీజేపీ సీనియర్ నాయకుడు అన్నాడు. బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంస్థలలో కూడా ఈ అంశం ఆందో ళన కలిగిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఆరెస్సెస్ వెంచర్‌గా యోగా

ఆకాశానికెత్తిన మోడీ



శ్రీనగర్ : వ్యక్తిగత శారీరక వ్యాయామానికి సంబంధించిన యోగాకు జాతీయ ప్రతిపత్తి కల్పించడమే గాక, ఐక్యరాజ్యసమితిపై ఒత్తిడి తెచ్చి జూన్21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా మార్చిన ప్రధాని నరేంద్ర మోడీ ఈ సారి యోగా విన్యాస ప్రదర్శనకు కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ము కాశ్మీర్‌లోని ఎస్‌కెఐసిసిని వేదికగా ఎంచుకున్నారు. దాల్ సరస్సు ఒడ్డున ఎస్‌కెఐసిసి లాన్స్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తొలుత భావించారు, కానీ కుండపోతగా వర్షం కురుస్తుండడంతో లోపలే నిర్వహించారు. మానవాళికి మంచి చేయడానికి శక్తివంతమైన సాధనం యోగా అని ఆయన అభివర్ణించారు. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యోగాను కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డు కార్యక్రమంగా మార్చింది. అన్ని యూనివర్శిటీలు, కాలేజీల్లోను, ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లోను యోగా దేను పాటించేలా చేస్తోంది. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతం తాలూకు భారాన్ని మోయకుండా వర్తమానంలో ప్రజలు సంతోషంగా జీవించేందుకు ఈ యోగా ఉపకరిస్తుందని ప్రధాని ఉద్బోధించారు.

మానవాళి సంక్షేమం, సంతోషం తమ చుట్టూ వున్నవారి సంతోషంతో, సంక్షేమంతో ముడిపడి వుంటుందని, ప్రపంచవ్యాప్తంగా యోగా చేసేవారి సంఖ్య పెరుగుతూ వస్తోందని యోగా గొప్ప తనం గురించి ఉపన్యాసమిచ్చారు .

యోగా గురువుగా పేరొందిన రాందేవ్ బాబా హరిద్వార్‌లో ఔషధ ఫ్యాక్టరీ పెట్టి ఆ ఉత్పత్తులను అమ్ముకోడానికి దీనిని ఒక సాధనంగా ఎలా వాడుకున్నదీ, ఎన్ని అక్రమాలకు పాల్పడినదీ పాఠకులకు విదితమే.. యోగాను వ్యాపారీకరించేందుకు రాందేవ్‌లాంటి వారు ప్రయత్నిస్తే, ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలు దీనిని ఒక ముసుగుగా చేసుకుని మత పరమైన సమీకరణకు యత్నిస్తోందని కొందరు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. శారీరక వ్యాయామ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడం, పెద్దయెత్తున బహిరంగ ప్రచారం చేయడం ఆరెస్సెస్ ప్రాజెక్టులో భాగమేనన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

ప్రకటించిన రష్యా, వియత్నాం

హనోయ్, మాస్కో : సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నట్లు వియత్నాం, రష్యాలు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

వియత్నాంలో అధికారిక పర్యటన జరుపుతున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, వియత్నాం అధ్యక్షుడు టొ లామ్‌తో చర్చలు జరిపిన తర్వాత ఈ ప్రకటన వెలువడింది. విద్య, న్యాయం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే ఒప్పందాలపై కూడా ఇరువురు నేతలు సంతకాలు చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచాలని, ఉన్నత స్థాయిలో పరస్పర మార్పిడులను పటిష్టపరుచుకోవాలని నిర్ణయించారు. సాంప్రదాయబద్ధంగా రష్యా, వియత్నాం మధ్య నెలకొన్న సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవాల్సి వుందని, అందుకు రష్యా అధిక ప్రాముఖ్యతను ఇస్తుందని పుతిన్ పేర్కొన్నారు. సమానత్వం, పరస్పర గౌరవం, అభివృద్ధిని కొనసాగించడం అన్న సూత్రాల ప్రాతిపదికన ఇరు దేశాల మధ్య సంబంధాలు కొనసాగుతాయని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వున్నా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే రష్యా లక్ష్యమని వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్‌తో జరిగిన సమావేశంలో పుతిన్ చెప్పారు.

తృణమూల్ ఎమ్మెల్యేకు సీబీఐ నోటీసులు

కోల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎమ్మెల్యే తపస్ సాహాకు సిబిఐ శుక్రవారం సమన్లు జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో చేపట్టిన నియామకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు ఓ అధికారి తెలిపారు. రిక్రూట్ మెంట్ స్కామ్ కేసులో తెహట్టా ఎమ్మెల్యే తపస్ సాహాకు నోటీసులు జారీ చేశామని అన్నారు. సీబీఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్లు తపస్ సాహా పేర్కొన్నారు.

మెగా డీఎస్సీకి 2.79 లక్షల దరఖాస్తులు

- ఎస్ఏకు 1.60 లక్షల మంది, ఎస్జీటీకి 85,916 మంది అప్లై
- లాంగ్వేజ్ పండిట్‌కు 18,211, పీఈటీలకు 11,992 దరఖాస్తులు
- స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులకు 3,551 మంది అప్లై
- ఉచితంగా 23,919 మంది దరఖాస్తు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే గడువు గురువారంతో ముగిసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా డీఎస్సీకి 2,85,288 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. వారిలో 2,79,966 మంది దరఖాస్తులను సమర్పించారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 74,162 మంది అభ్యర్థులు దరఖాస్తులను సవరించారని పేర్కొన్నారు. 2,629 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 1,60,296 దరఖాస్తులొచ్చాయని తెలిపారు. 6,508 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 85,916 మంది దరఖాస్తు చేశారని వివరించారు. 727 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 18,211 మంది, 182 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 11,992 మంది అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించారని పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో 220 ఎస్ఏ పోస్టులకు 1,455 మంది, 796 ఎస్జీటీ పోస్టులకు 2,096 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. 11,062 ఉపాధ్యాయ పోస్టులకు 2,79,966 దరఖాస్తులొచ్చాయని వివరించారు. టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించడం వల్ల దరఖాస్తు ఫీజును రూ.వెయ్యికి పెంచిన విషయం తెలిసిందే. దీంతో టెట్ ఫలితాల తర్వాత అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డీఎస్సీకి ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 24,975 మంది సున్నా ఫీజు చెల్లించగా, వారిలో 23,919 మంది దరఖాస్తులను సమర్పించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. వచ్చేనెల 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. అభ్యర్థులు ఇతర వివరాలకు **https://schooledu.telangana.gov.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్‌లో అత్యధికం... మేడ్చల్‌లో అత్యల్పం

మెగా డీఎస్సీకి హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 27,027 మంది దరఖాస్తు చేశారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో 15,610 మంది, నిజామాబాద్‌లో 13,166 మంది, ఖమ్మంలో 12,970 మంది, వికారాబాద్‌లో 12,856 మంది, సూర్యాపేటలో 11,907 మంది, సిద్దిపేటలో 11,021 మంది, నాగర్ కర్నూల్‌లో 10,651 మంది, భద్రాద్రి కొత్తగూడెంలో 10,219 మంది అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించారు. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 2,265 మంది దరఖాస్తు చేశారు. ఆ తర్వాత జయశంకర్ భూపాలపల్లిలో 2,828 మంది, ములుగులో 2,908 మంది, జనగామలో 3,096 మంది, యాదాద్రి భువనగిరిలో 4,398 మంది, పెద్దపల్లిలో 4,251 మంది అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించారు.

మెగా డీఎస్సీ పోస్టులు, దరఖాస్తుల వివరాలు

పోస్టు కేటగిరీ	పోస్టులు	దరఖాస్తులు
ఎస్ఏ	2,629	1,60,296
ఎస్జీటీ	6,508	85,916
ఎల్పీ	727	18,211
పీఈటీ	182	11,992
మొత్తం	10,046	2,76,415
స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు		
ఎస్ఏ	220	1,455
ఎస్జీటీ	796	2,096
మొత్తం	1,016	3,551
మొత్తం	11,062	2,79,966

తక్షణమే జోక్యం చేసుకోండి

నూతన క్రిమినల్ చట్టాలపై స్టే విధించేలా చూడండి

- ఇండియా బ్లాక్ నాయకులు, ఎన్డీఏ మిత్రపక్షాలను కోరిన పౌర సమాజంలోని 3600 మందికి పైగా ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : మోడీ సర్కారు త్వరలో అమలులోకి తీసుకురాబోతున్న నూతన క్రిమినల్ చట్టాల విషయంలో దేశవ్యాప్తంగా పౌర సమాజం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

కొత్త క్రిమినల్ చట్టాలు వచ్చే నెల 1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రాబోతున్న విషయం విదితమే. అయితే, ఈ చట్టాలను నిలిపివేసేలా తక్షణ జోక్యం చేసుకోవాలని ఇండియా బ్లాక్ నాయకులు, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మిత్రపక్షాలను పౌర సమాజ ప్రముఖులు కోరారు.

ఈ మేరకు 3600 మందికి పైగా తమ సంతకాలతో కూడిన లేఖలను పంపారు. వీరిలో తుషార్ గాంధీ, తానికా సర్కార్, హెన్రీ టిఫాగ్నే, మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ వొంబత్కెరే, తీస్తా సెతల్వాడ్, కవితా శ్రీవాస్తవ, షబ్నమ్ హష్మీలతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆర్ఎల్డీ జాతీయ చైర్మెన్ జయంత్ చౌదరి, ఇండియా బ్లాక్‌లోని అన్ని భాగస్వామ్య పక్షాలకు వీరు తమ ఆందోళనలను వెలిబుచ్చారు.

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీపీఐ(ఎం) సెక్రెటరీ జనరల్ సీతారాం ఏచూరి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రధాన కార్యదర్శి, తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ అధ్యక్షుడు, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత హేమంత్ సోరెన్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్చంద్ర పవార్) చీఫ్ శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నాయకుడు అఖిలేష్ యాదవ్, శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాక్రే సహా పలు ఇండియా, ఎన్డీఏ మిత్రపక్షాలకు పౌర సమాజ ప్రముఖులు తమ పిటిషన్‌ను పంపారు. జులై 1 నుంచి అమల్లోకి రానున్న ప్రజావ్యతిరేక కొత్త క్రిమినల్ చట్టాలను నిలిపివేసేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని వారు అందులో కోరారు.

జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ, న్యాయ నిపుణుల సంప్రదింపులు, పార్లమెంట్‌లో ప్రతిపాదిత సంస్కరణలపై అర్థవంతమైన చర్చ జరగాలని అభ్యర్థించారు. " 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 2023', 'భారతీయ న్యాయ సంహిత, 2023', 'భారతీయ సాక్ష్యా అధినియం, 2023' అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాల రూపంలో దేశంపై తీవ్రమైన ముప్పు ఉన్నది. చర్చ లేకుండానే 2023 డిసెంబర్ 20న పార్లమెంట్‌లో హడావిడిగా వీటిని తీసుకొచ్చారు.

ఈ చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి రావడానికి షెడ్యూల్ చేయబడ్డాయి. ప్రధాన ఆందోళన ఏమిటంటే, అప్పటి చట్టాలలో చేసిన సవరణలు చాలావరకు క్రూరమైన స్వభావం కలిగి ఉన్నాయి. ముఖ్యంగా, ప్రభుత్వం కొత్త చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి ఎంచుకుంటే.. ఈ కొత్త క్రిమినల్ చట్టాలు మన ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయటానికీ, భారత్‌ను ఫాసిస్ట్ రాజ్యంగా మార్చటానికి ప్రభుత్వానికి తగిన శక్తినిస్తాయి. ప్రతిపాదిత కొత్త చట్టాలు చట్టాన్ని గౌరవించే ప్రజాస్వామ్య ప్రత్యర్థులు, అసమ్మతివాదులు, కార్యకర్తలను నాటకీయంగా అరెస్టు చేయటం, నిర్బంధించటం, ప్రాసిక్యూషన్, జైలు శిక్షను నాటకీయంగా పెంచటానికి ప్రభుత్వానికి అనుమతినిస్తుంది" అని పౌర సమాజ ప్రముఖులు పేర్కొన్నారు.

సంపన్న ఎంపీలు

సగటు పట్టణ గృహాల కంటే 27 రెట్లు ధనవంతులు

- 75 శాతం కంటే ఎక్కువ మంది ఎంపీల ఆస్తులు రూ. 3 కోట్ల పైనే

న్యూఢిల్లీ : దేశంలో ఇటీవల ముగిసిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో పలు పార్టీల నుంచి గెలుపొందిన ఎంపీలు, పోటీలో ఉన్న అభ్యర్థులూ ధనవంతులే ఉన్నారు. వివిధ పార్టీల నుంచి విజయంసాధించిన ఎంపీలు.. సగటు పట్టణ గృహాల కంటే 27 రెట్లు సంపన్నులుగా ఉన్నారు. దేశంలోని అగ్రశ్రేణి 10 శాతం పట్టణ కుటుంబాలకు సమానమైన ఆస్తులతో పలు పార్టీలలో ధనవంతులు ఉన్నారు. అలాగే, 75 శాతం కంటే ఎక్కువ మంది ఎంపీల సగటు ఆస్తులు రూ. 3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువే కావటం గమనార్హం.

అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్లలో సమర్పించిన సమాచారం ప్రకారం.. 2024 ఎన్నికలలో గెలిచిన అభ్యర్థుల మధ్యస్థ ఆస్తి విలువ రూ.7.4 కోట్లుగా ఉన్నది. దాదాపు 92 శాతం మంది విజేతలు రూ. 1 కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. అయితే వారిలో 75 శాతం మంది రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. 2024లో రన్నరప్ అభ్యర్థుల మధ్యస్థ ఆస్తి విలువ రూ.6.25 కోట్లు. వీరిలో దాదాపు 88 శాతం మంది రూ. 1 కోటి లేదా అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. 68 శాతం మంది రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగి ఉండటం గమనార్హం. 2019లో అభ్యర్థుల ఆస్థి విలువలు ఈ విధంగా ఉన్నాయి. గెలిచిన అభ్యర్థి మధ్యస్థ ఆస్తి రూ.4.8 కోట్లుగా ఉన్నది. దాదాపు 95 శాతం మంది విజేతలు రూ. 1 కోటి లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. వారిలో 88 శాతం మంది ఆస్తుల విలువ రూ. 3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండటం గమనార్హం.

2019 ఎన్నికలలో రన్నరప్‌గా నిలిచిన అభ్యర్థుల మధ్యస్థ ఆస్తి విలువ రూ.5.4 కోట్లు. వారిలో దాదాపు 85 శాతం మంది రూ. 1 కోటి లేదా అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. 63 శాతం మందికి రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయి. విజేతలు, రన్నరప్‌లుగా నిలిచిన అభ్యర్థులు రూ. 1 కోటి కంటే ఎక్కువ విలువైన ఆస్తులను కలిగి ఉండటానికి పార్టీలు ధనవంతులైన అభ్యర్థులను మాత్రమే నిలబెట్టటం కారణం. 2024లో టాప్ 27 పార్టీల అభ్యర్థుల మధ్యస్థ ఆస్తులు కనీసం రూ. 1 కోటిగా ఉన్నది. రెండు ప్రధాన జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల విలువలు వరుసగా రూ.7.6 కోట్లు, రూ.5.4 కోట్లుగా ఉన్నది.

ఆలిండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే- 2019 అంచనా ప్రకారం.. పట్టణ కుటుంబాల్లోని ఆస్తుల సగటు విలువ రూ.27.1 లక్షలు. గ్రామీణ కుటుంబానికి సంబంధించిన గణాంకాలు రూ.15.9 లక్షలుగా ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే.. 2024లో గెలిచిన అభ్యర్థి సగటు ఆస్తులు సగటు పట్టణ కుటుంబ ఆస్తి కంటే 27 రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రన్నరప్ అభ్యర్థి విషయంలో 23.1 రెట్లు ఎక్కువగా ఉన్నది. పట్టణ ప్రాంతాల్లోని సంపన్న 10 శాతం కుటుంబాల సగటు ఆస్తి రూ.1.5 కోట్లు. ఇక పార్టీల వారీగా చూస్తే.. బహుజన్ సమాజ్ పార్టీ (రూ. 47 లక్షలు), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (రూ.87 లక్షలు), సీపీఐ(ఎం) (రూ.1 కోటి)లు అత్యల్ప సగటు ఆస్తులు కలిగిన అభ్యర్థులను నిలబెట్టాయి. వారిలో సీపీఐ(ఎం) నుంచి మాత్రమే గెలిచిన అభ్యర్థులు (నలుగురు) ఉన్నారు.

సిగ్నల్ విఫలమైతే అంతా గందరగోళమే !

- పరస్పర విరుద్ధమైన నిబంధనలే కారణం
- ప్రమాదాలు జరిగినపుడు రైళ్ళ రాకపోకల నిర్వహణపై అనుమానాలు

చెన్నై : పెద్ద పెద్ద రైలు ప్రమాదాలు జరిగి, పదుల సంఖ్యలో మరణాలు సంభవించడంతో సిగ్నల్ వైఫల్యాల సమయంలో ముఖ్యంగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అమల్లో వున్న ప్రాంతాల్లో రైళ్ల రాకపోకల నిర్వహణపై గందరగోళం నెలకొం టోంది. గతేడాది జూన్ 2న ఆగ్నేయ రైల్వేలో షాలిమార్-చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌తో సహా మూడు రైళ్ళు భయంకరంగా ఢీ కొన్న ప్రమాదంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతునే వుంది. ఈ ప్రమాదంలో 300 మంది మర ణించగా, 900 మందికి పైగా గాయపడ్డారు. గతేడాది అక్టోబరు 29న ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు రైల్వేలో వాల్తేర్ డివిజన్‌లో రెండు పాసింజర్ రైళ్ళు వెనక నుండి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో 17 మంది మరణించారు. తాజాగా ఈ ఏడాది జూన్ 17న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన కాంచనగంగ రైలు ప్రమాదంలో 10 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదాలన్నిం టికీ ప్రధాన కారణం సిగ్నల్ వైఫల్యంగానే అనుమానిస్తున్నారు. లేదా అటువంటి పరిస్థితుల్లో అమలు చేయాల్సిన రైళ్ళ నిర్వహణా ప్రొటోకాల్స్‌లో గందరగోళం కారణమవుతోంది. మృతుల సంఖ్య పెరుగు తుండడంతో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపి)పై జోనల్ రైల్వస్‌లో అయోమయం, గందరగోళం వుంటోంది. సిగ్నల్ విఫలమైన పుడు స్టేషన్ మాస్టర్లు లోకో పైలట్లకు జారీ చేసే ట్రావెల్ అథారిటీ టిఎ-912ను నిషేధిస్తున్నట్లు తూర్పు రైల్వే ఆదేశాలు జారీ చేసింది. రెడ్ సిగ్నల్ పడినా దాటేందుకు ఈ పత్రం లోకో పైలట్లకు అనమతినిస్తుంది. అయితే ఆ మరుసటి రోజే ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నారు. పొరపాటున జారీ చేసినందున ఆ ఆదేశాలను ఉపసంహరించుకు న్నట్లు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనే జనర్ చెప్పారు. మరో కేసులో, ముంబయి ప్రధాన కేంద్రంగా పనిచేసే పశ్చిమ రైల్వే సిగ్నల్ వైఫల్యాల సమయంలో జారీ చేసిన ట్రావెల్ అథారిటీలపై నెలకొన్న కొన్ని ఆందోళనలకు వివరణలు కోరింది.

పరస్పర విరుద్ధ నిబంధనలు

ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్స్ ఇన్ జనరల్ అండ్ సబ్సిడరీ రూల్స్-2008లో 9వ అధ్యా యంలో పేర్కొన్న నిబంధనలు పరస్పర విరు ద్ధంగా వున్నాయని, వాటిని నిశితంగా సమీక్షిం చాల్సిన అవసరం వుందని అహ్మదా బాద్ డివి జన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఒక పత్రంలో పేర్కొన్నారు. ఆటోమే టిక్ సిగ్నలింగ్ వ్యవస్థలో సిగ్నల్ విఫలమైన సమ యాల్లో రైళ్ళ నిర్వహణకు సంబంధించిన నిబం ధనలను ప్రస్తావిస్తూ అయన ఈ ప్రస్తావన చేశారు.

నవతెలంగాణ

సంపాదకీయం

వేలానికి తందాన!

గత రెండ్రోజులుగా తెలంగాణ ప్రజలు ముఖ్యంగా సింగరేణి గనులున్న ఆ ఆరు జిల్లాలవారూ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రకటనలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అందరూ అయ్యగార్లే రొయ్యల బుట్ట మాత్రం మాయమైందన్నట్టు లేదూ పరిస్థితి! 2022 నవంబరు 12న రామగుండం సభలో భారత ప్రధాని పెద్ద పులి పచ్చగడ్డే తింటుందని ఒట్టేసి మరీ చెప్పారు. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న రీతిలో ఉంది కదూ!

'సింగరేణిని ప్రయివేటీకరించం' అని మోడీ నొక్కివక్కాణిస్తారు కాని వేలం వేస్తారట! వేలం పాటలో ఇల్లు కొన్నవాడు ఆ ఇంట్లో వాడే ఉంటాడు తప్ప పాత ఓనర్ని ఉండనివ్వడనే విషయం ఇంగిత జ్ఞానం ఉన్న వారెవరికైనా తెలిసేదే! వేలం పాటను ఒక విధానంగా కొనసాగిస్తోంది మోడీ సర్కార్. దేశంలోని సుమారు 500 బొగ్గు బ్లాకుల్లో ఇప్పటికే 300 బ్లాకుల వేలం పాట పూర్తయింది. వాటిలో కొత్త ఓనర్ జొరబడిపోయాడు. 'రాజ్యం' వాటా ముగిసిపోయింది.

> కీలకమైన కోల్‌మైన్ రంగంలో ఈ వేలంపాట ప్రక్రియకు తలుపులు తీయడం మరో విధమైన ప్రయివేటీకరణ దారి. విశాఖ స్టీల్ ప్లాంటుకు ఐరన్ ఓర్ క్యాప్టివ్ మైన్స్ ఇవ్వకపోవడం ఆ రకంగా దాన్ని నష్టాల్లోకి నెట్టేయడం, ఆ తర్వాత ప్రయివేటు వారికి ఒప్పగించడం మరో రకమైన ప్రయివేటీకరణ ప్రక్రియ. ఒకటి 16వ శతాబ్దం ఐరోపా గిలెటన్స్ వాడటం. ఇంకోటి 19వ శతాబ్దం అమెరికాలో కరెంట్‌షాక్‌తో చంపేయడం. మరో పద్ధతి 20వ శతాబ్దపు ఉరిశిక్ష. పద్ధతి ఏదైనా ప్రభుత్వరంగాన్ని చంపేయడమే బీజేపీ విధానం.

సింగరేణిలో మూడు బ్లాకులు కొందరు పొందారు. ఆ పొందిన వారితో బీఆర్ఎస్‌కున్న చుట్టరికం గురించి రాష్ట్ర కాంగ్రెస్ నేతల హడావుడి తప్ప అసలు విధానం గురించి ఏ మాటా ఉండదు. మైనింగ్ చట్టం సవరణలపై 2015లో కేసీఆర్ పార్టీ పార్లమెంటులో ఎగబడి బీజేపీని బలపరిచిన సంగతి బీఆర్ఎస్ వారు మాట్లాడరు. వారి హనీమూన్ కాలంలో మూడు బ్లాకులు వేలం పాడుకున్న ఫార్మా కంపెనీ బొగ్గు బయటికి తీసే యంత్రాలు లేక, సాంకేతిక పద్ధతులు రాక బొగ్గు తవ్వలేకపోయారు. ఇవి వారు చెప్పిన మాటలే! అప్పటిదాకా ఆంధ్రప్రదేశ్‌కు టన్ను రూ.3,500 - 4,000ల మధ్య అమ్మే సింగరేణి బొగ్గు 'అందక' బహుశా ఆ సాకుతో టన్నుకి రూ.18 వేలకు ఏకంగా అదానీ దొర నుంచి 17 లక్షల టన్నుల బొగ్గు కొన్నారు. ఈ భారం ఆ రాష్ట్ర ప్రజలు మోయాల్సిందే!



ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేటు ఆసాములకు కట్టబెట్టేందుకు నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ 2021-22 బడ్జెట్‌లో ప్రకటించి 2025 నాటికి మొదట ఆరు లక్షల కోట్లు లీజ్‌పై ప్రయివేటు వారికి అప్పగించాలని, ఆ తర్వాత పదకొండు లక్షల కోట్లు బంగారు పళ్ళెంలో పెట్టి అప్పగించాలని భావించారు. కీలకమైన కోల్‌మైన్ రంగంలో ఈ వేలంపాట ప్రక్రియకు తలుపులు తీయడం మరో విధమైన ప్రయివేటీకరణ దారి. విశాఖ స్టీల్ ప్లాంటుకు ఐరన్ ఓర్ క్యాప్టివ్ మైన్స్ ఇవ్వకపోవడం ఆ రకంగా దాన్ని నష్టాల్లోకి నెట్టేయడం, ఆ తర్వాత ప్రయివేటు వారికి అప్పగించడం మరో రకమైన ప్రయివేటీకరణ ప్రక్రియ. ఒకటి 16వ శతాబ్దం ఐరోపా గిలెటన్స్ వాడటం. ఇంకోటి 19వ శతాబ్దం అమెరికాలో కరెంట్‌షాక్‌తో చంపేయడం. మరో పద్ధతి 20వ శతాబ్దపు ఉరిశిక్ష. పద్ధతి ఏదైనా ప్రభుత్వరంగాన్ని చంపేయడమే బీజేపీ విధానం.

బీఆర్ఎస్ - బీజేపీ సంబంధ బాంధవ్యాలు బీఆర్ఎస్ రాజకీయ అవసరాల చుట్టూనే తిరగడం దారుణమైన విషయం. 2014-18 మధ్య చెట్టాపట్టాలేసుకొని తిరిగేటప్పుడు గనుల ప్రయివేటీకరణకు జై (2015లో), పెద్దనోట్ల రద్దుకు జై (2016లో), జీఎస్టీకి జై (2017లో). ఎక్కడ చెడిందో! ఇప్పుడు డొక్క చించేస్తా, డోలు కట్టేస్తామంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఈ రోజు వేలం పాటని నేటి "హిజ్ మాస్టర్స్ వాయిస్"లో సీమటపాకాయలు మోగాయి. చివరికి 'పాట' ప్రశాంతంగా సాగిపోయింది. అక్కడ ఒక్క నిరసనా జరగలేదు. దేశంలో ప్రయివేటీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో చప్పుడు చేయదు. భట్టి వేలం పాటలో పాల్గొని మా సింగరేణిని కాపాడాలని సన్నాయి నొక్కులు నొక్కితే ఏం ఉపయోగం? ఎవరే విషయం మాట్లాడినా దీన్నే "వాషింగ్టన్ కన్సెన్సస్" అంటారు. అంటే అమెరికాలో తయారై ప్రపంచంలోకి విస్తరించి అనేక పాలక పార్టీలు, వాటి తోకలు ఆమోదం తెల్పుతున్న సిద్ధాంత మిది. దాని ప్రతిరూపాన్నే నేడు రాష్ట్రంలో చూస్తున్నాం. అందరూ సింగరేణిని కాపాడాలనే అంటారు. ఈ వేలం ప్రయివేటీకరణకి దగ్గరిదారని మాత్రం అంగీకరించరు.

మొత్తానికి దేశవ్యాప్తంగా ఉన్న ఈ బ్లాకుల వేలంపాట ప్రక్రియ రేవంత్‌రెడ్డి సౌజన్యంతో, ఇంకా చెప్పాలంటే కేసీఆర్ సౌజన్యంతో కూడా ఏ గొడవా లేకుండా ప్రశాంతంగా ముగిసిపోయింది. మా సింగరేణికే ఇవ్వాలని భట్టి కోరడం, ప్రధానితో మాట్లాడి పరిశీలిస్తామని కిషన్‌రెడ్డి చెప్పటం స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రక్తికట్టింది.

సింగరేణి కార్మికులే కాదు, రాష్ట్ర కార్మికవర్గం తమ నోటికాడి ముద్దని ప్రయివేటు గద్దలు తన్నుకుపోవటాన్ని అనుమతించడమా, లేదా అనే సవాలును స్వీకరించడానికి సిద్ధమవుతారా లేదా అనేది తేలాల్సిన సమయం.

ఇక్కడ మనిషి, మనిషికి ఓ చరిత్ర ఉంది, కానీ.. ఆ చరిత్రను రాసుకోలే. పేగుపేగుకు కరిగిపోయే ఎతలున్నయ్, కానీ.. కథలు రాసుకోలే. ఎదురుదిరగడం, పోరాడటం వాళ్ల జీవ లక్షణం. "పెద్దాయన మల్సూరు ఏమాయె' అని అడిగితే.. 'మా మల్సూరు మరణించనే లేదు' అంటుంటారు ఊరిజనం. ....అవును వీరుడు మరణించడు. అక్షరం ముక్క రాకున్నా! ఆయుధాన్ని పట్టిన ధీరుడు. ప్రజల గుండెల్లో చెరగని చిరస్మరణీయుడు. చిత్రహింసలెన్నో పెట్టినా, పల్లెత్తు రహస్యం కూడా చెప్పనివాడు. అందుకే.. ఈ జాగల రేషమున్నది. వారి పుట్టుకలోనే ధిక్కారమున్నది. చరిత్రను మలచిన ఉద్యమమున్నది.ఆ ప్రాంతానికే చెందిన వ్యక్తి తొట్ల మల్సూర్.

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిలుపకుంట్ల గ్రామానికి చెందిన మల్సూర్1923లో నిరుపేద గీత కార్మిక కుటుంబంలో జన్మించాడు. చదువు, సంపద లేనోళ్లు, పదేళ్ల నుండే పెదకాపు దగ్గర పాలేరు పనిచేస్తూ బతికేవారు. తాటిచెట్లు ఎక్కడం నేర్చుకుంటూ.. పశువులు కాస్తుండగా..జన్నారెడ్డి దొర చేలో పశువులు పడ్డాయి ఇగ అంతే. గడిలో వంగపెట్టి చింత బరిగెలతో సావ బాదితే సలసల మరిగే రక్తం సంఘం పెట్టమన్నది. చావో రేవో తేల్చుకోమన్నది.

మడమ తిప్పని 'మల్సూర్'



చివరకు సంఘం పెట్టి దొరల సంగతేందో చూడాలనుకున్నాడు మల్సూర్. అతలోనే ఊరును సుడిగాలి లెక్క ఓ పాట సుట్టుకుంది. బుస బుస పొంగుకుంటూ పల్లెను పాట కౌగిలించుకుంది. అరని దు:ఖానికి ఆటా పాట ఓదార్పయింది. "చుట్టూ ముట్టు సూర్యాపేట, నట్ట నడుమ నల్లగొండ, దాని పక్క గోల్కొండ, గోల్కొండ ఖిల్ల కింద..గోల్కొండ ఖిల్ల కింద నీ గోరీకడుతాం కొడుకో.. నా కొడకా ప్రతాపరెడ్డి" అని గర్జించింది ఓ గళం. అదే బండి యాదగిరి గెరిల్లా దళం. ఈ పాటే దొర భూస్వామ్యంపై కొరడా ఝులిపించింది. చుట్టుపక్కల 70ఊళ్లల్ల జన్నారెడ్డి దొరదే భూమి. లక్షన్నర ఎకరాలు. వారి కుటుంబానిదే పెత్తనం. ప్రజలంతా పాలేర్లు, కూలీలు. 'బాంచెన్ దొర నీ కాల్మొక్తా..!' అన్న ఎట్టోళ్ళు, మట్టోళ్లకు సైతం ఈ పాట పౌరుషమైంది, ఉద్యమానికి బాటైంది. ఆ దళంలోనే మల్సూర్ గళం కొరసైంది. ఇగ పోరాటం సురువైంది. అప్పుడే దన్ దన్‌మంటూ.. రజాకార్ల సైన్యం దిగింది. యాదగిరి దళంపై తూటాలవర్షం, తిరుమలగిరి ప్రాంతం పడమటి కొండల్లో..ఓ సూర్యుడు ఒరిగాడు.ఆ నేల కొరిగిన చేతుల నుండి చేజారిన బందూక్‌ను అందుకున్న వాడే కామ్రేడ్ తొట్ల మల్సూర్. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కూడా.

ఆశయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిఖార్సయిన వ్యక్తి. ఆచరణ, కార్యాచరణ ఆయన గురితప్పని ఆయుధం, మడమ తిప్పని నాయకుడు. చిరుప్రాయంలోనే చురుకై.. చాకై.. జనానికై ఉద్యమ బాట పట్టాడు. దొర దుర్మార్గపు వ్యవస్థను ఎండగట్టాడు. వెట్టిచాకిరీపై తిరగబడ్డాడు. "పోరాట మంటే..? మరేమీ కాదు. బతకటానికి ప్రయత్నించడమే..ప్రయత్నించు, ప్రతిఘటించూ.. ఎక్కడో ఒక చోట నీ శత్రువు కూలిపోతాడు" అని జనాలను కూడగట్టాడు. నెల్లికుదుర్, కొడకండ్ల, అగామోత్కుర్, ఎనుబాముల రజాకార్ క్యాంపుపై దాడి చేసి మందుగుండ్లు, ఆయుధాలను తెచ్చి దళాలకు పంచి, దొరల పెత్తనాన్ని ఎదిరించినవాడు. ఎర్రబాడు దొర గడికే ఉదరబాంబు పెట్టినోడు మల్సూర్. ఎర్రజెండోళ్లకు ఎదురుబడకుండా ఏ బండ్ల పోతున్నాడో ఎవ్వరికీ తెల్వద్దని పదహారు బండ్లు గట్టి పయనమైన జన్నారెడ్డి ప్రతాపరెడ్డిపై దాడి చేసిన వీరుడు ఎవరో కాదు మల్సూర్. దొర తప్పించుకుంటే.. మరో యుద్ధానికి సిద్ధమైన వ్యూహకర్త. ఎర్రబాడు భూముల్లో, ఎర్ర జెండాలు పాతి పేదలకు భూములు పంచాడు. గుల్బర్గా, అండమాన్ జైళ్లలో నిర్బంధంలో ఉన్నా. "దున్నేవాడిదే భూమి, గీచేవాడిదే చెట్టు" అని హర్రాజు మామ్లాలకు వ్యతిరేకంగా జంగుసైరన్ ఊదాడు. ఇది గీత కార్మిక, వ్యవసాయ కూలీ, పోరాటాలకు ఊతమిచ్చాయి.

'భయపడితే బతుకు లేదు;బరిగిస్తే ఎదురులేదు' అన్న మల్సూర్ గీత కార్మిక సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరు. గీత కార్మిక హక్కులను కాలరాయడం, మూడు రకాల పన్నులు ముక్కు పిండి వసూలు చేస్తున్న తరుణంలో గీతన్నలెవ్వరు పన్నులు కట్టొద్దని పిలుపునిచ్చాడు. మహిప్యూజ్ విధానం రద్దు చేయాలని హక్కేమాలికానా పై ఆందోళనలు చేశాడు. నిప్పులు చెరిగే నిర్బంధంలో కూడా దళ సభ్యులను కంటికి రెప్పలా కాపాడు కున్నాడు. పాలేర్ల జీతాల పెంపుపై పోరాటం నిర్వహించి విజయం సాధించాడు. నాగారం సమితి పదవికి ఎర్రబాడు దొర కొడుకు సుధీర్ రెడ్డి పోటీచేస్తే ఆయన మీద వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. 1996లో జడ్పీటీసీగా దొరల ఏజెంట్లు నిలడితే వారిపై గెలిచి 1999 చనిపోయే వరకూ ప్రజల గుండెల్లో ప్రజాప్రతినిధిగానే ఉన్నాడు. దొరస్వామ్యం గ్రామాల్లో అత్యధిక ప్రజల్ని కూలీలుగా తయారు చేస్తే.. ఆ కూలీలే చివరికి శాశ్వత భూస్వామ్యానికి గోరీగట్టే శిల్పులుగా మారుతా రనడానికి కామ్రేడ్ మల్సూరు జీవితం ఒక చక్కని నిదర్శనం. జోహార్ మల్సూర్.

(జూన్ 23న నూతనకల్‌లో "యోధుడు మల్సూర్" జీవితం - పోరాటం పుస్తకావిష్కరణ సభ)

- భూపతి వెంకటేశ్వర్లు
9490098343

రైల్వే భద్రతపై 'కాగ్' చెప్పిందేమిటి? కేంద్రం చేస్తున్నదేమిటి!

వి. కృష్ణమోహన్

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో పలువురు సిబ్బంది, ప్రయాణికులు మరణించడం, గాయాల పాలవడం బాధాకరం. సరిగ్గా ఏడాది కిందట చోటుచేసుకున్న అత్యంత ఘోరమైన కోర మాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో 296 మంది మరణించి 1100 మందికి పైగా క్షతగాత్రులైన ఘటనను మరువక ముందే దేశవ్యాప్తంగా పలు దుర్ఘటనలు జరిగాయి. కచ్చితంగా చెప్పుకోవాలంటే ఒడిషా రైలు ప్రమాదం నుండి తేరుకోకముందే 40 ప్రమాదాలు జరిగాయి. నిర్వహణా లోపాల కారణంగా రైలు ప్రమాదాలు జరుగుతు న్నాయని, ట్రాక్‌లపై ఒత్తిడి పెరుగుతున్నదని, భద్రతా చర్యలు చేపట్టడం లేదని నిపుణులు ఎన్నిమార్లు మొత్తుకున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. పాఠాలు నేర్వడానికి, చర్యలు తీసుకోవడానికి సిద్ధపడటం లేదు. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదానికి కూడా సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడం, కవచ్ రక్షణ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణాలు కావడం పాలకుల నిర్లక్ష్యంగాక మరేమిటి? ప్రజల ప్రాణాల పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో దీన్ని బట్టే తెలిసిపోతోంది. రైల్వే రంగం ప్రజల ఆస్తి. కార్మికుల కఠోరమైన శ్రమతో భారతీయ రైల్వేలు నిర్మితమయ్యాయి. రైళ్లు, రోడ్లు సామాన్య ప్రజలకు సులభమైన రవాణాను అందించడానికి ఉద్దేశించినవి. ఏ ప్రభుత్వమైనా తన పౌరులకు సరసమైన ధరలకు భద్రతతో అందించాల్సిన సేవలివి. అంతేగాని ప్రయివేటు కార్పొరేట్లకు లాభాలను ఆర్జించి పెట్టేలా భారతీయ రైల్వేలను ప్రయివేటీకరించకూడదు.

'కాగ్' నివేదికను పట్టించుకోరే!

రైళ్లు ప్రయాణించే ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థను నియంత్రించే ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో పొరపాటు కారణంగా బాలాసోర్ ప్రమాదం జరిగిందని రైల్వే బోర్డు, రైల్వే మంత్రి పేర్కొన్నారు. 2017-21 మధ్య కాలంలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలపై కాగ్ ఇచ్చిన నివేదిక వ్యవస్థలో ఉన్న కొన్ని ప్రమాదకరమైన లోపాలను ప్రముఖంగా ఎత్తిచూపింది. రైల్వే ట్రాక్‌ల్లో నిర్మాణపరమైన లోపాలను, అలాగే పాయింట్లు, లైన్లు, కర్వ్‌లు వంటి అంశాలను తనిఖీ చేసి అంచనా వేసే ట్రాక్ రికార్డింగ్ కార్ల సోదాలు 30-100 శాతం తగ్గాయని ఆ నివేదిక పేర్కొంది. పట్టాలు తప్పిన 1129 ఘటనల్లో 422 ఘటనలు ఇంజినీరింగ్ సమస్యలు (ట్రాక్‌ల నిర్వహణ సరిగా లేకపోవడం 171 కేసులు, ట్రాక్ ప్రామాణికాలు పాటించకపోవడం 156 కేసులు) వల్లే జరిగాయని పేర్కొంది. బోగీల చక్రాల్లో లోపాల వల్ల జరిగిన ప్రమాదాలు 182 ఉండగా, పాయింట్లు సరిగా నిర్దేశించక పోవడం, ఇతర పొరపాట్ల కారణంగా 275 ప్రమాదాలు జరిగాయని నివేదిక పేర్కొంది. ఇది ఇలా ఉంటే జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్.సి.ఆర్.బి) రికార్డుల ప్రకారం చూస్తే గడిచిన పదేళ్లలో జరిగిన రైలు ప్రమాదాల్లో 2.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 70 శాతం మంది 2017- 21 మధ్య కాలంలో మరణించారు.

> రైల్వేలలో కనీస అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రయాణికుల భద్రతెలా సాధ్యం? సాధారణ ప్రయాణి కుడిని విస్మరిస్తూ ఆదాయాన్ని గడిస్తున్న రైల్వే శాఖలో ఖాళీగా వున్న 3.11 లక్షల గ్రూప్ సి పోస్టులు, గెజిటెడ్ క్యాడర్‌కి సంబంధించి మంజూరైన 3,018 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. దీంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో మిగిలిన ఉద్యోగులపై విపరీతమైన పని భారం పడుతున్నది. ఈ కారణంగా అనేక మంది మహిళా లోకో పైలట్లు, ఇతర సిబ్బంది రోజుకు 12 గంటలకు మించి సెలవు/విశ్రాంతి లేకుండా నిద్ర లేమితో, బిజీ షెడ్యూళ్లతో పని చేయాల్సి వస్తోంది. రైల్వేలో పనిచేస్తున్న సుమారు 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, చట్టబద్ధ హక్కులను కోల్పోయారు. ప్రశ్నిస్తే సస్పెన్షన్లు, బదిలీలు, శిక్షలు వంటి సమస్యల మధ్య రైల్వే సిబ్బంది పనిచేయడం ఆందోళనకరం.

ట్రాక్ నిర్వహణ లోపాలెన్నో

2017-18లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్.ఆర్.ఎస్.కె) రైల్వే భద్రతా నిధి గురించి కాగ్ ఉటంకించింది. దీని ప్రకారం 1127 పట్టాలు తప్పగా 289 (26 శాతం) మాత్రమే పునరుద్ధరణ పనులకు నోచు కున్నాయి. ట్రాక్ పునరుద్ధరణ పనులకు 2018-19లో నిధుల కేటాయింపు రూ.9607.65 కోట్ల నుంచి 2019-20లో రూ.7417 కోట్లకు తగ్గింది. అత్యంత రద్దీగా ఉండే పశ్చిమ రైల్వే కోసం 2019-20లో మొత్తం వ్యయంలో ట్రాక్ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసినది 3.01 శాతమే కావటం గమనార్హం. భద్రతకు సంబంధించిన పనులకు ఆర్థిక సాయం అందించటానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్న ఏకైక లక్ష్యం కూడా విజయం సాధించలేక పోయింది. పట్టాలు తప్పడానికి ప్రధాన కారణం ట్రాక్ నిర్వహణ లోపాలేనని వివరించింది. భారత రైల్వే లక్షలాది పోస్టుల ఖాళీలతో, నామమాత్రపు అవుట్ సోర్సింగ్‌తో కార్యకలాపాలను నిర్వహించిందని కాగ్ వెల్లడించింది.ట్రాక్‌ల సమర్థవంతమైన నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థ, రోలింగ్ స్టాక్ మొదలైన వాటితో పాటు తగిన సంఖ్యలో నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించడాన్ని నిర్లక్ష్యం చేశారు. అన్నింటికంటే ముఖ్యంగా రైల్వే వ్యవస్థ వివిధ విధుల మధ్య సమర్థవంతమైన సమన్వయంపై ఆధారపడి వుంటుంది. ఇది కూడా నిర్లక్ష్యానికి గురైంది. భద్రతపై 2017లో సమర్పించిన టాస్క్‌ఫోర్స్ సిఫార్సులను అమలు చేయలేదు. పాత ట్రాక్‌ను యుద్ధ ప్రాతిపదికన మార్చాల్సి ఉంటుంది. కానీ ఆర్థిక వనరులు లేమి సాకుతో చేయకపోవడంతో బ్యాక్‌లాగ్ పెరుగుతూనే ఉన్నది. అదే సాకుతో పాతబడిపోయిన సిగ్నల్ గేర్‌ను కూడా మార్చటం లేదు.



> ప్రభుత్వం చేస్తున్న వాదనలు తన స్వంత ఆడిటర్ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' (కాగ్) నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించడం లేదని కాగ్ పేర్కొన్నది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పిన ప్రమాదాలు 1392 (69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీకొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈ ప్రమాదాలకు కారణం 'మానవ తప్పిదం' అని నిందించటం ఒక ధోరణిగా మారింది. నిజానికి ఈ విధమైన ప్రభుత్వ వాదనలు తప్పని కాగ్ నివేదిక నిరూపిస్తున్నది. ట్రాక్‌ల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, వ్యయం, పోస్టుల ఖాళీలపై కేంద్రానిది తీవ్ర నిర్లక్ష్యమని కాగ్ 2022 సెప్టెంబర్ నివేదికలో అక్షింతలు వేసింది. రైల్వే భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ లోపాలు ప్రస్తావించినా కేంద్రం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు.

దిద్దుబాటు చర్యలేవి?

ప్రభుత్వం చేస్తున్న వాదనలు తన స్వంత ఆడిటర్ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' (కాగ్) నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించడం లేదని కాగ్ పేర్కొన్నది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పిన ప్రమాదాలు 1392 (69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీకొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈ ప్రమాదాలకు కారణం 'మానవ తప్పిదం' అని నిందించటం ఒక ధోరణిగా మారింది. నిజానికి ఈ విధమైన ప్రభుత్వ వాదనలు తప్పని కాగ్ నివేదిక నిరూపిస్తున్నది. ట్రాక్‌ల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, వ్యయం, పోస్టుల ఖాళీలపై కేంద్రానిది తీవ్ర నిర్లక్ష్యమని కాగ్ 2022 సెప్టెంబర్ నివేదికలో అక్షింతలు వేసింది. రైల్వే భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ లోపాలు ప్రస్తావించినా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు.

కార్పొరేట్ల సేవలోనే

ప్రారంభించిన రైలునే అట్టహాసంగా మళ్లీ ప్రారంభించడంలో మన ప్రధాని మోడీకి ఉన్న శ్రద్ధ సామాన్యులు ప్రయాణించే రైళ్ల బాగోగులపై లేదనే చెప్పాలి. కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణే అన్నింటికీ పరిష్కారం అనే మానసిక స్థితిలోనే ఇంకా ఉన్నాడు. వాస్తవాలను గమనించి ప్రజల భద్రతకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై కనీసం చర్చించనూ లేదు. పైగా ప్రమాద బాధితులను ఓదార్చే దిక్కూ లేదు. ప్రతి వందేభారత్ రైలు కోసం రైల్వే రూ.115 కోట్లు పైగా వెచ్చిస్తున్న కేంద్రం 2027 తర్వాత బుల్లెట్ ట్రైన్లు ప్రవేశపెట్టనున్నట్టు చెబుతున్నది. అసాధారణ రేట్లుండే ఆ రైళ్లతో సామాన్య ప్రజలకు ప్రయోజనమేంటి? అత్యధిక జనం ప్రయాణించే రైళ్లను కదా బాగు చేయాల్సింది, ట్రాక్‌లను పునరుద్ధరించాల్సింది. సాంకేతిక లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సింది. ఇవన్నీ మరచి అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ల సేవల తరిస్తున్న మోడీ రైల్వేరంగాన్ని పట్టించుకునేదెప్పుడు? గతంలో రైల్వే అభి వృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఉండేవి. ఇప్పుడు ఆ పద్ధతి నిర్వీర్యమైంది. ఫలితంగా ప్రజల భద్రత గాలిలో దీపమైంది. 2011-12లో అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్'ను నెలకొల్పకపోవడం, సిగ్నలింగ్ టెలీ కమ్యూనికేషన్ కింద కేటాయించిన బడ్జెట్‌లో అత్యధికంగా ట్రాఫిక్ ఉన్న రైల్వే మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్ తదితరాలకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోవడం, రైల్వే లైన్లు-సిగ్నల్ వ్యవస్థ-ట్రాకుల ఆధునీకరణ చేపట్టకపోవడం ప్రమాదాలకు కారణం!

అభద్రతలో రైల్వే సిబ్బంది

రైల్వేలలో కనీస అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రయాణికుల భద్రతెలా సాధ్యం? సాధారణ ప్రయాణికుడిని విస్మరిస్తూ ఆదాయాన్ని గడిస్తున్న రైల్వే శాఖలో ఖాళీగా వున్న 3.11 లక్షల గ్రూప్ సి పోస్టులు, గెజిటెడ్ క్యాడర్‌కి సంబంధించి మంజూరైన 3,018 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. దీంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో మిగిలిన ఉద్యోగులపై విపరీతమైన పని భారం పడుతున్నది. ఈ కారణంగా అనేక మంది మహిళా లోకో పైలట్లు, ఇతర సిబ్బంది రోజుకు 12 గంటలకు మించి సెలవు/ విశ్రాంతి లేకుండా నిద్ర లేమితో, బిజీ షెడ్యూళ్లతో పని చేయాల్సి వస్తోంది. రైల్వేలో పనిచేస్తున్న సుమారు 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, చట్టబద్ధ హక్కులను కోల్పోయారు. ప్రశ్నిస్తే సస్పెన్షన్లు, బదిలీలు, శిక్షలు వంటి సమస్యల మధ్య రైల్వే సిబ్బంది పనిచేయడం ఆందోళనకరం.

తక్షణం చేయాల్సినవి

రైల్వే భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించాలి. వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాలి. ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్) పేరిట ప్రవేశపెట్టిన స్కీం గురించి పునరాలోచన చేయాలి. కాగ్, పార్లమెంటరీ ప్యానెల్, నిపుణుల సిఫార్సులను అమలు పరచాలి. భద్రతకు విఘాతం కలిగించే విధానాలను విడనాడాలి. రైలు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో స్వతంత్ర విచారణ జరిపించాలి. రైల్వేలో సాంక్షన్డై ఖాళీగా ఉన్న 3,15,780 పోస్టులను భర్తీ చేయాలి. రైల్వే బడ్జెట్‌లో కోతలు పెట్టకూడదు. అంతేగాక, చార్జీల పెంపు, స్లీపర్ కోచ్‌ల తగ్గింపు, రైళ్లలో రద్దీ, జాప్యం వంటి సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి. రాయితీల ఎత్తివేత, శానిటేషన్, పార్కింగ్ దోపిడీ తదితర సమస్యలను సైతం సత్వరం పరిష్కరించాలి.

సెల్ : 9182189533

రేపటి కామ్రేడ్లు!

— రంగనాయకమ్మ





"'అంతేగా' అనకు! అదేం చిట్టి పొట్టి తేలిక పనా? 'ప్రాణాలు పోతే పోతాయి' అనుకోవాల్సిన పని!"

"అయితే, ఎలా జరగాలి అదంతా? శ్రమ దోపిడీకి గురి అయ్యే ప్రజలంతా, కనీసం ఆ సమస్యని గ్రహించగలిగే దోపిడీదారులు కూడా మారాలి! అదే అనిపిస్తోంది!"

"మారడం రేపు కాదు! జరిగిపోతోంది చరిత్రలో! మారుతున్నారు! మారిపోతున్నారు! మొదట మార్క్సు, అలా మారిన వాడే! తండ్రి లాయరైనా, గొప్ప ధనికుడు కాడు. ఇతడు దేవుళ్ళ మూఢ నమ్మకాలు లేకుండా తన డిగ్రీల కాలంలోనే నేర్చుకుని, క్రమంగా సమాజంలో మార్పులవైపు తల తిప్పాడు! అతని కంటే రెండేళ్ళు చిన్న వాడు ఎంగెల్స్, పెద్ద పెట్టుబడిదారుడి కొడుకు, అయితే యేం, విషయాలు తెలిసి మార్క్సుకి తోడయ్యాడు! ధనవంతుల పిల్లలు కూడా కమ్యూనిస్టులవుతారు అనడానికి అదే ఉదాహరణ!"

"చాలు! ఆ ఉదాహరణ చాలు! కానీ, దోపిడీదారుల వర్గం మారుతుందని భావించ గలమా గోపాల్?"

"ఆ వర్గంలో కూడా కొందరు వ్యక్తులు తెలుసుకొని మారతారు. ఆ వర్గం అంతా మారడం మాత్రం, శ్రామిక వర్గం చేతిలో వుంటుంది!"

"అంటే, మన చేతుల్లో! మన పెద్దవాళ్ళూ శ్రామికులే! నువ్వూ నేనూ అంతే! ఇక మారవలి సింది, స్టూడెంట్స్ గాక, ఇంకెవరు? చెప్పు! మనం ఏం చెయ్యాలి? ఎవర్ని కలవాలి? ఎటు పోవాలి?"

"ఎక్కడికి పోతాం? మనకి తెలిసింది ఎంత? పుస్తకాల్లో చదివిందే చాలా? మనమే ఇలా నాలుగైదు మాటలు మాత్రమే చెప్పుకునే వాళ్ళంగా వుంటే, నిరుపేద శ్రామిక జనం ఎలా వున్నారో, మనకి నిజంగా ఏం తెలుసు? చెత్త చెత్త సినిమాలన్నీ చూడడం తప్ప, వాళ్ళేం చేస్తున్నారు? మనం ఒక పని మొదలు పెట్టాలి రవీ! అలా నాకు అనిపిస్తోంది! పది మంది స్టూడెంట్స్‌ని కూర్చో బెట్టుకుని, వారానికో, పది రోజులకో, ఏవో నాలుగు మాటలు, ఇలాంటివే పెట్టుకుంటే, కొన్నాళ్ళకి తెలుస్తుంది, వాళ్ళు రోత సినిమాలకే పోతారో, మన మీటింగులకే వస్తారో!"

"దానికేమన్నా ఖర్చవుతుందా గోపాల్ ? ఎంతయినా నేను తెస్తా! ఇబ్బంది అవదు. మా వాళ్ళు డాక్టర్లు! బాగానే వుంటుంది డబ్బు."

"వాళ్ళకి వుంటుందేమో! నీకూ వుంటుందా?"

"ఆ డబ్బు నాదేగా?"

"అందుకా, లాభం గురించి అంత ఆరాటపడ్డావు?"

"అది ఆరాటం కాదు గోపీ! సరే, మన సంగతి. ఆ స్టూడెంట్సుకి మధ్యాహ్నం పూట అన్నాలు పెడితేనే, వాళ్ళు ఆకళ్ళు లేకుండా తినేసి, ఉత్సాహంగా కబుర్లకి కూర్చుంటారు రాత్రి దాకా."

"కబుర్లు కూడా వుంటాయి గానీ, అసలు సంగతి 'కాపిటల్'ని చదివి, వినిపిస్తూ, వివరంగా చెప్పడం! ఆఁ, అదే మొదలు!"

"భలే చెప్పావు గోపాల్ ! కానీ, ఇంకా నాలుగు 'కాపిటల్' పుస్తకాలు వుంటే, కలవడంలో శ్రద్ధగా వున్నవాళ్ళకి చదవమని ఇవ్వొచ్చు! పని ఎంతో తేలిగ్గా జరుగుతుంది. అవి నేనే తెచ్చెయ్యనా సాయంత్రం?"

"రవీ ! మధ్యాహ్నం నీకు క్లాసు వుందా?"

"ఉంది గానీ, వెళ్ళద్దనుకున్నాను ఇందాక. వెళ్ళక పోతే ఎలాగ? క్లాసులో వాళ్ళ తోటే కొంచెం మాట్లాడి, 'ఒక సారి మా ఇంటికి రండి, భోజనాలు అక్కడే, కాస్త మాట్లాడుకుందాం' అనాలని! నన్ను 'కాపిటల్'ని అడిగాడే, వాడు మళ్ళీ అడుగుతాడో లేదో చూస్తా! మార్క్సుల్లో తెలివైన వాడే! చూస్తా, వెళ్దామా? అయ్యో, గంటన్నర దాటింది! మనం ఇంకా ఇక్కడే, నువ్వు బూర్జువా పీహెచ్‌డీ పనిలో! నేను ఇంకో బూర్జువా డిగ్రీ కోసం ఎదురు చూస్తూ! రోజులన్నీ ఇలాగే జీవితాలు జరుగుతూ పోతే?"

"ఇంకా ఇలాగే ఎందుకు జరుగుతాయి? మీ వాళ్ళని పిలుస్తావుగా? నేనూ వస్తా! కానీ, మొదటి రోజునే కాదు, వాళ్ళు ఫ్రీగా వుండరేమో! వాళ్ళు వచ్చిన నాడే కబుర్లు మొదలెట్టు! డబ్బుని మార్క్సు 'జనరల్ ఈక్వివలెంట్' అన్నాడు కదా? ఆ మాట చెప్పు! 'డబ్బు' అంటే, ప్రపంచంలో వున్న సమస్త వస్తువులతోటీ మారేది కదా? అందుకే అది జనరల్‌గా మారకాల సాధనం! అది చెప్పు! ఆసక్తిగా వింటారు కదా? డబ్బుకీ వస్తువుకీ వుండే రకాల్లో వుండే విలువల సంగతి కూడా చెప్పి వాళ్ళనే కొన్ని ప్రశ్నలు అడగొచ్చు!"

"నిజమే. దాని తోనే మొదలెట్టాలి గానీ, నేను నీ లాగా చెప్పగలనా చెప్పు? నువ్వే అయితే, ఎంత బాగుంటుంది! నువ్వు కూడా వస్తావు కదా? నువ్వే చెప్పు ప్రధానంగా!"

"నేను రెండోసారి నించీ వస్తాలే! నువ్వు మారకాల మాటతో మొదలెట్టు! ఏ వస్తువు అయినా, వంకాయలే అనుకో! ఒక రైతు, షాపుకి పోయి, తను తెచ్చిన వంకాయలు ఇస్తే, వాటితో బీరకాయలు తీసుకోగలడా? పోనీ, బియ్యమో, కొంచెం పప్పో తీసుకోగలడా? ఏ వస్తువు తోటీ అది జరగదు, డబ్బుతో తప్ప! డబ్బు కూడా ఒక వస్తువేగా? అది, బంగారం కదా? బంగారపు చిన్న చిన్న ముక్కలైనా, బంగారం, నోట్లుగా కాయితం ముక్కలైనా, అది, ఒక వస్తువే! ప్రపంచంలో ఎక్కడ్కెనా, డబ్బు ఇచ్చి, దేన్ని అయినా తీసుకోవచ్చు! ఒక షాపులో, కూరగాయలు చాలా వున్నాయి, కాకరకాయల్తో సహా! ఆ షాపుకి పోయిన ఒక రైతు చేతిలో వంకాయలున్నాయి. అక్కడ కాకరకాయల్ని చూడ గానే, అవి కావాలనిపించింది. చేతిలో 'డబ్బు' లేదు! అయినా, 'వంకాయలిస్తా, కాకరకాయ లివ్వండి' అంటే, వాళ్ళు ఇవ్వరు. అయినా, వంకాయల్ని ఇచ్చి, డబ్బుని తీసుకుంటే, అంటే, వంకాయల్ని అమ్మి, డబ్బుని తీసుకుంటే, అంటే వంకాయలకి డబ్బుతో మారకం జరిగితే, డబ్బు వస్తుంది కదా? ఆ డబ్బుని ఇచ్చి, కాకరకాయల్ని కొంటే, అంటే, కాకరకాయలకి డబ్బుతో మారకం జరిగితే కాకరకాయలు వస్తాయి. ఈ మనిషికేం జరిగింది? చేతిలో వస్తువు వున్నా ఆ వస్తువునే వాడేస్తే సరే! ఇంకో వస్తువేదో కావాలంటే, ఈ వస్తువుని అమ్మి, డబ్బుని తీసుకోవాలి. ఆ డబ్బుతో ఏ వస్తువు కావాలో ఆ వస్తువుని కొనాలి! ఆ డబ్బుతో, కాకరకాయలకి మారకం జరగాలి! ఈ మారకాల కోసం డబ్బుతో ఎంత ఖచ్చితమైన ఏర్పాటు అంటే... రవీ! అలా మొదలెట్టి, వాళ్ళని బోలెడు ప్రశ్నలు అడగొచ్చు! వాళ్ళు కూడా ఎన్నో అడుగుతారు. క్రమంగా అది, అమ్మడాలూ, కొనడాలూ వస్తువుల మారకాలూ - అన్నీ దాటి దోపిడీ దగ్గిరికి రావాలి! అదంతా ఒక్క వారం లోనే జరగదులే."

"చాలా సంతోషంగా వుంది నాకు. చిన్నప్పట్నించీ, వడ్డీలూ, లాభాలూ, అని చదువుతూనే వున్నాం! 100 డబ్బుకి ఇంత వడ్డీ రావాలంటే, వెయ్యికి ఎంత? - అని లెక్కలు! అవే నేర్పుతున్నారు!"

"అదే మరి, దోపిడీని నేర్పే చదువు! దాని మీదే పరీక్షలు! అలా రాస్తేనే పాసవడాలు! ఆ లెక్కలు నేర్పే ఉద్యోగాలు!"

"ఎంత ఘోరం! నిజంగా టీచర్లకి అదంతా తెలీదు కదా?"

"క్లాసులో స్టూడెంట్స్‌కి చెప్పే పాఠాల్లో చాలా తప్పులే! అలాగే రాయకపోతే, ఫెయిలవుతారు, ఉద్యోగాలు దొరక్క బికార్లవుతారు!"

"అయ్యయ్యో! ఇవేం చదువులు! ఈ ఉద్యోగాలెందుకు? అడుక్కుని తింటే మంచిది!"

"ఎవరు పెడతారు అడుక్కోవాలంటే? ఎంత పెడతారు? పెట్టేది, మనం వొదిలేసే ఉద్యోగాలు చేసే వాళ్ళేగా? లేకపోతే, దోపిడీదారుల్నే అడుక్కోవాలి!"

"వొద్దు! ఇంకా వొద్దులే! మా వాళ్లని ఎంత సరిగా పిల్చానో సాయంత్రం చెపుతా! మీ క్లాసులో కూడా చెప్పు గోపాల్! ఈ శని, ఆదివారాల నించే చేద్దాం. చాలా సంతోషంగా వుంది నాకు. మా వాళ్ళతో మాట్లాడాక, నీకు తర్వాత చెపుతా!"

"నువ్వే దానకర్ణుడి లాగ చేద్దామని అనుకోకు! నాకూ స్కాలర్‌షిప్ వుంది! ఖర్చు విషయం అంతా చెప్పు నాకు... ఇక లేద్దాం. గంట దాటింది మనం కబుర్లు మొదలెట్టి! ఇక మనం రెగ్యులర్‌గా మాట్లాడుకోవాలి. మీ క్లాసు వాళ్ళు ఏమన్నారో మర్చి పోకుండా రాస్తే, రాసి వుంచు! వెళ్దామా మరి? వెళ్దాం కామ్రేడ్!"

"కామ్రేడూ, బూర్జువా, ఈ మాటలు నాకు కొత్త! అర్థం కావు!"

"అవుతాయి, కొన్నాళ్ళకి, మన మీటింగుల్లో వాళ్ళందరికీ అర్థం అవుతాయి! రవీ! మనం ఈ మాత్రంగా మొదట్లో ఆలోచించామా? ఏదో చిన్న పని అయినా చెయ్యాలని ఆలోచన వచ్చింది గానీ, అదేమిటో ఈ ఆలోచన రాలేదు. 'కాపిటల్' అంటే 'పెట్టుబడి' కదా? పెట్టుబడిదారీ విధానంతో దోపిడీలతో ఈ నాటికీ సమాజం నడుస్తోందని చెప్పాలనే మార్క్సు ఏనాడో అన్ని విషయాలు రాస్తే, మనం ఏదన్నా చిన్న పని అయినా చెయ్యొద్దా? స్టూడెంట్సులో కొందరైనా ఆ పుస్తకం చూస్తే చాలు. కొందరైనా ఆ పుస్తకం చదివి, అందులో వున్నదేంటో తెలుసుకుంటే, ఆ మార్పే జరిగితే, అది అలాగే వుంటుందా చెప్పు? మనం తప్పకుండా ఇలాగో, ఎలాగో, ఇది చెయ్యాలి రవీ!"

"ఇలాగో, ఎలాగో కాదు. ఎంగెల్స్ చేసినట్టే చేద్దాం. ఎంగెల్స్ లాగే మార్క్సుకి తోడుగా అయిపోవాలని నాకు నిజంగా వుంది ఇప్పుడు! చెయ్యాలి గోపాల్! నువ్వు ఆ పుస్తకం బాగా చదివావు! మనం ఎలాగో చెయ్యడం కాదు! అదే మన పని ఇప్పుడు! నేను వెళ్తా! మా వాళ్ళతో మాట్లాడాలి! ఎంత మంది ఉన్నారో!"

(ముగిసింది)

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- పిల్లల చదువుతో పాటు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లివ్వాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- ఆస్పత్రిలో చెంచు మహిళా బాధితురాలికి ప్రజాసంఘాల నేతల పరామర్శ



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

చెంచు మహిళను పది రోజులపాటు నిర్బంధించి చిత్రహింసలు పెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు ఈశ్వరమ్మను శుక్రవారం ఐద్వా, ఇతర ప్రజాసంఘాల నేతలు కలిసి పరామర్శించారు. అనంతరం మల్లు లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. నిందితులు బండి వెంకటేశ్వర్లు, శివ, శివమ్మను అరెస్టు చేసి చేతులు దులుపు కోకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈశ్వరమ్మకు పూర్తి స్థాయిలో చికిత్స అందించాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు రెండు పడకల ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పిల్లల చదువు విషయంలోనూ ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాధితులు ఈశ్వరమ్మ- భర్త ఈరయ్య నుంచి బలవంతంగా కౌలు పేరుతో నిందితుడు బండి వెంకటేశ్వర్లు గుంజుకున్న భూమిని తిరిగి వారి కుటుంబానికి అప్పగించేలా అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలంటే సమాజంలో చులకన భావం నెలకొందని, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గంలో ఉన్న నల్లమలకు చెందిన చెంచు మహిళపై దారుణం ఆందోళనకరమన్నారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో ఐద్వా రాష్ట్ర నాయకులు కందికొండ గీత, గిరిజన సంఘం జిల్లా నాయకులు శంకర్‌నాయక్, కేవీపీఎస్ జిల్లా నాయకులు అంతటి కాశన్న, సీఐటీయూ నాయకులు అశోక్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోన్న కేంద్రం - జూలకంటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ పరీక్షల్లో అక్రమాలతో లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారి జీవితాలతో కేంద్రం ఆటలాడుతోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన సీపీఐ (ఎం) నల్లగొండ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. మూడో రోజు తరగతులను ప్రారంభించిన జూలకంటి మాట్లాడుతూ... మూడోసారి అధికారంలోకి వచ్చీ రాగానే మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పూనుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు బ్లాకుల వేలమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణని తెలిపారు. గతంలో విశాఖ స్టీల్ ప్లాంటుకు సొంత గనులు లేవనే కారణంతో ఆ సంస్థను ప్రయివేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కూడా అదే దుస్థితి వస్తుందంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే సర్కారు ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు పదును పెట్టాలని జూలకంటి పిలుపునిచ్చారు.

జ్యుడీషియల్ కమిషన్లకు బెదిరింపులు సరికాదు

- కేసీఆర్ భూస్వామ్య విధానాలను ఖండించాలి
- టీవోఆర్‌ను సవరించాలి : రౌండ్ టేబుల్ డిమాండ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం సాగునీటి వైఫల్యంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జ్యుడీషియల్ కమిషన్లను మాజీ సీఎం కేసీఆర్ బెదిరించడాన్ని ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తప్పుబట్టింది. కేసీఆర్ భూస్వామ్య, రాజరిక విధానాలను ఖండించాలని పిలుపునిచ్చింది. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ విచారణ కోసం టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్(టీవోఆర్)ను ప్రభుత్వం సవరించాలని విజ్ఞప్తి చేసింది. రీ-డిజైనింగ్, రీ-ఇంజినీరింగ్ పేరిట తుమ్మిడిహెట్టి నుంచి ప్రాజెక్టును కాళేశ్వరానికి మార్చడమే అవినీతికి మొదటి అడుగని వ్యాఖ్యానించింది. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జల సాధన సమితి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, సీపీఐ(ఎం) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సామాజికవేత్త పాశం యాదగిరి, ప్రొఫెసర్ వెంకట నారాయణ, మాజీ ఇంజినీర్ విఠల్‌రావు, బీఎల్ఎఫ్ ఛైర్మెన్ నల్లా సూర్యప్రకాష్, నీటిపారుదల నిపుణులు సాంబశివరావు, తెలంగాణ ఉద్యమకారులు నైనాల గోవర్ధన్, పధ్విరాజ్, విఠల్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, సోగరా బేగం, నరసింహ, సూర్యకిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యక్తలు మాట్లాడుతూ టెండర్లు లేకుండానే నామినేషన్‌పై మెఘా కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడాన్ని తప్పు బట్టారు. రిజర్వాయర్ కోసం మల్లన్నసాగర్ ప్రాంతాన్ని ఎంపిక చేయడం సరి కాదన్నారు. భూకంపాలకు అవకాశమున్న చోట రిజర్వాయర్‌ను ఎలా కడతారని ప్రశ్నించారు. నీరు ఎదురెక్కని ప్రాంతంలో రూ.2 వేల కోట్లతో శ్రీరాంసాగర్ పునరుజ్జీవనం ఎలా చేస్తారని వ్యాఖ్యానించారు. మెఘా కంపెనీ పంపింగ్ వ్యవస్థల న్నింటిపై లోతైన అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీపీఆర్‌ను సరిగ్గా పరిశీలించకుండానే ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ వ్యాప్కోస్ అధికారులను సైతం విచారణకు పిలవాలని సూచించారు. ప్రాజెక్టుల కోసం తెచ్చిన రుణాలు, వడ్డీ తదితర ఆర్థికపరమైన అంశాలు, అవినీతిని వెలికి తీయాలని కోరారు. ప్రాజెక్టు డిజైన్లు, డీపీఆర్ తప్పులతడక అని విమర్శించారు. ఎన్నికల్లో మెఘా కంపెనీ ఆయా పార్టీల పేరు మీద కొనుగోలు చేసిన రూ.1186 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు అవినీతికి సాక్ష్యమని వ్యాఖ్యానించారు.

'మధ్యాహ్న' కార్మికుల పెండింగ్ గౌరవ వేతనాలివ్వాలి

- ఎన్నికల హామీ మేరకు ప్రతినెలా రూ.10 వేలివ్వాలి
- 24న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలనీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా రూ.10 వేల గౌరవవేతనం ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈ నెల 24న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేయనున్నట్టు ప్రకటించారు. వాటిని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారని వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన గౌరవ వేతనం కూడా సరిగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదనీ, కొత్త మెనూ ఎలా పెట్టాలని ప్రశ్నించారు. కార్మికుల పెండింగ్ గౌరవవేతనాలను వెంటనే విడుదల చేసి వారి వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా గృహలక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తున్న మాదిరిగానే మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కూడా ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.



కామారెడ్డిలో...



కరీంనగర్‌లో...

ఎన్టీఏను రద్దు చేయాలి

నీట్ పేపర్ లీకేజీకి కారణమైన ఎన్టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలి.. అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి.. నైతికంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.. ప్రధాని మోడీ, బీజేపీ నాయకత్వం స్పందించాలి.. నీటి పరీక్షను మళ్లీ నిర్వహించాలంటూ.. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి యువత కదం తొక్కింది. విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలతోపాటు పలుచోట్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. కేంద్రం దిష్టిబొమ్మలు దహనం చేశారు.

'నీట్' లీకేజీపై సుప్రీంజడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి

- మళ్లీ పరీక్ష నిర్వహించాలి
- ప్రధాని మోడీ, బీజేపీ నాయకత్వం స్పందించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా కదం తొక్కిన విద్యార్థి, యువజన లోకం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్
- కేంద్రం దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- విలేకరులు

రంగారెడ్డి జిల్లా దిల్‌సుఖ్‌నగర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు పాల్గొని మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పత్రాలు బీజేపీ పాలిత రాష్ట్రాలైన బీహార్, గుజరాత్, హర్యానాలోనే లీకయ్యాయని, అందులో బీజేపీ నాయకుల పాత్ర కీలకంగా ఉందని అన్నారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఖమ్మం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జెడ్పీ సెంటర్ వరకు స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు పాల్గొని.. మోడీ డౌన్ డౌన్, మోడీ, బీజేపీ సర్కార్ ముర్దాబాద్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా జెడ్పీ సెంటర్ వరకు విద్యార్థిలోకం కదం తొక్కి గర్జించింది. అనంతరం జెడ్పీ సెంటర్‌లో జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, యూత్ కాంగ్రెస్, ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ, పీవైఎల్, ఎన్ఎస్‌యూఐ నేతలు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేస్తుంటే కనీసం ప్రధాని, బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న బీహార్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ అయిందని, దీనిలో బీజేపీ నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. చేవెళ్ల పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ తీశారు. ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మెదక్, నర్సాపూర్ పట్టణాల్లో మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలు దహనం చేశారు.

విద్యారంగాన్ని కార్పొరేట్‌కు అప్పజెప్పే కుట్రలో భాగంగానే పాలకులు పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. నీట్ పరీక్షలో అవకతవకలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, టీవీఎం ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్ ఎదుట కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. నీట్ పరీక్ష లీక్, యూజీసీ నెట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న ఎన్టీఏపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏ ఛైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై కేంద్ర ఎన్డీఏ సర్కార్ మౌనం వీడాలని లేకపోతే తెలంగాణలో కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను ఎక్కడికక్కడా అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ హెచ్చరించారు. సూర్యాపేటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నీట్‌పై విచారణ జరిపించాలంటూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆందోళన చేశారు. హనుమకొండలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ...



మెదక్ నర్సాపూర్‌లో...

కనీస మద్దతు ధరల విషయంలో మోసం

- స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- కేంద్రం దిష్టిబొమ్మ దహనం



మాట్లాడుతున్న మూడ్ శోభన్

నవతెలంగాణ-కామారెడ్డి

పంటలకు కనీస మద్దతు ధరల (ఎంఎస్పీ)లో నరేంద్ర మోడీ ప్రభుత్వం మరోసారి అబద్ధాలు చెబుతూ, రైతులను మోసం చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శోభన్ మాట్లాడుతూ.. ఉత్పత్తి వ్యయానికన్నా 50శాతం ఎక్కువగా కనీస మద్దతు ధరను ఇస్తున్నామని కేంద్రం చెప్పుకుంటోందని విమర్శించారు. ఉత్పత్తి వ్యయం కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీని ఆమోదించినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ మీడియా వెంటనే ఈ విషయాన్ని పట్టేసుకుందని, దీనిపై విమర్శనాత్మకమైన విశ్లేషణలు ఏమీ లేకుండానే ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారాన్ని చేపట్టిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పెట్టుబడికయ్యే ఖర్చుకు అదనంగా 50 శాతం (సీ2 ప్లస్ 50) ఎంఎస్పీ ఇస్తామని 2014లో ఇచ్చిన హామీని ఉల్లంఘించారని అన్నారు. వ్యవసాయ ఉపకరణాల వ్యయం, ధరలపై కమిషన్ (సిఎసిపి) వ్యయ అంచనాల ప్రకారం చూసినా ఎంఎస్పీకి సిటు ప్లస్ 50 శాతానికి ఎక్కడా పొంతన లేకుండా వుందని అన్నారు. 14 ఖరీఫ్ పంటలకు ప్రకటించిన మద్దతు ధరలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందన్నారు. వరి, పత్తి, జొన్న వంటి పంటలకు సంబంధించి రాష్ట్రాలు ఇచ్చిన పంటల పెట్టుబడి అంచనాలను పరిగణనలోకి తీసుకున్నా ఈ వ్యయ లెక్కింపుల్లో తేడాలు బాగా తెలుస్తున్నాయని అన్నారు. పెరిగిన ఎరువుల ధరలు, నీటిపారుదల వ్యయం వంటి వాటిని కేంద్రం అస్సలు పరిగణనలోకి తీసుకోలేదని దీన్ని బట్టి తెలుస్తోందని తెలిపారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అంచనాలకు గౌరవం ఇవ్వలేదన్నారు. కనీస మద్దతు ధరపై తప్పుడు మాటలు చెప్పడానికి బదులుగా రైల్వే మంత్రిగా వున్న అశ్విని వైష్ణవ్ రైలు ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఆయన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయకూడదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే ఈ ప్రకటనను ఆపాలని, సంయుక్త కిసాన్ మోర్చాతో చర్చలు జరిపిన తర్వాత సిటు ప్లస్ 50శాతం హామీకి అనుగుణంగా సవరించిన ఎంఎస్పితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ, బీజేపీ ప్రభుత్వం ఇలా ద్వంద్వ ప్రమాణాలతో చేస్తున్న ప్రకటనలను ఎండగట్టాలని, రైతు వ్యతిరేక ప్రభుత్వ చర్యలకు నిరసనగా తమ గళాలను వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధరవత్ మోతీరామ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.సావిత్రి, కుమ్మరి సాయిలు, నాయకులు గైని చిన్న సాయిలు, రోజా, రామోల్ల రాములు, మంజుల, సాయవ్వ, స్వప్న, పెద్ద సాయవ్వ, ప్రకాష్, వసంత రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బాబురావుకు మాతృవియోగం

- అనారోగ్యంతో సావిత్రమ్మ కన్నుమూత
- తమ్మినేని సహా పలువురి నివాళి
- నేడు శ్రీకాకుళంలో అంత్యక్రియలు



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్ ఆఫీసు కార్యదర్శి జె బాబురావు మాతృమూర్తి సావిత్రమ్మ (90) కన్ను మూశారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమె శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్ లోని విద్యానగర్‌లో ఉన్న ఎస్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులున్నారు. పెద్దకొడుకు జ్యోతిశ్వరరావు పార్టీలో పనిచేస్తూ పోస్టల్ యూనియన్ నాయకులుగా ఉన్నారు. రెండో కుమారుడు బాబురావు తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఆఫీసు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు జయరాం కూడా ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఆఫీసు కార్యదర్శిగా ఉన్నారు. ఆమె భర్త అప్పారావు 1981లోనే చనిపోయారు. సావిత్రమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులంతా 30 ఏండ్లుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు. ఆమె మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఆమె మరణవార్త తెలుసుకుని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, డీజీ నరసింహారావు, చుక్క రాములు, పాలడుగు భాస్కర్, పి ప్రభాకర్, కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జె వెంకటేష్, ఎం శ్రీనివాస్, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, టి స్కైలాబ్ బాబు, ఎస్ రమ, ఆర్ అరుణ జ్యోతితో పాటు పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, వై కిరణ్ చంద్ర, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆమె మరణం పట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు సంతాపం తెలిపారు. సావిత్రమ్మ అంత్యక్రియలు శనివారం ఉదయం శ్రీకాకుళం పట్టణంలో జరుగుతాయని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సావిత్రమ్మ మరణం పట్ల వీఎస్ఆర్ సంతాపం

సావిత్రమ్మ మరణం పట్ల సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి వి శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రత్యేకించి కుమారులు జ్యోతిశ్వరరావు, బాబురావు, జయరాంలకు సానుభూతిని తెలిపారు. వారి కుటుంబంతో తనకు వ్యక్తిగతంగా సన్నిహిత సంబంధముందని పేర్కొన్నారు. తమ అమ్మ సావిత్రమ్మ మంచి స్నేహితులుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఆమె యావత్ కుటుంబం పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్నదని తెలిపారు.

తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవికి పోటాపోటీ

- ఏపీలో అధికారంలోకి రావడంతో ఉత్సాహం
- ముగ్గురు ప్రధాన నేతల ప్రయత్నాలు
- మల్లారెడ్డికి 'నో' అంటున్న తెలుగు తమ్ముళ్లు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగుదేశం తెలంగాణ అధ్యక్ష పదవికి పోటాపోటీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే రెండుమూడ్రోజుల్లో పార్టీ అధ్యక్షుడిని నియమిస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో ఉత్సాహం పెరిగింది. నాయకులు, కార్యకర్తలు హర్షాతి రేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆపార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబును కలిసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు. రోజు, రోజుకు ఆశావహులు పెరుగుతు న్నారు. అలాగే పార్టీలోని ప్రధాన నేతలను కూడ కట్టుకుని చంద్రబాబును మరోసారి కలిసేందుకు వ్యూహారచన చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షుడిగా పనిచేసిన సంగతి తెలిసిందే. శాసనసభ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకపోవడంతో ఆయన అసంతృప్తితో బీఆర్ఎస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున చేవెళ్ల నుంచి పోటీచేశారు .కూడా. కాగా గత ఆరునెలలకుపైగానే పార్టీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంటున్నది. చంద్రబాబు ఏపీ ఎన్నికల్లో బీజీగా ఉండటంతో నియామకం సాధ్యం కాలేదు. అంతేగాక తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరోక్షంగా సహకరించారనే ప్రచారం జరిగింది. ఇటీవల ఏపీలో అద్భుత విజయాన్ని అందుకున్న చంద్రబాబు అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతోపాటు ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావును నియమించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో తెలంగాణ పార్టీ నేతల్లో ఆశలు రేకేత్తాయి. రెండు, మూడు రోజుల్లో తెలంగాణకు అధ్యక్షుడిని ఎంపిక చేస్తారనే సంకేతాలు వచ్చాయి. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అర్వింద్‌కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షులు బక్కని నర్సింహులు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోష్న తదితరులు అధ్యక్ష పదవి కోసం ప్రయత్ని స్తున్నట్టు ఆపార్టీ వర్గాల్లో ప్రచారం జరుగు తున్నది. అలాగే మరో రకమైన ఊహాగానాలు సైతం వినిపిస్తున్నాయి. కాసాని జ్ఞానేశ్వర్‌ను తెచ్చినట్టుగా గత బీఆర్ఎస్ సర్కారులో మంత్రిగా పనిచేసిన ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని నియమిస్తారనే ప్రచారమూ జరుగుతున్నది. అలాగే ఆయన గతంలో టీడీపీ నుంచే మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రయత్నం చేసి భంగపడ్డ మల్లారెడ్డి, టీడీపీ అధ్యక్ష పదవిని చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఈమేరకు చంద్రబాబుకు రాయబారం పంపారని సమాచారం. కాంగ్రెస్ సర్కారు తనను వేధిస్తున్న దనే భావనతో ఉన్న మల్లారెడ్డి, టీడీపీలో చేరి చంద్రబాబు ప్రాపకాన్ని సంపాదించాలని యోచిస్తు న్నారు. తద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని మచ్చిక చేసుకోవచ్చని అనుకుంటున్నట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు. దీన్ని టీడీపీ శ్రేణులు కొట్టిపారేస్తున్నారు. మల్లారెడ్డిని నియమించొద్దని ఇప్పటికే చంద్రబాబును కోరినట్టు సమాచారం. మల్లారెడ్డి వచ్చి పార్టీ బలోపేతం కోసం పని చేయకుండా వ్యక్తిగత అవసరాలను నెరవేర్చుకుం టారనే ప్రచారం ఇప్పటికే ఉంది. కాగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, గత 35 సంవత్సరాలుగా పార్టీలో ఉన్న అర్వింద్‌కుమార్ గౌడ్ పేరును చంద్రబాబు పరిశీలిస్తున్నారనే ప్రచారం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్‌భవన్‌లో జరుగుతున్నది. బక్కని నర్సింహ్మా, ప్రొఫెసర్ జ్యోస్న సైతం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

15 రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదా

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లోని 15 రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, కొత్తగూడెం జిల్లా భద్రాచలం, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కాటారం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ, ఖమ్మం జిల్లా కల్లూరు, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, దేవరకొండ, నిర్మల్ జిల్లా భైంసా, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బోధన్, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, వికారాబాద్ జిల్లా తాండూర్ రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదాకల్పించారు. ఇక నుంచి ఆయా డివిజన్లలో ఐఏఎస్ అధికారులను నియమించనున్నారు.

పదేండ్లు ఏం చేశారు?

మీ హయాంలోనే సింగరేణి గనుల్ని వేలం వేశారు

అవంతిక, అరబిందోకు అప్పగించింది మీరేగా...

మాజీ మంత్రి కేటీఆర్‌కు సీఎం రేవంత్ కౌంటర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణిని, ఔటర్ రింగ్ రోడ్డును టోకున ప్రయివేటుకు అమ్మేసిన వ్యక్తి హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి కే తారకరామారావును ఉద్దేశించి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. "పదేండ్లుగా కోట్లాది మంది తెలంగాణ ప్రజల మాటలను మీరు పట్టించుకోలేదు. కనీసం వినడానికి కూడా ఇష్టపడలేదు. మీరు ఇప్పుడు వాస్తవాలను వింటారనే నమ్మకం కూడా లేదు. అయినప్పటికీ.. మీలో మార్పు రావాలని కోరుకుంటూ వాస్తవాలను మరోమారు తెలియజేస్తున్నాం" అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి రాసుకొచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం సింగరేణి గనులను మొట్టమొదటి సారి వేలం వేసింది. రెండు ప్రయివేటు కంపెనీలకు అప్పగించింది. అరబిందో మరియు అవంతిక అనే రెండు కంపెనీలకు కట్టబెట్టింది మీ ప్రభుత్వ హయాంలోనే. అందుకు సహకరించింది మీ ప్రభుత్వమే. అప్పుడు మీరు, మీ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు. మా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు సింగరేణి గనులను ప్రయివేటీకరించడం, వేలం వేయడాన్ని వ్యతిరేకించారు. మీ ప్రియమైన అవంతిక మరియు అరబిందో కంపెనీలకు మీరు అప్పగించిన బొగ్గు బ్లాకులను రద్దు చేసి తిరిగి ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల్ని, వారి ప్రయోజనాలు, వారి ఆస్తులు, హక్కులను కాపాడేది కాంగ్రెస్ ఒక్కటేననీ, రాష్ట్ర భవిష్యత్ కాంగ్రెస్‌తో సురక్షితంగా ఉంటుందనీ, మన బొగ్గు.. మన హక్కుల్ని కాపాడి తీరుతామని పోస్ట్ చేశారు.

తెలంగాణ కు బీఆర్‌ఎస్ పార్టీయే రక్షణ కవచం

- **సింగరేణి గనుల వేలంతో మరింత స్పష్టం : మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా సింగరేణి గనుల వేలంలో బీజేపీ, కాంగ్రెస్ పాల్గొన్నాయని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. దీంతో తెలంగాణకు బీఆర్‌ఎస్ పార్టీయే రక్షణ కవచమని మరో స్పష్టమైందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో పదేండ్ల పాటు కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించకుండా అడ్డుకున్నామని తెలిపారు. సింగరేణి గనుల వేలంపై కేటీఆర్ ప్రశ్నించాకే కాంగ్రెస్ వైఖరిలో మార్పు వచ్చిందని చెప్పారు. శ్రావణి బ్లాక్‌ను వేలం నుంచి తీసేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని చెప్పారు.

ఏసీబీకి పట్టుబడిన న్యాల్కల్ ఆర్ఐ

రైతు నుంచి రూ.70వేల లంచం

మూడు గంటల పాటు కొనసాగిన దాడులు

నవతెలంగాణ-న్యాల్కల్

నిమ్జ్ నిర్వాసిత రైతు నుంచి రూ.70వేలు లంచం తీసుకుంటూ న్యాల్కల్ ఆర్ఐ దుర్గయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని రైతు గణేష్‌పూర్ మల్లప్పకు సంబంధించిన 2.36 ఎకరాల భూమి నిమ్జ్ ప్రాజెక్ట్‌లో పోయింది. ఇందుకు సంబంధించి రూ.43.50 లక్షల చెక్కు ప్రాసెస్ అయింది. అయితే, చెక్కు ఇవ్వడానికి న్యాల్కల్ ఆర్ఐ దుర్గయ్య లక్ష రూపాయల లంచం డిమాండ్ చేశాడు. దాంతో బాధిత రైతు మల్లప్ప ఈనెల 14న ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మండలంలోని గంగ్వార్ చౌరస్తాలో రైతు నుంచి ఆర్ఐ రూ.70వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేశారు. మరోపక్క న్యాల్కల్ తహసీల్దార్ కార్యాలయంలో మూడు గంటలకు పైగా అధికారులు సోదాలు చేశారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడైనా లంచం అడిగితే మెదక్ ఏసీబీ-1064 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ వివరించారు.

పోచారం దిష్టిబొమ్మ దహనం

కాంగ్రెస్ నేతల నిరసన



నవతెలంగాణ-కోటగిరి

పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుచేటని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. ఆయన చేరికను నిరసిస్తూ.. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పోచారం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాసరావు రెడ్డి ఊసరవెల్లిలాగా పార్టీలు మారుస్తున్నారంటూ విమర్శించారు. ఇప్పటికైనా పోచారం శ్రీనివాస్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, గంగాధర దేశాయ్, నాయకులు కిషన్, మైనార్టీ నాయకులు వహీద్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా నేడు నిరసనలు : సీఐటీయూ

(మొదటిపేజీ తరువాయి)

నిరసనలు చేపట్టనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గనులను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి పదో విడత వేలం ప్రక్రియ మొదలుపెట్టారనీ, రాష్ట్రానికి చెందిన జి.కిషన్‌రెడ్డి గనుల శాఖ పదవి చేపట్టగానే తెలంగాణకు తీరని అన్యాయం చేయబోతున్నారని విమర్శించారు. తెలంగాణలోని సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కూడా వేలం వేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాకును వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రాలతో పాటు సింగరేణి ప్రాంతంలోని అన్ని ఏరియాలలో తలపెట్టిన నిరసనల్లో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మిగతా కార్మిక సంఘాలు కూడా ఈ పోరాటాల్లో కలిసి రావాలని కోరారు.

సగం అద్దెకు...సగం ఇంటికి

అద్దె భవనాల్లో అంగన్‌వాడీల అవస్థలు | **10 నెలల అద్దె.. మూడు నెలల వేతనాలు పెండింగ్**



అధిక పని ఒత్తిడితో సతమతం

ఇబ్బందుల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నవతెలంగాణ- సిటీబ్యూరో

అద్దె గదుల్లో నడుస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం నుంచి అద్దెలు రావడం లేదు. భవన యజమానుల నుంచి ఒత్తిడి తట్టుకోలేక.. వచ్చిన జీతాల్లో నుంచే సగం అద్దెకు.. సగం ఇంటికి.. అన్నట్టు వారు సర్దుబాట్లు చేసుకుంటూ నడుపుతున్నారు. ఓ వైపు అద్దె భవనాల అద్దె కట్టలేక.. మరోవైపు సొంత భవనాలున్న కేంద్రాల్లోనూ సరైన వసతులు లేక సతమతమవుతున్నారు. మరోపక్క అందులో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకూ మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి తోడు పలు రకాల పనుల ఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్నారు. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా చొరవ చూపడం లేదని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చెబుతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 751 మంది టీచర్లు, 741 మంది ఆయాలు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఆరు నెలల నుంచి ఆరేండ్ల వయసు పిల్లలు 90,361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మందితో కలిపి మొత్తం 1,07,484 మంది ఉన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 47,028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. మేడ్చల్ పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలోని 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

సొంత భవనాల్లేక..

జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో 212 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 443 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 277 కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అల్వాల్ పరిధిలో 271 కేంద్రాలకుగాను 143 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మేడ్చల్ పరిధిలో 211 కేంద్రాలకు గానూ 23 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

తాగునీటి కొరత.. మరుగుదొడ్ల సమస్య..

దాదాపు 100కుపైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాల్లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 77 కేంద్రాల్లో తాగునీటి కొరత వెంటాడుతోంది. ఇక అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 40 కేంద్రాల్లో నీటి సమస్య నెలకొంది. అలాగే జిల్లాలోని దాదాపు 100కుపైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. ఇందులో మేడ్చల్ ప్రాజెక్టు పరిధిలో 78, అల్వాల్ ప్రాజెక్టు పరిధిలో 51, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల వసతి లేదు. అద్దె భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఇచ్చే అద్దె చాలా తక్కువ కావడంతో టాయిలెట్స్ కట్టించి ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.



పెండింగ్..

జిల్లాలో 443 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నాయి. ఈ అద్దె భవనాలకు 10 నెలలుగా సర్కార్ అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో టీచర్లు, ఆయాలు ఇంటి యాజమానుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొంటున్నారు. టీచర్లకు వచ్చే రూ.13,650 వేతనంలో రూ.4వేల వరకు అంగన్‌వాడీ సెంటర్ అద్దె చెల్లించి మిగిలిన రూ.రూ.9,650తో కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కూడా మూడు నెలలుగా వేతనాలు అందలేదు.

అధికారుల వేధింపులు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను మహిళా సూపర్‌వైజర్లు వేధింపులకు గురి చేస్తున్నారు. సెల్‌ఫోన్ ఇవ్వకుండా, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడకుండా ఓటర్ ఐడీ, ఎలక్షన్ డ్యూటీ, మిషన్ భగీరథ లాంటి పనులు చేయాలని, లేదంటే మెమోలు జారీ చేస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలా వరుసగా మూడు మెమోల జారీ అనంతరం విధుల్లో నుంచి తొలగిస్తామని హెచ్చరిస్తున్నారని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలకు డబ్బులు ఇవ్వడం లేదు. 24 గంటలూ అందుబాటులోకి ఉండాలని, కొన్ని సందర్భాల్లో రాత్రి 12 గంటల వరకు పని చేపిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. 'కడుపుకు అన్నం తింటున్నావా..? గడ్డి తింటున్నావా..? ఏం పీకడానికి వస్తున్నావు' అని అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. బుక్స్, జిరాక్స్ తదితర ఖర్చులను కూడా తామే భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. కూరగాయలు, గ్యాస్ బిల్లులు ఇవ్వడం లేదు. గుడ్లు సకాలంలో అందడం లేదని చెబుతున్నారు.

వేధింపులను అరికట్టాలి

ఉన్నికృష్ణన్, సీఐటీయూ కోశాధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



అంగన్‌వాడీ సెంటర్లలో పని చేస్తున్న టీచర్లు, ఆయాలపై జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారుల వేధింపులను అరికట్టాలి. వచ్చిన వేతనంతో సగం అంగన్‌వాడీ కేంద్రాల అద్దెకు, మిగతా సగం కూరగాయలు, గ్యాస్, ఇతరత్రాలకు ఖర్చు చేస్తూ కాలం వెల్లదీస్తుంటే.. అధిక పని ఒత్తిడి, మానసికంగా ఇబ్బందులు పెట్టడం సరికాదు. వెంటనే 10 నెలల అద్దె, మూడు నెలల వేతనాలు చెల్లించాలి. సౌకర్యాలే సరిగా కల్పించలేని సర్కార్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఏపీ అసెంబ్లీ సమావేశాలు షురూ

రెండున్నరేండ్ల తర్వాత శాసనసభకు చంద్రబాబు

ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్





అమరావతి : ఏపీ శాసనసభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9.46 గంటలకు ప్రారంభం అయ్యాయి. దాదాపు రెండున్నరేండ్ల తర్వాత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సభలోకి అడుగుపెట్టారు. మొదట ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీ మెట్లకు ప్రణమిల్లిన ఆయన సగౌరవంగా గౌరవ సభలోకి అడుగుపెట్టారు. మొదటగా సభ్యులంతా జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ప్రొటెం స్పీకర్ నియామకంపై అసెంబ్లీ కార్యదర్శి ప్రకటన చేశారు. ఆ తర్వాత సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి రిజిస్టర్లలో సంతకాలు చేశారు. ఇక ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు.. శాసనసభలో తొలుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేత ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, డోలా బాల వీరాంజనేయస్వామి, బీసీ జనార్దన్‌రెడ్డి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, కందుల దుర్గేశ్, ఎన్ఎండీ ఫరూక్ ప్రమాణం చేశారు. పొంగూరు నారాయణ, కొలుసు పార్థసారథి, ఆనం రామనారాయణరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, వాసంసెట్టి సుభాష్ తదితరులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మిగతా సభ్యులు ప్రమాణం చేశారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వైసీపీ అధినేత

వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణం చేసిన అనంతరం జగన్ సభలో ఉండకుండా ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అంతకుముందు అసెంబ్లీ వెనుక గేటు నుంచి ప్రాంగణంలోకి జగన్ వచ్చారు. గతంలో ఆయన సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మందడం మీదుగా సభకు వచ్చేవారు. అమరావతి రైతులు నిరసన తెలుపుతారని భావించి వేరే మార్గంలో సభకు వచ్చినట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ప్రాంగణంలోకి వచ్చినా ఆయన లోపలికి వెళ్లలేదు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత వెళ్లారు. తన ప్రమాణస్వీకార సమయం వచ్చినపుడే సభలో జగన్ అడుగుపెట్టారు.

హస్తం గూటికి పోచారం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికార కాంగ్రెస్‌లో చేరారు. తద్వారా ఆయన బీఆర్ఎస్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. శుక్రవారం ఉదయం సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా రేవంత్‌కు ఆయనకు శాలువా కప్పి స్వాగతం పలికారు. కొద్దిసేపు ఆయనతో చర్చించిన రేవంత్... పోచారానికి, ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మరోవైపు పార్టీ సీనియర్ నేత కె. జానారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వెళ్లారు. బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆయన కూడా హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతున్నది.

రైతు సంక్షేమం కోసం శ్రమించారు : సీఎం రేవంత్

రైతుల సంక్షేమం కోసం పోచారం శ్రీనివాస్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ విషయంలో పోచారం సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశాననీ, పెద్దలుగా అండగా నిలబడాలని కోరామన్నారు. భవిష్యత్తులో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో సముచిత గౌరవమిస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామని చెప్పారు. 'ఇది రైతు రాజ్యం... రైతు సంక్షేమ రాజ్యం. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతాం' అన్నారు.

పనిమంతుడిని ప్రోత్సహించాలి: పోచారం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఆయన పని విధానాన్ని గమనిస్తున్నట్టు పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. అందుకే పనిమంతుడిని ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌ను మనస్ఫూర్తిగా ఇంటికి ఆహ్వానించానన్నారు. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. తాను రైతుబిడ్డననీ, అందుకే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. 'గతంలో వ్యవసాయ మంత్రిగా పనిచేశాను. అందరి సహకారంతో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేస్తాం. నా రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్‌తో. ఆ తర్వాత టీడీపీ, బీఆర్ఎస్‌లో పనిచేశాను. రేవంత్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరాను. 20 ఏండ్లపాటు రాష్ట్రానికి నాయకత్వం వహించే ఓపిక ఆయనకు ఉంది. మాకు వయసైపోయింది. పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలి' అని పోచారం వ్యాఖ్యానించారు.

గ్రేటర్‌లో బీఆర్ఎస్ ఖాళీ : దానం

గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఖాళీ కాబోతున్నదని ఖైరాతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. త్వరలోనే 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు. కేసీఆర్ విధానాలే బీఆర్ఎస్‌ను ముంచాయని తెలిపారు. పోచారం శ్రీనివాస్ రెడ్డే కాదనీ, చాలామంది బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాలే యాదయ్య, అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ముఠా గోపాల్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ తదితరులు కూడా తమ పార్టీలో చేరతారని తెలిపారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, సునీల్ కనుగోలు ఇప్పటికే చేరికలపై రెండు మూడు రోజులుగా చర్చించారని వివరించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, హరీశ్‌రావు, కేటీఆర్ తప్ప మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్‌లోకి క్యూ లైన్ కడతారని తెలిపారు. హరీశ్‌రావుతో కొంత మంది బీజేపీలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అయోమయంలో పడిందనీ, ఆ ప్రమాదం నుంచి బయటపడే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పారు.

పోచారం ఇంటి వద్ద ఉద్రిక్తత

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం పోచారం నివాసానికి వెళ్లగానే ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోచారం కాంగ్రెస్‌లోకి పోవద్దు...అధికార పార్టీ ప్రలోభాలకు పాల్పడితే సహించబోమంటూ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ నాయకత్వంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట, ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సుమన్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

కిం..కర్తవ్యం..?

గులాబీ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు

'చెయ్యి'చ్చిన సీనియర్ నేత పోచారం

అదే బాటలో మరికొంత మంది ఎమ్మెల్యేలు

త్వరలోనే హస్తం గూటికి పలువురు నేతలు

అయోమయం.. గందరగోళంలో బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో డీలా పడి, లోక్‌సభ ఎలక్షన్లలో అంతకుమించిన ఫల్టీలు కొట్టిన కారు పార్టీకి మరిన్ని షాక్‌లు తగులుతున్నాయి. 'లక్ష్మీ పుత్రుడు, మా అందరికీ పెద్దన్న...' అంటూ బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ చేత పలు వేదికల మీద పొగడ్తలందుకున్న మాజీ స్పీకర్, సీనియర్ నేత, బాల్కొండ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి 'చెయ్యి'చ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో గులాబీ పార్టీ ఖంగు తిన్నది. ఊహించని ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకునేలోపే మరికొంత మంది ఎమ్మెల్యేలు త్వరలోనే అధికార పార్టీలో చేరనున్నారనే వార్తలు ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాస్తవానికి మాజీ మంత్రులు, జూనియర్ నేతల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారనే గుసగుసలు ఎప్పటి నుంచో వినబడుతున్నప్పటికీ ఆ జాబితాలో పోచారం లాంటి సీనియర్ పేరు లేదు. కానీ జూనియర్ల కంటే ముందుగానే బీఆర్ఎస్‌లో ఎంతో సీనియర్‌గా చెప్పుకుంటున్న ఈ మాజీ స్పీకర్.. ఉన్నట్టుండి పార్టీ ఫిరాయించటంతో ప్రధాన ప్రతిపక్షానికి ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. అధినేత కేసీఆర్‌కు కూడా పోచారంపై ఎలాంటి అనుమానాలు, అపోహలు లేవు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆయన పార్టీనే అంటిపెట్టుకుని ఉంటారనే గట్టి నమ్మకంతో మాజీ సీఎం ఉన్నారు. కానీ పోచారం అదును చూసి ఆయనకు హ్యాండిచ్చారనే ప్రచారం ఇప్పుడు జోరందుకుంది. మరోవైపు శ్రీనివాసరెడ్డి బాటలోనే మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలోనే హస్తం గూటికి చేరబోతున్నారని సమాచారం. కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద, ప్రకాశ్ గౌడ్, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకరరెడ్డి పేర్లు ఈ లిస్టులో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని పసిగట్టిన కేసీఆర్... వారు గోడ దూకకుండా చూసే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులకు అప్పగించినట్టు తెలిసింది. వీరిద్దరూ ఆయా ఎమ్మెల్యేలతో ఇప్పటికే మంతనాలు ప్రారంభించారు. తద్వారా వారు పార్టీని వీడకుండా చూసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో గులాబీ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్సీలు కూడా అధికార పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు 'రెడీ' అయినట్టు విశ్వసనీయ సమాచారం. వారిని సముదాయించటం కత్తిమీద సాములా తయారైందని ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించాం. అప్పుడు మేం చేసిన పనులే ఇప్పుడు మమ్మల్ని ఇరకాటంలో పడేస్తున్నాయి... అప్పటి మా పద్ధతినే ప్రస్తుతం కాంగ్రెస్ అనుసరిస్తోంది...' అని ఆయన వ్యాఖ్యానించటం గమనార్హం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఎవరుంటారో..? ఎవరు పోతారో..? తెలియని అయోమయం, అంతకుమించిన గందరగోళం నెలకొంది. గోడ దూకబోతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు... మరో మూడు నాలుగు రోజుల్లోనే 'తమ పని' కానివ్వబోతున్నారని వినికిడి. వారిని కాపాడుకునేందుకు కేసీఆర్ ఎలాంటి వ్యూహాలు పన్నుతారో వేచి చూడాలి.

సన్న వడ్ల సేకరణకు ప్రాధాన్యత

త్వరలో రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇస్తాం

పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సన్న వడ్ల సేకరణకు ప్రాధాన్యమిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్‌లో 16వ మూకాంబికా రైస్ అండ్ గ్రెయిన్ టెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం వినియోగమనేది దాదాపు వంద శాతం ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నదని తెలిపారు. పీడీఎస్ బియ్యం జోలికి వెళ్లొద్దనీ, ఎవరైనా రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన రైస్ మిల్లర్లను హెచ్చరించారు. రాష్ట్రంలో 90 నుంచి 95 శాతం మంది రైస్ మిల్లర్లు న్యాయంగా ఉంటున్నారనీ, కొందరు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పండిస్తున్న కొన్ని రకాల వెరైటీలను ఎగుమతి చేసుకునేందుకు అనుమతి కోసం కేంద్ర మంత్రులను కలుస్తామని వెల్లడించారు. రైస్ మిల్లులను ప్రభుత్వం ప్రధాన పరిశ్రమగా గుర్తిస్తున్నదని స్పష్టం చేశారు. సీఎంఆర్, ధాన్యసేకరణ తదితర విషయాల్లో రాజకీయ నాయకులు, అధికారుల జోక్యం ఉండబోదని హామీ ఇచ్చారు. రైస్ మిల్లర్లపై వేధింపులు ఉండవని తెలిపారు. అయితే ఎవరైనా సరే.. ఏకగ్రీవంగా రూపొందించుకున్న మార్గదర్శకాలు, నిబంధనల పరిమితిలకు లోబడి పని చేయాలని సూచించారు.

నైనీబ్లాక్ ఉత్పత్తి ప్రారంభించండి

(మొదటిపేజీ తరువాయి)

పెంచడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పనిచేస్తుందనీ, దీనికోసం పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో కోల్ సెక్టార్ స్వయం సమృద్ధి సాధించాలనీ, ఆ దిశగా తమ విధాన నిర్ణయాలు ఉంటాయన్నారు. వేలం పాటల ద్వారా సింగరేణిని నష్టాల్లోకి నెట్టే పనులు కేంద్ర ప్రభుత్వం చేయబోదనీ, కచ్చితంగా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కోల్ ఇండియాను గాడిన పెట్టాల్సిన అవసరం ఉందనీ, నష్టాల్ని లాభాలుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాణిజ్య బొగ్గు గనుల వేలం ద్వారా రాష్ట్రాలకే అధికాదాయం వస్తుందనీ, ఫలితంగా ఆయా రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించగలుగుతాయని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సింగరేణి వంటి ప్రభుత్వ సంస్థలకు కేంద్రం కొత్తగా తెచ్చిన చట్టంలోని 17(ఏ) ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ ద్వారా బొగ్గు బ్లాకులు కేటాయించే అవకాశం ఉన్నా దాన్ని పక్కనపెట్టి వేలం పాట ద్వారా ప్రయివేటు వారికి అవకాశం కల్పించడం సరికాదన్నారు. సింగరేణి సంస్థ ఇప్పుడు 39 బొగ్గు గనులతో నడుస్తున్నా, కొత్త గనుల కేటాయింపు లేకపోతే మనుగడే ప్రశ్నార్థకమవుతందన్నారు. వచ్చే ఐదేండ్లలో 8 భూగర్భ గనులు, మూడు ఓపెన్ కాస్ట్ గనులు మూతపడబోతున్నాయనీ, 2032 సంవత్సరం నాటికి మరో ఐదు భూగర్భగనులు, ఆరు ఓపెన్ కాస్ట్ గనులు, 2037-38 నాటికి మరో 5 గనులు మూతపడుతున్నాయని వివరించారు. సింగరేణి కేవలం కంపెనీ మాత్రమే కాదనీ, అది ఉద్యోగ, ఉపాధి కల్పనా కేంద్రమని చెప్పారు. సింగరేణి సంస్థకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇంకా మిగిలి ఉన్న 14 వేల లక్షల (మిలియన్లు) టన్నుల బొగ్గును తీసేందుకు వీలుగా చట్ట ప్రకారం రిజర్వేషన్ కోటాలో బ్లాకులు కేటాయించాలని కోరారు. దీనిపై అఖిలపక్షంతో ప్రధాని వద్దకు వస్తామనీ, రాష్ట్రానికి నష్టం కలగకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఎన్‌టీపీసీ నాలుగు వేల మెగావాట్ల ప్లాంట్, సింగరేణి నిర్మిస్తున్న మరో 800 వందల మెగావాట్ల ప్లాంట్లకు దాదాపు 24 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం అవుతుందని తెలిపారు. అందువల్ల సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని కోరారు. గతంలో నిర్వహించిన వేలంపాట ద్వారా సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం బ్లాకు-3 లను పొందిన ప్రయివేటు కంపెనీలు ఇప్పటివరకు అక్కడ బొగ్గు తవ్వకాలు ప్రారంభించలేదనీ, అందువల్ల చట్ట ప్రకారం ఆ కేటాయింపులు రద్దుచేసి, వాటిని సింగరేణికి కేటాయించాలని కోరారు. వాటితో పాటు శ్రావణపల్లి బ్లాకు, పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్‌లు ఉన్నాయనీ, వాటిలో ఇప్పటికే సర్వే పూర్తయ్యిందనీ, ఈ బ్లాకుల పక్కనే సింగరేణి పాత గనులు నడుస్తున్నాయని చెప్పారు. వీటిని కూడా ఆ సంస్థకు కేటాయిస్తే ఎక్కువ ఖర్చు, కష్టం లేకుండా అందుబాటులో ఉన్న ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో సింగరేణి వెంటనే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. అయితే ఈ బ్లాకుల్ని వేలంద్వారా విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సింగరేణి వంటి ప్రభుత్వ సంస్థకు ప్రభుత్వాలే సహకరించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయమంత్రి సతీష్‌చంద్ర దూబే, ఆ శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా, అదనపు కార్యదర్శి ఎమ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | జూన్ 22, 2024 | www.navatelangana.com

భూలక్ష్మి నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ లోని భూలక్ష్మి నగర్‌లో శానిటేషన్ సిబ్బంది విధి నిర్వహణను హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న పార్క్ పరిసరాల్లో చెత్తాచెదారం ఉండడం చూసి వెంటనే సంబంధిత శానిటేషన్ సూపర్వైజర్ రాజ్ కుమార్ సిబ్బందితో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం శుభ్రం చేయించారు. కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా కాలనీ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వారు శానిటేషన్ సూపర్వైజర్, సిబ్బందికి తెలిపారు. సానిటేషన్ సిబ్బంది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



మునగనూరు హెడు స్మార్ట్ స్కూల్‌లో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న స్కూల్ డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, విద్యార్థులు. నవతెలంగాణ-సిటీబ్యూరో

పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి



- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు

నవతెలంగాణ - చైతన్యపురి

నీట్ పరీక్షను రద్దుచేసి , పేపర్ లీక్ చేసిన దోషుల ను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ పై ఎస్ఎఫ్ఐ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ కేంద్రంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లీకేజీ మూలంగా 24 లక్షల కుటుంబాలు తీవ్ర ఆవేదనలో ఉన్నాయన్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కోచింగ్ లు తీసుకొని పరీక్షలు రాస్తే చివరి నిమిషంలో పేపర్ లీకేజీ కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాలు బీహార్, గుజరాత్ హర్యానా రాష్ట్రాలలో లీకయ్యాయని ఆరోపణలు వచ్చాయన్నారు. ముఖ్యంగా ఆయా రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉంద, పేపర్ లీకేజీ లో బీజేపీ నాయకుల పాత్ర కీలకంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి లోకం ముక్తకంఠంతో చెబుతున్నా ప్రధాని మోడీ ఇప్పటికీ స్పందించకపోవడం శోచనీయం అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఢిల్లీని ముట్టడస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్, ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్షులు కానుగుల అరుణ్, డివిజన్ కార్యదర్శి స్టాలిన్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, సాయి, ఇంతైజ్, సుభాష్, నవీన్, శివ, అరుణ్, జస్వంత్ , పవన్, వరలక్ష్మి, శ్వేత, శివ నీల, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యానికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- హెచ్ఎండబ్ల్యూఎస్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష





నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించటం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో హెచ్ఎం డబ్ల్యూఎస్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించటం కోసం కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు,కాలనీల్లో నివాసం ఉండే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 6, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 8, జల్‌పల్లి మున్సిపాలిటీకి 5, తుక్కుగూడ మున్సిపాలిటీకి 3 రిజర్వాయర్లు కేటాయించి నీటి ఎద్దడిని నివారించేందుకు గత ప్రభుత్వం రూ. 107 కోట్లతో నిధులు కేటాయించి పూర్తి చేయడం జరిగిందన్నారు. కొత్తగా 13 కొత్త రిజర్వాయర్ల నిర్మాణం కోసం రూ. 207 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఎన్నికల కోడ్ వల్ల కొంత జాప్యం జరిగిందన్నారు. మిగిలిన పనులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా, రిజర్వాయర్లను పూర్తి చేసి పాత నీటి పైపు లైన్ తొలగించి కొత్త పైపు లైన్లు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి కుర్మలగూడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనిలో నివాసం ఉంటున్న 4000 కుటుంబాలకు త్వరితగతిన తాగునీటిని నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటి అందుబాటులోకి తీసుకవచ్చి సరఫరా చేయాలని జలమండలి ఎండీతో మాట్లాడటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్లాల్ చౌహాన్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రామ్ శేఖర్, బీఆర్ఎస్ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి,ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, కార్పొరేటర్లు పవన్ కుమార్ యాదవ్, నాయకులు బి.శేఖర్ రెడ్డి, జే. శ్రీనివాస్ యాదవ్, హెచ్ ఎం డబ్లు ఎస్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు గోవిందు గౌడ్, హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

చైతన్యపురి : ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రెండు డివిజన్‌లపై క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జీహెచ్ఎంసీ, వాటరవర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులతో సమీక్ష నిర్వహిచారు. రెండు డివిజన్‌లలోని కాలనీలు బస్తీలలో జరుగుతున్న, జరగాల్సిన పనుల గురించి ఆరా తీశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగతిన పూర్తిచేసి ఈ వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయా అధికారులను ఆదేశించారు. గతంలో శాంక్షన్ తీసుకున్న పనులను పూర్తి చేయాలని, రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థను ప్రజలకు అనుగుణంగా మెరుగు పరచాలని సూచించారు. తానే స్వయంగా ప్రతి కాలనిలో, బస్తీలో పర్యటిస్తానని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా తన దష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్‌లకు సంబందించిన డీసీలు, ఈఈ, ఏఈ లు విద్యుత్ శాఖకు చెందిన ఏడీ, ఏఈ లు వాటరవర్క్స్, ఏఈ, టౌనప్లానింగ్, శానిటేషన్ అధికారులు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సాజిద్, రుషి తదితరులు పాల్గొన్నారు.

‘శరీరాన్ని మనసును ఏకం చేసే సాధనం యోగా’







నవతెలంగాణ- నాగోల్.

యోగా అనేది ఒక వ్యాయామం కాదని, అది శరీరాన్ని, మనస్సును ఏకం చేసే సాధనం అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాగతి అభ్యదయ సంఘం శ్రీ షిరిడీ సాంఘ అష్టాంగ యోగా సంయుక్త ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ శ్రీ కన్వెన్షన్ లో జరిగిన యోగా డే సన్మాన వేడుకల కార్యక్రమంలో ఆయన ఐవీఎఫ్ అడ్వైజరీ బోర్డు సెంట్రల్ కమిటీ చైర్మెన్ గంజి రాజమౌళి గుప్తతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ శారీరక, మానసిక సామర్థ్యాలను పెంచి మనిషికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే ఏకైక మార్గం యోగా అని అన్నారు. సనాతన భారతీయ ధర్మం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప వరం యోగా అని పేర్కొన్నారు. నటుడు పసునూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అవార్డ్ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 25 మంది యోగా గురువులకు సన్మానం చేశారు.ఇంటర్నేషనల్ యోగా గురువులు వాని శ్రీ సాంబ శివ రావు, వందన వెంకటేశ్వర్లు, ఎలిజబెత్ ప్రదీప్ రావు అరుణ, ఐవీఎఫ్ కోశాధికారి నారాయణ, ఐవీఎఫ్ మొదటి మహిళ ఉప్పల స్వప్న , చెందా భాగ్య లక్ష్మి గారు, మంజుల, జగతి, మని మాల తదితరులు పాల్గొన్నారు

సంతోష్ నగర్ : మనసును ఏకం చేసే గొప్ప సాధన యోగ అని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి యోగా దినోత్సవం సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ పార్క్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ హాజరై ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. యోగా సాధనను అందరం ఆచరిద్దామని, సంపూర్ణ ఆరోగ్యంగా జీవిద్దాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, యోగా గురువు ప్రభాకర్ రెడ్డి, సీఎస్ రెడ్డి, జైపాల్ రెడ్డి,బాలకష్ణ గౌడ్, బిజెపి నాయకులు రమాదేవి, ప్రశాంత్, సుష్మ, కాలనీ కమిటీ సభ్యులు అభిమానులు పెద్దలు పార్టీ శ్రేణులు కార్యకర్తలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

వనస్థలిపురం : వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీ లోని సీనియర్ సిటిజన్స్ యోగ మందిరంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పానుగంటి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి హాజరై మాట్లాడుతూయోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని



దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రతాప్‌రెడ్డి రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో యోగ అభ్యసనం తప్పనిసరిగా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఫ్‌సీఐ కాలనీ వెల్ఫేర్ అధ్యక్షుడు సిరిగిరి రాంరెడ్డి, ఉపాధ్యక్షులు ఆది నరసింహారావు, రాంనాథ్ సంగు, రఘుపతి రెడ్డి, సీనియర్ సిటిజన్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ : యోగాసనాలు, ప్రాణాయామం శిక్షణ అవగాహనను అభివద్ధి చేసుకుంటూ ఏకాగ్రత జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవాలని. నవయుగంలో పని వాతావరణంలో మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతతతో జీవనశైలి వ్యాధులను అధిగమించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని బీజేపీ మలక్‌పేట్ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సలీంనగర్ పార్క్‌లో జరిగిన యోగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.బొక్కా మధుసూధన్ రెడ్డి, కొప్పుల దినేష్,యాదిగిరి, సురేందర్ పాల్గొన్నారు

యోగా చేస్తే ప్రశాంతంగా ఉండవచ్చని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యానికి మంచిది కదా అని అతిగా యోగా చేస్తే ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తు న్నారన్నారు. మంజుల రెడ్డి, సంధ్యా, వనజా, విజయ, నీరజా, కళా, పావని, మధు, లతా, దేవికా, కావ్యా, సురేఖా తదితరులు పాల్గొన్నారు

నీటిలో తేలుతూ పద్మాసనం



చైతన్యపురి : మానసికంగా ధృడంగా ఉంటే, శారీరక ధఢత్వాన్ని అవలీలగా సాధించగలం అని ఇవి రెండింటినీ మనం సాధించాలంటే అది యోగా ద్వారా మాత్రమే సాధ్యమని యోగ గురు బిళ్ల విజయలక్ష్మి అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా "నీటిలో తేలుతూ పద్మాసనం" వేస్తూ 30 నిమిషాల పాటు యోగ చేశారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ సాధనతో దేన్నయినా సాధించవచ్చని ఇప్పటి సమాజానికి చెప్పడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు యోగపై అవగాహన పెంచుకోవాలి అని అన్నారు. చిన్న,చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఉదాహరణకు శరీరంలో లో వేడి పెరిగినప్పుడు - శీతలీ ప్రాణాయమం, చలికి శరీరము తట్టుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు కపాలభాతి ప్రాణాయామం ప్రాక్టీస్ చెయ్యాలి అనే అవగాహనను కలిగి ఉండడం వలన మెడిసిన్, హాస్పిటల్ కు వెళ్ళకుండా మన ఆరోగ్యాన్ని మనమే పెంపొందించుకోవచ్చు అని అన్నారు.



మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా..

- జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాత్యూ జోసెఫ్

నవతెలంగాణ -నాగోల్



మనిషి శరీరాన్ని రోగాలకు దూరం చేసుకుంటూ మానసిక ఒత్తిడి లేకుండా శరీరాన్ని పటిష్టత పరుచుకునేందుకు యోగానే సాధనమని జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాత్యూ జోసెఫ్ అన్నారు. శుక్రవారం నాగోల్‌లోని డివిజన్లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ మాథ్యూ జోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ మిషన్ వి. డాక్టర్ మాథ్యూ జోసెఫ్‌లు.. శిక్షణ సంస్థ డైరెక్టర్లు, కోర్ ఫ్యాకల్టీలు, అధికారులు, ట్రైనీలు, ఉద్యోగుల సమక్షంలో యోగా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగా పరివర్తన శక్తి వ్యక్తుల శ్రేయస్సును ఎలా మెరుగుపరుస్తుంది... సామరస్య సమాజానికి ఎలా దోహదపడుతుందో ఆయన వివరించారు. యోగ గురువు రవికుమార్ జీఎస్ఐ శిక్షణ సంస్థ అధికారుల కోసం జీఎస్ఐ శిక్షణ సంస్థలోని ఎమ్మెస్ కష్ణన్ ఆడిటోరియంలో యోగా సాధన సెషన్‌లను నిర్వహించారు. ఈ సెషన్లలో మొత్తం 55 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్. మల్లేష్ గంజి, లతోపాటు అధికారులు, జీఎస్ఐ శిక్షణ సంస్థ ఉద్యోగులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేసినట్లు కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ పరిధిలో ఎలాంటి అనుమతి తీసుకోకుండా కొందరు షెడ్లు వేసి వ్యాపారం చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుతో హైకోర్టు ఆదేశం మేరకు మీర్ పేట్ పోలీసుల సహాయంతో టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ సిబ్బందితో కలిసి షెడ్డును తొలగించమని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలో ఇంకా కొన్ని అనుమతి లేకుండా నడుస్తున్నాయని గుర్తించామని నోటీసులు సైతం అందజేశామని యజమానులు స్పందించి అనుమతి తీసుకోకపోతే వాటినిపై కూడా చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడి వల్లే అధికారులు కూల్చేశారు.. : షెడ్డు యజమాని పానుగంటి కోటేశ్వరి

గత నాలుగు నుండి నందీహిల్స్ మెయిన్ రోడ్డు పక్కన ఒక ప్లాట్ లీజుకు తీసుకొని చిన్న షెడ్డును నిర్మాణం చేసుకొని చికెన్ షాప్ పెట్టుకున్నాను. కొందరికి ఉపాధి సైతం కల్పిస్తున్నాను. వ్యక్తిగతంగా నాకు పడని కొందరు రాజకీయ నాయకులు నా షాపుపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసి కూల్చివేసేటట్లు అధికారులపై ఒత్తిడి పెంచి కూల్చేలా చేశారు. అప్పులు చేసి చిన్న షెడ్డు పెట్టుకుంటే వాళ్లకు అడిగినవి ఇవ్వలేదని ఇలా చేశారు. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి



కర్మన్ ఘాట్ ఆలయంలో గ్రానైట్ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-సంతోష్‌నగర్

కర్మనాఘాట్ హనుమాన్ దేవాలయ ఆవరణలోని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపం చుట్టూ ఉన్న పాత బండలతో వర్షాకాలంలో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో దేవాలయ పాలక మండలి చైర్మెన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు తమ సొంత ఖర్చుతో ఈ పాత బండల స్థానంలో నూతనంగా యాంటీ స్కిడ్ గ్రానైట్ బండలు వేయించడానికి నిర్ణయం తీసుకోవడంతో పనుల ప్రారంభానికి ముందు శుక్రవారం దేవాలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం పనులు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు మధుసాగర్, తిరుమలేష్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మధుసూధన్‌రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, ఆనంద్ గౌడ్, సురేష్ గౌడ్, యాదగిరి, కిరణ్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో జయశంకర్ ఎప్పటికీ ఉంటారు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి



నవతెలంగాణ-సంతోష్ నగర్

తెలంగాణ ప్రజల హదయాల్లో ప్రొ. జయశంకర్ సార్ ఎప్పటికీ ఉంటారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం చంపాపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ప్రక్కన ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో ఆయన ఎప్పుడూ నిలిచే ఉంటారన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం, ఉద్యమ భావజాల ప్రసరణ కోసం తన జీవితాన్నే అర్పించిన మహనీయుడు జయశంకర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ముడుపు రాజిరెడ్డి,ఉమమాహేశ్వర్,రవి ముదిరాజ్, రాఘవచారి, శ్రీనాథ్,బొంబాయి, ప్రభాకర్, బైగాళ్ల రాము, సతీష్, జంగయ్య, నర్సింహ,కనకేశ్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు మరువలేనివి.

చైతన్యపురి : రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ లు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నగేష్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు న్యాళ కొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శులు సిద్ధగోని వెంకటేష్ గౌడ్, మురళీధర్ రెడ్డి, అనురాధ, లతశ్రీ లు పాల్గొన్నారు.



విద్యార్థి మృతికి నిరసనగా ధర్నా



నవతెలంగాణ-తుర్కయంజాల్

విద్యుద్ఘాతంతో మృతి చెందిన ఇంటర్ విద్యార్థి గిరీష్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో కోహెడ నారాయణ కళాశాల బ్రాంచ్ ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి శివకుమార్, గ్యార క్రాంతినారాయణలు మాట్లాడుతూ యాజమాన్య నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణం కాబట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి కార్పొరేట్ స్కూల్, కాలేజీలు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పెరుగుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, అంతేగాక లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు మాత్రం భద్రత ఇవ్వని ఇలాంటి కార్పొరేట్ కళాశాలలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, జిల్లా నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హయత్‌నగర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా వేడుకల్లో హయత్‌నగర్ కోర్టు 14వ అదనపు జడ్జ్ సల్మా ఫాతిమా, ఏడవ జడ్జ్ సంకేత్ మిత్ర పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ యోగా మన దినచర్యలో భాగంగా ఉండాలని అన్నారు దీనివలన ఆరోగ్యకరంగా శరీరం, ఆహ్లాదకరంగా మనసు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు బిక్షపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ గౌడ్, న్యాయవాదులు, కోర్టు సూపరింటెండెంట్ దార రాములు, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు వెంకటేష్, కోర్టు నాజర్ నరసింహారెడ్డి, కోర్టు సిబ్బంది, వివిధ కోర్టుల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికలు



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి, శామీర్ పేట మండలాల్లో చదివే విద్యార్థులకు హాకింపేటలోని తెలంగాణ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 24న శామీర్‌పేట మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఎంపికలు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వసంత కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న 4వ తరగతిలో ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు 2015 అక్టోబర్1వ తేదీ నుంచి 2016 సెప్టెంబర్ 31వ తేదీలోపు జన్మించి ఉండాలని, తమ వెంట పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాలో బోనాఫైడ్ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, 5పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని కోరారు. పూర్తి వివరాలకు 9502456329, 9182133856, 9704816313 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాధితుడికి ఎమ్మెల్యే, ఎంపీ ఈటల పరామర్శ



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నగల షాపు యజమానిని బురఖా ధరించిన దుండగులు కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. మేడ్చల్ పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శేషారాంచౌదరిని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ పట్టపగలే పోలీస్ స్టేషన్ పక్కనే ఈ ఘటన జరగడం ఆందోళన కలిస్తుందన్నారు. పోలీసులు దొంగలను వీలైనంత తొందరగా పట్టుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం డబిల్ పూర్ గ్రామంలో ఇటీవల సీతారామ చంద్రుల విగ్రహాలను ధ్వంసం చేసిన హనుమాన్ల గుట్ట ఆలయాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు.

భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీ, నాగలక్ష్మీ నగర్ కాలనీ, మల్లాపూర్ ఐడీఏ ప్రధాన రోడ్డులో భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడాని రూ.42 లక్షల వ్యయంతో భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, స్థానిక కాలనీ వాసులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ట్యాంక్ బండ్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ భరత్ పెట్రోల్ బంకును మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విని యోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభు, మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మెన్ దామన్నగారి ప్రభాకర్, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, అమరం హేమంత్ రెడ్డి, అమరం జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ విస్టా హెూమ్స్ కాలనీలో శ్రీదేవి పర్యటన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ డివిజన్ పరిధిలోని మోడీ విస్టాహెూమ్స్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వాటర్ లైన్ గుంతల్లో వాటర్ నిలుస్తున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వాటర్ వర్క్స్ అధికారులతో లైన్ క్లియర్ చేయాలని కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ అధికారులకు సూచించారు. కాలనీవాసులో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే త్వరగా పరిష్కారం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ ,జైపాల్ రెడ్డి, కళ్యాణ్ ,పురుషోత్తం, భాస్కర్ రావు, శ్రీశైలం, భాస్కర్ రావు, నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిని కలిసిన రామకృష్ణ కాలనీవాసులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను రామకృష్ణ కాలనీ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీకి నూతన రోడ్లు, డ్రయినేజీ మంజూరయ్యాయని, కాంట్రాక్టర్లను నియమించి పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదశి అంకల రమేష్, వడ్డేపల్లి రమేష్, బాల్ రెడ్డి, ప్రభు గౌడ్, నరసింహ ,శామ్ తదితరులున్నారు.

జయశంకర్ సార్‌కు ఎమ్మెల్యే మర్రి నివాళి



నవతెలంగాణ-మల్కాజిగిరి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితమంతా తపించిన కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్‌లోని ఈస్ట్ ఐఎన్‌నగర్‌లో ఉన్న జయశంకర్ సార్ విగ్రహనికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, నాయకులు రావుల అంజయ్య , జేఏసీ వెంకన్న, కొత్త పల్లి ఉపేందర్ రెడ్డి, సర్వే నరేష్, బైరు అనీల్, కాటంరాజు, భిక్షపతి, తదితరులున్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో బీపీ, షుగర్ రోగుల కోసం శ్రీచక్రి విద్యానికేతన్ హై స్కూల్ చక్రిపురం క్రాస్ రోడ్డులో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కమిటీ కోశాధికారి జన్ని శుక్రవారం తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్ బాధితులుకు పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చక్రిపురం, కుషాయిగూడ, చర్లపల్లి, నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి తదితర ప్రాంతాల వారు ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్:9989925997, 9700616679, 9959536083 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా యోగా దినోత్సవం







నవతెలంగాణ-కీసర

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నాగారం సెరినిటి పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత మాట్లాడుతూ యోగా ప్రతి రోజూ చేస్తే శారీరకంగా, మానసికంగా, ప్రశాంతంగా ఉంటామని తెలిపారు.

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో..



నాగారంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు సుమలత విద్యార్థులందరికీ యోగ ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సయ్యద్ ఖాసీం అలీ, కోఆర్డినేటర్ రమేష్ , డీన్ హేమంత్ , ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కీసరలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ఉత్సాహంగా జరిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో యోగా పాత్రను చెప్పడానికి అనేక జ్ఞానోదయ కార్యక్రమాలను నిర్వహించారు. యోగా ప్రాముఖ్యత, ఇంటరాక్ట్ క్లబ్ ఏర్పాటు, యువ టూరిజం క్లబ్ ఏర్పాటు గురించి ప్రిన్సిపాల్ శ్రీలత చెన్నప్రగడ సాదర వివరించారు. పాఠశాలలో విద్యార్థులు, అధ్యాపకులందరూ ప్రతి క్షణాన్ని ఆస్వాదించే వేదికను కల్పించిన చైర్మెన్ మల్క కొమరయ్య, డైరెక్టర్ సుశీల్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. యోగాతో దైనందిన జీవితంలో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ప్రముఖ విద్యావేత్త, రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్ అధ్యక్షుడు డాక్టర్ రామ శేషగిరిరావు చెన్నప్రగడ, గౌరవ అతిథిగా వచ్చిన సీఈవో గీతా భాస్కర్, ప్రత్యేక అతిథి, ప్రముఖ సెలబ్రిటీ యోగా ట్రైనర్ ప్రియాంక మందగడ్డ హాజరయ్యారు.

నాగారంలో..

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా నాగారం మున్సిపల్ పరిధిలో చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యం లో కుంట్ల బలరాం రెడ్డి గురూజీ యోగ సాధనలు చేయించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రజలు ప్రతినిత్యం యోగా ద్వారా జీవనశైలిని మెరుగు పరుచుకోవచ్చని తెలిపారు. మన పూర్వీకులు బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేచి ప్రతినిత్యం ధ్యానం చేసి నిండు నూరేళ్లు జీవించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు ఉన్నారు.

పల్లవి మోడల్ స్కూల్‌లో..



బోడుప్పల్‌లో..

అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్ లో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు చేసి సభికులను ఆకట్టుకున్నారు. ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగాసనాల వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదగాలంటే శరీరానికి యోగా తప్పనిసరిగా ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థి అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించగలు గుతాడని సూచించారు. యోగా దినోత్సవాన్ని పల్లవి మోడల్ స్కూల్స్‌లో ఈషా ఫౌండేషన్ సహకారాలతో నిర్వహిస్తున్నామని స్కూల్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తనూజ మాట్లాడుతూ యోగా చేయటం వల్ల పొందే లాభాలను క్షుప్తంగా తెలిపారు. దీనివల్ల మానసిక, శారీరక ప్రశాంతతను పొందవచ్చునని వెల్లడించారు.

నీట్ పరీక్షపై న్యాయ విచారణ జరిపించాలి



సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కాప్రా

ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) పార్టీ ఆఫీసు నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ ర్యాలీని ఉద్దేశించి కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు, నాయకులు సీహెచ్. దేవిరెడ్డి మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరితో వైద్య విద్యను చదవాడానికి నీట్ ఎగ్జామ్ రాసిన 24 లక్షల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష మే 5వ తేదీన దేశవ్యాప్తంగా 4750 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన బీహార్, గుజరాత్, హర్యానాలో లీకేజీలు జరగడం సిగ్గుచేట్టన్నారు. మే 4వ తేదీన విద్యార్థుల చేతుల్లోకి నీట్ పరీక్ష పేపర్ వచ్చిందన్నారు. ఈ కుంభకోణంలో గుజరాత్‌లోని ఫారిన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ అధినేత పరుషోత్తం రాయ్ అనే వ్యక్తి తుషార్ బట్ అనే అధ్యాపకుడి సహకారంతో విద్యార్థుల నుంచి రూ.10 లక్షల చొప్పున వసూలు చేసి నీట్ పేపర్‌ను లీక్ చేశారని ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. 30 మంది విద్యార్థులను నుంచి రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షలు వసూలు చేశారని బీహార్‌లో 13 మందిని అరెస్టు చేశారని పేర్కొన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నా మోడీ స్పందించకపోవడం సిగ్గుచేట్టన్నారు. నీట్ పరీక్షను నిర్వహించుకొనుటకు ఆయా రాష్ట్రాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ పరీక్షల్లో అవకతవకలపై అక్షయ అనే విద్యార్థిని సుప్రీంకోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రసాద్, ఎమ్మెస్‌రావు, బీవీ. సత్యనారాయణ, శివనారాయణ, సోమయాచారి, ఉదయభాస్కర్, జయరాజు, జీవీ. రావు, కురునెల్లి వెంకట్ ,శారద, సఫియా సుల్తానా, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..



నీట్‌ను రద్దు చేయాలని కాప్రా డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో సీఐటీయూ, సీపీఐ(ఎం)పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, ప్రభాకర్, ఉపేందర్, రాజ్ కుమార్, అబ్దుల్లా , నాగరాజ్, తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..



నీట్ పరీక్షా పేపర్ లీకేజీలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నీట్ అవకతవకలు, లీకేజీలపై, ఎన్‌టీఏ అధికారులను సమగ్రంగా విచారణ చేసి రీ ఎగ్జామ్ నిర్వహించాలని ఈసీఐఎల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ఎన్‌టీఏ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయని తెలిపారు. తక్షణమే కేంద్ర విద్యా శాఖ మంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వం విద్యారంగాన్ని, పరీక్షలను కేంద్రీకృతం చేసి ప్రయివేట్ కోచింగ్ సెంటర్లపు పెంచి పోషిస్తూ మతోన్మాదాన్ని పెంచే దృష్టితో వ్యవహరిస్తుందన్నారు. ఈ కుట్రను తిప్పికొట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు టీ.అరుణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మౌనిక, సరిత, నవ్య, నందిని, దివ్య, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో..



నీట్ పరీక్షను రద్దు చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరి చౌరస్తాలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సతీష్ కుమార్, శ్రీనివాస్, సంతోష్ రాందాస్, నయీమ్ ఖాన్, సయ్యద్ మబ్బు, కొండ గౌడ్, నరేందర్ గౌడ్, మహేందర్ గౌడ్ సాయినాథ్ గౌడ్, సయ్యద్ మబ్బు, డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్, ఉమేష్ సింగ్, వైనాల ప్రవీణ్, పంజా శ్రీనివాస్ యాదవ్, వినోద్ యాదవ్, పిట్టల నాగరాజు, ప్రభావతి, సుమలత యాదవ్,బ్రహ్మయ్య, బబితా,మైమునా బేగం,మెహన్ రెడ్డి, కన్నా, ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయానికి రేకుల షెడ్డు నిర్మాణం



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్‌లోని గణేష్ నగర్‌లో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ముందు రూ. 1లక్ష విలువ చేసే రేకుల షెడ్డు నిర్మాణానికి దాత జయశంకర్ సార్ సేవ సమితి చైర్మెన్ జనగామ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కొత్తపల్లి సతీష్ కుమార్ ముందుకు వచ్చారు. ఆయన షెడ్డు నిర్మాణానికి సరిపడ డబ్బును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు సతీష్ కుమార్‌ను ఆశీర్వదించారు. సతీష్ కుమార్‌కు ఆలయ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా శంకర్

నవతెలంగాణ-జవహర్ నగర్



బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి గా రంగుల శంకర్‌ను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, బీజేపీ పార్టీ , ఓబీసీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

గ్రామాలాభివృద్ధికి జిల్లా పరిషత్ నుండి తన సహకారం ఎప్పుడు ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండలం ప్రతాప్ సింగారంలో రూ.50 లక్షల జడ్పీ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల భవన నిర్మాణానికి, రైతు వేదిక వద్ద మిని ఫంక్షన్ హాల్లో వంటశాల భవన నిర్మాణానికి, రెండో వార్డులో భూగర్భ డ్రయినేజీ, 8వ వార్డులో అంగన్ వాడీ కేంద్రం, తేజశ్వి హెూమ్స్‌లో కమ్యునిటీ భవన నిర్మాణానికి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాలకు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించామన్నారు. ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీటీసీ మలిపెద్ది వెంకట్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, మాజీ ఎంపీటీసీ బాషగళ్ల సంజయ్, మాజీ ఉపసర్పంచ్ ఆబేద బేగం, గ్రామ శాఖ అధ్యక్షుడు కొరుబోతు చంద్రమౌళి, నాయకులు బద్దం కుమార్, కందుల కుమార్, ప్రభాకర్ గౌడ్, బాషగళ్ల విజయ్, దేరంగుల బాలరాజ్, శివ, కొరుబోతు మల్లేష్, సిద్దగోని నర్సింహా గౌడ్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోత్ రాజేష్ నాయక్



నవతెలంగాణ-ఉప్పల్

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోత్ రాజేష్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉప్పల్‌లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా విద్యాసంస్థల్లో బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేట్టన్నారు. విద్యాధికారి నిర్లక్ష్యంతోనే యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న విద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు హరీష్, మణికంఠ , నాయకులు,జయకృష్ణ, సూర్య కిరణ్, సుమన్ ఉన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణం కోసం స్థల పరిశీలన



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి సర్కిల్‌లోని గౌతమ్ నగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే ప్రాజెక్టు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్‌తో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థలం పరిశీలన చేశారు. గౌతమ్ నగర్ రైల్వే గేట్ వద్ద పలుమార్లు రైల్వే గేట్ పడడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఆర్‌యూబీ నిర్మాణం పనులను త్వరగా చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత రాము యాదవ్, రైల్వే అధికారులు ఏడీఎం రవి ప్రకాశ్, ప్రాజెక్టు అధికారులు సుదర్శన్, జీహెచ్ఎంసీ ఇంజనీర్స్ లౌక్య, దివ్య జ్యోతి, నాయకులు రావుల అంజయ్య, జేఏసీ వెంకన్న, రాము యాదవ్, సర్వే నరేష్, కార్యకర్తలు, మహిళలు, బస్తీవాసులు ఉన్నారు.



నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జన్మదినం సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ శుక్రవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో జన్మదిన వేడుకలను నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట కిషోర్ తదితరులున్నారు.

- నవతెలంగాణ-మల్కాజిగిరి

ముదిరాజ్ మహాసభ యువజన విభాగం

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా దుబ్బ రామస్వామి



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణానికి చెందిన దుబ్బ రామస్వామి ముదిరాజ్ మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహా సభ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితుల య్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శుక్రవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్‌ల చేతుల మీదుగా అనుకున్నారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహాసభ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన బండ ప్రకాష్ ముదిరాజ్, బాలు ముదిరాజులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృపా సాగర్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం మల్లేశం,రాష్ట్ర కార్యదర్శి సత్తయ్య,మేడ్చల్ మండల అధ్యక్షుడు తలారి అశోక్ ముదిరాజ్,డబిల్ పూర్ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, డబిల్ పూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ వై.సత్యనారాయణ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
శనివారం | జూన్ 22, 2024 | www.navatelangana.com

తాన్సేన్‌ను ప్రారంభించిన ఓహ్రీస్ గ్రూప్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐదు దశాబ్దాల కలినరీ వారసత్వంతో, ఆహార ప్రియులకు విభిన్న రుచులను అందిస్తూ అలరిస్తోన్న ఓహ్రీస్ గ్రూప్, మొఘల్ శకం వైభవాన్ని వాయువ్య ప్రాంతపు అద్భుతమైన పాకశాస్త్ర వారసత్వంతో మిళితం చేసి తాన్సేన్ రెస్టారెంట్‌ను ప్రారంభించినట్టు వెల్లడించింది. ఈ సందర్భంగా ఓహ్రీస్ గ్రూప్ యజమాని అమర్ ఓహ్రి మాట్లాడుతూ "తాన్సేన్ వద్ద, మొఘల్ శకంలోని వైభవం, వాయువ్య సరిహద్దులోని గొప్ప వంటల వారసత్వాన్ని కలిసే ప్రపంచంలో మేం మిమ్మల్ని తీసుకువెళ్లనున్నాం. మేం లెజండరీ సంగీతకారుడు తాన్సేన్ నుంచి ప్రేరణ పొందాం. ఇక్కడ మొఘల్ శకం గొప్ప కలినరీ సంప్రదాయాలు సమకాలీన భోజనాలతో సజావుగా మిళితం చేయబడ్డాయి, దీని ఫలితంగా చరిత్ర, సజనాత్మకత, గ్యాస్ట్రోనమీ స్వచ్ఛమైన ఆనందాన్ని పొందుపరిచే రుచుల వేడుక జరుగుతుంది. సంప్రదాయం, ఆవిష్కరణల కలయికకు తాన్సేన్ ప్రాతినిధ్యం వహిస్తుంది. అభిరుచుల మొజాయిక్‌ను సష్టించి, జిహ్వా అభిరుచి ఉత్తేజపరిచి, మనతో కలిసి భోజనం చేసే వారందరిపై శాశ్వతమైన ముద్ర వేస్తుంది. గొప్ప అనుభవాలు, చిరునవ్వుతో కూడిన ముఖాలతో మా అతిథులకు సేవను కొనసాగించాలని మేం ఆశిస్తున్నాం" అని అన్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సీఐ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ జిల్లా, సూరారం పోలీస్ స్టేషన్‌లో రూ.1లంచం తీసుకుంటూ సీఐ ఏసీబీ అధికారులకు చిక్కాడు. అంటీ కరెప్షన్ బ్యూరో డి.ఎస్.పి ఆనంద్ మాట్లాడుతూ..ఒక ల్యాండ్ గ్రాబింగ్ విషయంలో సాయి రాజు పై కేసు నమోదైంది. ఆ కేసులో రౌడీషీట్ ఓపెన్ చేస్తాననడంతో ల్యాండ్ గ్రాబింగ్ కేసును మూసి వేయడానికి రూ. 2 లక్షలు ఇచ్చారు. దే ల్యాండ్‌లో డెవలప్మెంట్ వర్క్ చేయాలంటే మళ్లీ రూ 5. లక్షలు ఇవ్వాలని సూరారం సీఐ ఏ వెంకటేశం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఆ క్రమంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సీఐ వెంకటేశంను రూ. 1 లక్ష తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దోషులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి ఆనంద్ తెలిపారు. సీఐ ఆకుల వెంకటేశం ను అరెస్ట్ చేసి సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ స్టేషన్‌లో హాజరుపరిచారు.

దోమల నివారణపై అవగాహన సదస్సు



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సిద్ధార్థ హై స్కూల్ లో కూకట్‌పల్లి జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య సూచనలతో దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా, ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాం నిర్వహించారు. అందులో భాగంగా దోమల నివారణ, వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహులు మాట్లాడుతూ.. వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా, ముందస్తు చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఇంటింటికి వెళ్లి, మస్కిటో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండకుండా చూడాలన్నారు. కూలర్లు, నల్ల గుంతలు, సంపులు, బిల్డింగ్ పైన ఉన్న ప్లాస్టిక్ సింటెక్సు, ప్లాస్టిక్ డ్రమ్ములు,పగిలిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ,బకెట్లు, ఇంట్లో ఉండే రిఫ్రిజిరేటర్‌లో బ్యాక్ సైడ్ వాటర్ టిన్నును, ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు ద్వారా వ్యాధులు, డెంగ్యూ జ్వరం, మలేరియా, పలేరియా, మెదడు వ్యాపు, చికెన్ గున్యా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ హై స్కూల్ హెడ్మాస్టర్ మరియు టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

దేవేందర్‌రావుకు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కురుమయ్య గారి దేవేందర్ రావు జయంతి సందర్భంగా కూకట్ పల్లి దేవిస్థాన్ విల్లాస్, కేడీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌతికంగా దేవేందర్ మన మధ్యలో లేకపోయినా మన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి బజరంగ్ యూత్ సభ్యులు నవీన్ రావు, కె.భాస్కరరావు, పి.కాంతారావు, ఆనంద్ రావు, దుర్గా ప్రసాద్ రావు, భాను ,కట్టా శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో వీధి కుక్కల స్వైర విహారం

పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో ప్రధాన వీధులలో వెళ్లాలంటే ఎప్పుడు వీధి కుక్కలు విచుకుపడి కరుస్తాయో అని వాహనాదారులు, పాదాచారులు భయాందోళనతో గురవుతున్నారని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2 వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ జి.వెంకటరాజం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులకు అధికారులకు అనేక ఫిర్యాదులతో పాటు, పలు పత్రికలలో సైతం దృష్టికి వచ్చిన మునిసిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోజురోజుకు కుక్కల బారిన పడిన బాధితుల సంఖ్య పెరుగుతుందన్నారు. కుక్కలను నియంత్రి ప్రజలకు రక్షణ కల్పించాలని తెలిపారు. ఇటీవల పిల్లలపై, వృద్ధులపై దాడులు చేశాయన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు డాగ్ స్కాడ్ వాహనాల ద్వారా వీటిని అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

పూర్వీకులు అందించిన వరం యోగా



కార్పొరేటర్ మహేందర్ కొడిచెర్ల

నవతెలంగాణ - కూకట్ పల్లి

యోగా మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరం యోగా అని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మాత్రమే శరీర దృఢత్వం మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మన సంస్కృతి అయిన యోగాను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. మనమంతా ప్రతి ప్రతిరోజు యోగా చేయడం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్ ఖాన్, ఉపాధ్యాయులు రాములు ,అనిల్ ,శ్రీధర్ , భూరం ,మరియు బిజెపి సీనియర్ నాయకులు కర్కా డాకయ్య గారు ఐలయ్య యాదవ్ గారు, పాలాకి కిషోర్ గారు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా కర్క నాగరాజు



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్ ప్రాంతానికి చెందిన కార్మిక నాయకుడు కర్క నాగరాజును టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా నియమించారు. నియామక పత్రాన్ని టీపీసీసీ లేబర్ సెల్ ఛైర్మెన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా కర్క నాగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ఆర్. ప్రకాష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లేబర్‌సెల్‌ను బలోపేతం చేస్తూ అసంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన లేబర్ సెల్ జాతీయ ఛైర్మెన్ జి. సంజీవరెడ్డికి, లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మెన్ నల్లసంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సప్పిడి భాస్కర్, హెచ్.ఏ.ల్ ఐ.యన్.టి.యు.సి యూనియన్ వై.భాస్కర్ రావు,సదా మహేష్, కర్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న ఆలె నరేంద్ర పార్క్



పార్క్‌లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనిలోని జలకన్య హెూటల్ సమీపంలోని ఆలె నరేంద్ర పార్క్ నిర్వహణ లోపంతో అపరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలిచింది. పార్క్‌లో వాకింగ్ వెళ్ళే వాకర్స్, కాసేపు ఆహ్లాద వాతావరణంలో కూర్చుని సేద తీరాలని వచ్చే వారికి, పార్క్‌లో మద్యం సీసాలు, చెత్త చెదారంతో పాటు, పనికిరాని పాత సామాన్లతో నిండిపోయింది. ఓ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందని స్థానికులు తెలుపుతున్నారు. పార్క్‌లోకి సమీపంలో ఉండే వృద్ధులు ఎక్కువగా వచ్చి వాకింగ్ చేస్తుంటారు. వాకర్స్ రాగానే చెత్త చెదారంతో పాటు మద్యం సీసాలు దర్శనమిస్తుండటంతో పార్క్ నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడో విరిగి పడిపోయిన భారీ విద్యుత్ దీపాల స్తంభం, పార్క్‌లోని ఓ చెట్టుపై పడిపోయి ప్రమాదకరంగా ఉన్నా తొలగించకుండా అలాగే ఉంచారు. ఆ స్తంభం మీద పడి ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. అలాగే పార్క్‌లో ఏర్పాటు చేసిన మూత్రశాలల నిర్వహణ లేకపోవడంతో పార్క్‌లో బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్గంధంతో నిండిపోయింది. రాత్రి సమయాల్లో పార్క్ లో మద్యం సేవించే మందు బాబులు, సీసాలు పార్క్‌లో ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. భిక్షాటన చేసుకునే వ్యక్తి పార్క్‌లోనే తిష్ట వేసి ఉండటంతో పార్క్‌లోకి వచ్చి వాకింగ్ చేసుకోవాలన్నా సేద తీరడానికి రావాలన్న ఇబ్బందిగా ఉంటుందని వాకర్స్ వాపోతున్నారు. కాలనీ వాసులు ప్రయాణించేందుకు ఉపయోగించే పార్క్‌కు ఆనుకుని ఉన్న సీసీ రోడ్డుపై కార్లు, ద్విచక్ర వాహనాలు అక్రమ పార్కింగ్ చేయడంతో, అటుగా ప్రయాణించే వాహన దారులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని పలువురు కాలనీవాసులు తమ సమస్యలు వెలిబుచ్చారు. కాబట్టి ఆల్విన్ కాలనీలో ఉన్న ఏకైక పార్క్‌ను ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి శుభ్రంగా ఉండేలా చూడాలని జీ హెచ్ఎంసీ అధికారులను స్థానిక అసోసియేషన్ సభ్యులను కోరుతున్నారు.



ఆచార్య జయశంకర్ వర్ధంతి



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ జలకన్య హెూటల్ ముందు ఉన్న జయశంకర్ విగ్రహం వద్ద రామకృష్ణచారి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు హాజరై జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషిని గుర్తు చేస్తూ తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో రాష్ట్ర సాధనకై ఆయన చేసిన కృషి గొప్పదని, తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పిన మహాజ్ఞాని అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, తెలంగాణ సిద్ధాంత కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో రామకృష్ణ చారి, నరేందర్ రెడ్డి, భాస్కరా చారి, శంకర్ నేత, కనకరాజు, సుబ్బారావు, రాజ్ కుమార్, పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ అభినందనీయం

ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్ గౌడ్



నవతెలంగాణ-బాలానగర్

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేయడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ పరిధిలోని భగత్ సింగ్ పార్క్‌లో తెలంగాణ ప్రగతి సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో బాయమ్మ, నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్, సనత్ నగర్ సీఐ పురుషోత్తం రెడ్డి, రాంగోపాల్ పేట్ సీఐ నర్సింగ్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాలగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా నోట్ బుక్కులు పంపిణీ చేశారని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రైవేటు పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య అభ్యసించేలా వారిని ప్రోత్సహించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని కొందరు ట్రస్ట్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ అభినందణీయమని వారిని పండాల సతీష్ గౌడ్ అభినందించారు.

నీట్ పరీక్షా నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలం



కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నీట్ పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదలలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ సంవత్సరం జరిగిన నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదలపై జరుగుతున్న గందరగోళంలో నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం గాంధీభవన్ లో జరిగిన నిరసన కార్యక్రమానికి అక్కడి నుండి ట్యాంక్ బండ్ వరకు జరిగిన ర్యాలీలో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇంత పెద్ద వ్యవస్థ ఉండి కేంద్ర ప్రభుత్వం నీట్ ప్రవేశ పరీక్షలు సరిగా నిర్వహించలేకపోవటం సిగ్గుచేటన్నారు. గత ఏడు, ఎనిమిది సంవత్సరాలుగా నీట్ ప్రవేశ పరీక్ష విధానంలో ఇదే తంతు కొనసాగుతుందని, ఇది పారదర్శకతకు పాతర వేయడమేనని ఆయన విమర్శించారు. అనవసర గోప్యత పాటిస్తూ పారదర్శకత లేకుండా వ్యవహరిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను తీవ్ర గందరగోళానికి గురి చేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పరీక్షల నిర్వహణ కోసం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) విశ్వసనీయమీదే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కనీసం ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారు చెప్పడంలోనూ సంస్థ విఫలమైందని రమేష్ విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునావృత్తం కాకుండా పూర్తిస్థాయి సన్నద్ధతతో పరీక్షలు నిర్వహించాలన్నారు. సమయానికి పరీక్ష నిర్వహించకపోవడం ఫలితాలు విడుదల చేయకపోవడం ఎప్పుడు ఫలితాలు విడుదల చేస్తారు తెలియజేయకపోవడం పేపర్ లీకేజీ మళ్లీ పరీక్షలు నిర్వహించడం వంటి గందరగోళ పరిస్థితుల మధ్య విద్యార్థులు వారి తల్లిదండ్రులు మానసిక ఆందోళనకు గురవుతారన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం



నవతెలంగాణ-దుండిగల్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగ శిక్షకులు శ్రీనివాస్‌రావు హాజరై విద్యార్థులతో యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి జక్కుల త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ, యోగా మన దైనిందిన జీవితంలో ఒక భాగం కావాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేస్తే మన శరీరానికే కాక మన మనస్సు కూడా చాలా హాయిగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ యోగా వల్ల చాలా లాభలున్నాయని, నేటి యువతి యువకులకు యోగా చాలా ఉపయోగపడుతుందని, యోగా ద్వారా ఒత్తిడులకు లోనుకారని, ఎల్లప్పుడు ఉత్సాహంగా ఉంటారని, తాము ఇప్పటికి ఇంత ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండడానికి తాను నేర్చుకున్న యోగానే కారణమని తమ అనుభవా లను పంచుకున్నారు. యోగా శిక్షకులు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రతి నిత్యము యోగా చేయడం వల్ల ఏకాగ్రత, ఒత్తిడి నివారణ, ఊబకాయం, గుండె సమస్యలు నుండి దూరంగా ఉండటం వంటి ఎన్నో ఉపయోగాలతో పాటు, యోగాలో అసనానికి ఒక్కో ఉపయోగం ఉందని వివరించారు. విద్యార్థులచే పలు యోగాసనాలు వేయించి వాటి ప్రాముఖ్యతను తెలిపి, రోజు అభ్యాసం చేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి, కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, ఎస్ ఏ సి కన్వీనర్ శైలజ రెడ్డి , పలు విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.కార్తిక్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహించడంలో విఫలమైన ":నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ " (ఎన్టీఏ) సంస్థను తక్షణమే రద్దు చేయాలని, యూజీసీ , నెట్ , నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, రీ - ఎగ్జామ్ నిర్వహించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.కార్తిక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు జి. కార్తిక్ పాల్గొని ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ...ఎన్టీఏ జాతీయ పరీక్షలను నిర్వహించడంలో మరియు విద్యా మంత్రిత్వ శాఖ యొక్క అత్యంత బాధ్యతారాహిత్యాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఎన్టీఏ ప్రారంభం నుండి మొత్తం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తుంది.దేశంలో పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ పూర్తిగా అసమర్థంగా ఉందన్నారు. నీట్ లో పేపర్ లీక్, క్యూట్ పరీక్షలో పోరపాట్లు మరియు ఇప్పుడు తాజాగా యూజీసీ , నెట్ - 2024 పరీక్ష సమగ్రంగా నిర్వహించడంలో వైఫల్యం ఎన్టీఏ భాద్యత రహిత్యానికి, దాని రాజీ ధోరణికి నిదర్శనం. యూజీసీ , నెట్ రద్దు అనే నిర్ణయం ఇప్పటికే సెంట్రల్ యూనివర్శిటీల ప్రవేశ పరీక్ష (క్యూట్) పోరపాట్లు, మరియు ఇటీవలి నీట్ పరీక్ష లీక్ దాని చుట్టూ కొనసాగుతున్న వివాదాల తర్వాత కూడా పరీక్ష రద్దు జరిగింది. నిరంతర విద్యరంగంలో విభేదాల తీవ్రమవుతున్న నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ కనీసం నివారించే చర్యలు తీసుకోవడంలో విఫలం చెందింది. అందుకే తక్షణమే విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఎస్.ఎఫ్.ఐ.డిమాండ్ చేసిందన్నారు. విద్యారంగాన్ని, పరీక్షలను కేంద్రీకృతం చేసి ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లను,సంస్థలను పెంచి,విద్యలో మతోన్మాదాన్ని పెంచే దృష్టితో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా ఎన్టీఏ సృష్టించడం వెనుక ఉన్న కుట్రను తిప్పికోట్టాలని ప్రజలకు విద్యార్థినీ విద్యార్థులకు కోరారు. పరీక్ష పేపర్స్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వి. కార్తిక్ , సుబ్బు, అరుణ్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం : డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ యోగా అభ్యాసాన్ని పెంపొందిస్తుందన్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు యోగా మార్గం అన్నారు. ఆరోగ్యకరమైన జీవితం, జీవనశైలి మార్పు కోసం మన రోజువారీ జీవితంలో యోగాను అంతర్భాగంగా స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామ్‌మోహన్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సరస్వతి, డాక్టర్ గీతా ప్రసాద్, మంజుల రాజేశ్వర్ రెడ్డి, ఆయుష్ శాఖ డాక్టర్ ఎ.జంగయ్య, డాక్టర్ వి.రాజ్యలక్ష్మి, డాక్టర్ జి.భాను రేఖ, డాక్టర్ విజయ రాణి, డాక్టర్ డి.అనూషారాణి, వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని డిపార్టుమెంట్ల సూపర్‌వైజర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

- మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్‌లో నిర్వహణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడియాట్రిషన్ డాక్టర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ యోగాను వెలకట్టలేని అమూల్యమైన పురాతన భారతీయ సంప్రదాయంగా పేర్కొన్నారు. ఇది శరీరం, మనసును ఒక్కటిగా చేసి ఆలోచనలను, చర్యలను నియంత్రిస్తుందన్నారు. వ్యక్తిలో నిగ్రహాన్ని పెంచి మనిషి, ప్రకృతి మధ్య సామరస్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఆరోగ్యం, శ్రేయస్సుకు సంపూర్ణ విధానం యోగా అనీ, ఇది ఓ వ్యాయామం కాదు, కానీ వ్యక్తిలోని ఐక్యతాభావాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవడం వల్ల దీర్ఘకాలంలో అనేక ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఊబకాయాన్ని అరికట్టడంలో యోగా అద్భుతంగా పనికొస్తుందన్నారు. గుండె జబ్బులు, కాలేయ సమస్యల నియంత్రణ కూడా యోగాతో సాధ్యమేనని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి అని అన్నారు. డయాబెటిస్‌తో బాధపడేవారు రోజూ యోగా చేయడం ద్వారా రక్తంలో చక్కెరస్థాయిలను అదుపులో పెట్టుకోవచ్చు అన్నారు. యోగా రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి చైతన్యం కలిగించడమే అంతర్జాతీయ యోగా దినోత్సవం ముఖ్య ఉద్దేశం అన్నారు. యోగా శారీరక ఆరోగ్యానికి మేలు చేస్తుందనీ, అదే సమయంలో మానసిక ప్రయోజనాలను కూడా అందిస్తుందని తెలిపారు. మనస్సులో ఒత్తిడి లేకుండా చేస్తుందనీ, రోజంతా చురుకుగా ఉంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఉమన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ నిర్మలారెడ్డి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనందించాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు,స్వచ్ఛంద సంస్థల ముందుకు రావాలని కాలనీవాసులు పేర్కొన్నారు.ఈ మేరకుశుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి,ఉమాదేవినగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్య కమిటీ చైర్మన్ పద్మావతి,కాలనీ పెద్దలు కూరపాటి కరుణాకర్ రాజు,పి.సమ్మయ్య యాదవ్,శేర్విరాల కృష్ణమూర్తి, పి.రాములు గౌడ్,అశోక్ చారి,బోల్లేపల్లి సూర్యరాజు, ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయురాలు మాదవి కలసి విద్యార్థులకు వారి చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నారని అన్నారు.కాలనీ తరఫున పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

జులై 6 నుంచి 15 వరకు పీజీ ప్రవేశ పరీక్ష

- జులై 3 నుంచి హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్.... 27 వరకు ఎడిట్ ఆప్షన్స్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 ప్రవేశ పరీక్షలు జులై 6 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్టు కన్వీనర్ ఐనవోలు పాండురంగా రెడ్డి ఒక ప్రకటనలో చెప్పారు. పాత జిల్లాలో రానున్న దరఖాస్తుల ఆధారంగా సుమారు 30 సెంటర్స్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్టు , ఇక ఈనెల 25 వరకు రూ 500, ఈ నెల 30 వరకు రూ 2000 అపరాధ రుసుముతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చామన్నారు. సబ్జెక్ట్ మార్చుకోడానికి ఎడిట్ ఆప్షన్స్ ఈ నెల 27 వరకు ఉందన్నారు. జులై 3 నుండి అభ్యర్థులు హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని , ఇప్పటి వరకు 72,500 మంది దరఖాస్తులు చేసుకున్నారని వారిలో 24, 000 వేల మంది బాలురు, 48, 000 వేల మంది బాలికలుఉన్నారన్నారు. నిత్యం 3 సెషన్స్‌లలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మారు సోషల్ సైన్సు లో దరఖాస్తులు పెరిగి సైన్సు కోర్సుల్లో దరఖాస్తులు తక్కువయ్యాయన్నారు. మరిన్ని వివరాలకు ఓయూ వెబ్‌సైట్ చూడాలని చెప్పారు.

తలసాని శంకర్ యాదవ్‌కు నివాళులు



నవతెలంగాణ-బేగంపేట్

ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ మరణించగా మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు లు శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని శంకర్ యాదవ్ నివాసానికి చేరుకుని శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

సీఎం కాన్వాయ్‌పైకి దూసుకెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

- పలువురి నాయకులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్‌లోని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారంవెళ్లి కలిసి అనంతరం ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు. అయితే ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో పోచారం ఇంటి ముట్టడికి యత్నించారు. పోలీసులకు బాల్కసుమన్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు యత్నించగా 12 మంది బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ఐపీసీ 353,448 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు ఎమ్మెల్యే నివాసంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించడం సీఎం కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం చేయడం, పోలీసులతో వాగ్వాదానికి దిగినందున వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

అనంతరం పోలీస్ స్టేషన్‌కు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వచ్చి పోలీసులతో మాట్లాడారు. తర్వాత బీఆర్ఎస్ నాయకులను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి నాంపల్లి 3వ అదనపు మెట్రపాలిటన్ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. దాంతో నిందితులకు రిమాండ్ విధించాలని న్యాయస్థానం పి.పి వాదనలలో సరైన కారణం చూపకపోవడంతో అందరికీ కోర్టు 10 వేల వ్యక్తిగత పూచీకత్తు పై విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'నీట్' పరిష్కారానికి కిషన్ రెడ్డి చొరవ చూపాలి

- లేకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలి
- నేడు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముట్టడి
- విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి



నవతెలంగాణ-ఓయూ

నీట్ పరీక్ష సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపాలని లేకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి నాయకులు మాట్లాడుతూ. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రోజున నీట్ ఫలితాలు విడుదల చేయడం, హర్యానాలో ఒకే సెంటర్ లో 8 మందికి టాప్ ర్యాంకులు రావడం అనుమానాలు కలిగిస్తున్నాయి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాసినా చాలా మంది విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని, కేంద్రం స్పందించేలా ఒత్తిడి చేయాలని కేంద్ర భూగర్భ, గనుల శాఖమాత్యులు కిషన్ రెడ్డికి గురువారం లిఖిత పూర్వక అపాయింట్మెంట్ కోరినట్టు తెలిపారు. కానీ ఇప్పటివరకు వారి నుండి ఎటువంటి ఆహ్వానం రాలేదన్నారు. అందుకే ఉద్యమాల గడ్డ ఓయూ కేంద్రం నుంచి శనివారం ఐక్యంగా కిషన్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వారు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర అధ్యక్షులు ఆర్. ఎల్ మూర్తి, ఎ.ఐ.ఎస్.ఎఫ్.రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెల్లి సత్య, పి.డి.ఎస్.యు జాతీయ యూనివర్సిటీల కో ఆర్డినేటర్ ఎస్. నాగేశ్వరరావు, పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్, డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, ఎ.ఐ.వై.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, పి.వై.ఎల్.రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు జావిద్, హష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభం నుంచి ఆర్టీసీని ఆదుకోవాలి





- ఆర్టీసీ కార్మిక, ఉద్యోగులను ఆదుకునేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి
- ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మహమూద్, వైడీ బిన్ సుశీల్, జి.అబ్రహాం

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన పదేండ్ల కాలంలో అనుసరించిన ప్రజా రవాణా సంస్థ వ్యతిరేక విధానాలతో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి ఆర్టీసీని గట్టెక్కించాలని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు సయ్యద్ మహమూద్, వైడీ బిన్ సుశీల్, జి.అబ్రహాం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 సంవత్సరానికిగాను రాష్ట్ర బడ్జెట్‌లో తెలంగాణ ఆర్టీసీతో పాటు, కార్మికులు, ఉద్యోగులను ఆదుకునేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని వారు కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా.. గత ప్రభుత్వం నామమాత్రంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్టుగా ప్రకటించిందని.. అందుకు సంబంధించిన చర్యలను ప్రారంభించాలని వారు తెలిపారు. ఆర్టీసీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందని, అందుకుగాను ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక నిర్ణయం తీసుకొని ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించాలని వారు కోరారు. గడిచిన పదేండ్లుగా ప్రజా అవసరాలకు అనుగుణంగా ఒక్క బస్సును పెంచలేదని, వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలని తెలిపారు. 2014-2023 డిసెంబర్ వరకు కాలం చెల్లిన బస్సుల స్థానంలో.. కొత్త బస్సులను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 2013 వేతన సవరణ సందర్భంగా జారీ చేసిన అరియర్స్ బాండ్ డబ్బులను వెంటనే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్ అవుతున్న ఉద్యోగుల పీఎఫ్ ఖాతా ఫండ్‌ను.. ఆ రోజునే ఉద్యోగులకు చెల్లించటం లేదని గుర్తుచేశారు. చట్టపరంగా పీఎఫ్ సంస్థకు చెల్లించాల్సిన ఈపీఎఫ్ 95 పెన్షన్ నిధితో పాటు ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్ అయిన రోజునే వారి పీఎఫ్ ఖాతాలో డబ్బులు జమ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందని.. అందుకు సంబంధించిన రియంబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు గత మూడు దఫాలుగా చేయవలసిన వేతన సవరణను ఇంతవరకు చేయలేదని, వెంటనే ఆర్‌పీఎస్ 2017, 2021, 2024 వేతన సవరణ చర్యలను చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



ప్రభుత్వ పాఠశాలలో మేయర్ జన్మదినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి పుట్టినరోజునాడు కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

అవి స్కూల్స్ కావు... సమస్యలకు కేంద్రాలు

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

విచ్చలవిడిగా ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల నెత్తురు తాగుతున్న ప్రయివేటు పాఠశాలల ఆగడాలను అరికట్టాలని సర్కార్ బడులను బలోపేతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రభుత్వ బడుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లాలపేట లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సీపీఐ శ్రేణులతో కలిసి పార్టీ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా సర్కార్ బడులు ఉన్నాయని.. స్కూళ్లు కావు అవి సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్లో అందించే మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకమైనదని.. రుచి సుచి లేని పప్పు పెడుతున్నారని దీంతో అనేకమంది పిల్లలు పోషకాహార లోపానికి గురవుతున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం ప్రభుత్వ బడులలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఆర్ఓ వాటర్, ఏర్పాటు చేయాలని , పిల్లలకు సరిపడా తరగతి గదులను నిర్మించాలని డిమాండ్ చేశారు. సరిపడ తరగతి గదులు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు అడ్మిషన్స్ దొరక్క ప్రయివేటు వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఫీజుల పేరుతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ప్రవేట్ పాఠశాల ఆగడాలను కట్టడి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు,గౌరీ నాగరాజ్, సయ్యద్ గౌస్, హుస్సేన్, వెంకట్ గౌడ్,రవికాంత్ అంబలి శ్రీనివాస్ పాల్గొన్నారు.





యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. శుక్రవారం ప్రజాభవన్ లో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నా రెడ్డి ని ,అదేవిధంగా నోడల్ ఆఫీసర్ దివ్యను కాంట్రాక్ట్ అధ్యాపకులు కలిసి వినతిపత్రం అందజేశారు. దానికి సంబంధించి నోడల్ ఆఫీసర్ అదేవిధంగా ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రెగ్యులరేషన్‌కు సంబంధించి సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే దీనిపై మిగతా అధికారులతో కూడా చర్చించి సానుకూలంగా ఒక నిర్ణయం తీసుకొని మీకు న్యాయం చేస్తామని చెప్పినట్టు తెలిపారు. రెగ్యులరేషన్ ప్రక్రియ జరిగే లోపు బేసిక్, డీఎ, హెచ్ఆర్ఏతో కూడినటువంటి స్కేల్ తక్షణమే అమలు చేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు వినతిపత్రం ద్వారా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఓయూకు సంబంధించిన కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ వేల్పుల కుమార్ ,డాక్టర్ పల్లాటీ నరేశ్, డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ చిరంజీవి ,డాక్టర్ సత్యం, డాక్టర్ సనత్ తో పాటు అన్ని యూనివర్సిటీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.

హమాలి బస్తీలో ఇండ్లను స్థానికులకే కేటాయించాలి



- లష్కర్ సాధన సమితి కమిటీ విజ్ఞప్తి

నవతెలంగాణ- బేగంపేట్

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని హమాలీ బస్తీలో ప్రభుత్వం నిర్మించిన 60 ఇండ్లను స్థానికులకు వెంటనే కేటాంచేందుకు కృషి చేయాలని గృహ నిర్మాణం పరిరక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం లష్కర్ సాధన సమితి కమిటీకి విజ్ఞప్తి చేశారు.కమిటీ కార్యాలయం లో వారు కలిసి ఈ విషయం పై వినతి పత్రాన్ని అందిచారు. హమాలీబస్తిలో 272 ఇండ్లు నిర్మించాలని 2012 సంవత్సరం లో ప్రతపాదించగా 2014లో ఇండ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వివిధ కారణాల రీత్యా అప్పట్లో కేవలం 60 ఇండ్ల కేటాయింపు పెండింగ్‌లో పడిందని.. అప్పటి నుంచి స్థానికులు ఎన్ని సార్లు అధికారులకు మోర పెట్టుకున్నా ఎవరూ స్పందిచడం లేదని కమిటీ సభ్యులు వాపోయారు. ఈ విషయం లో స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కూడా జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 2012లో ఇండ్ల నిర్మాణం సమయంలో లబ్దిదారులు ఇండ్లను ఖాళీ చేసి కిరాయిలకు వెళ్లారని అప్పటినుంచి కిరాయిలు చెలించలేక నానా అవస్థలుపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లష్కర్ సాధన సమితి వారు చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తమకు త్వరితగా ఇండ్లు మంజూరు అయ్యేట్టు కృషి చేయాలని వారు కోరారు. ఈ విషయం లో జిల్లా కలెక్టర్, అవసరం అయితే జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొని వెళ్లి సాధ్యమైనంత తొందరలో హమాలీ బస్తీ వాసులకు ఇండ్ల కేటాయింపు పూర్తి చేస్తామని కమిటీ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు అంజయ్య, రవి, నర్సింగ్ రావు లతో పాటు లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు బాలరాజ్ యాదవ్, మిట్టపల్లి బాబురావు, జగదీశ్ గౌడ్, శైలేందర్, కష్ణ ముదిరాజ్, అశోక్ చారి లు పాల్గొన్నారు.

ఓయూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ నాన్ టీచింగ్ హెూంలో మూడు బోధనేతర సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బియాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని, నిధులు, నీళ్ళు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని, తెలంగాణ భాష, యాసకు జరుగుతున్న అగౌరవాన్ని సహించలేక తొలి, మలి దశలలో జరిగిన ఉద్యమాలలో పాల్గొని, ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను, అవసరాన్ని, సైద్ధాంతీకరించి భవిష్యత్ తరాలకు అందించిన మార్గదర్శి,మహామనిషి జయశంకర్ అని అన్నారు. తెలంగాణ ప్రజలతో జాతిపితగా పిలువబడ్డ జయశంకర్ సార్ స్ఫూర్తిని ,ఆశయాలను, ఆకాంక్షలను గుర్తు చేసుకుంటూ సామాజిక తెలంగాణ కోసం పాటు పడాలని నినదించారు. ఎన్‌జీఓఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు భీమయ్య,శంకరయ్య, రవి, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, జయ్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శివ శంకర్,అశోక్,శంకర్ నాయక్, యూసఫ్,బహమా రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్యే సతీమణి అంత్యక్రియలు

- భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు
- అల్వాల్‌లోని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న చొప్పదండి శాసనసభ్యుడి భార్య
- సతీమణి పార్థివ దేహాన్ని చూసి కన్నీళ్లు పెట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం







నవతెలంగాణ-సిటీబ్యూరో/మల్కాజిగిరి

కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి శుక్రవారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. శవ పరీక్ష పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. కుటుంబీకులు ఆమె మృతదేహాన్ని అల్వాల్‌లోని తమ నివాసానికి తరలించగా పలువురు ప్రముఖులు నివాళ్లర్పించారు. అనంతరం తిరుమలగిరిలోని డెయిరీ ఫామ్ సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా భార్య మృతి చెందిన విషయాన్ని తట్టుకోలేని సత్యం రక్తపోటు తగ్గి అనారోగ్యానికి గురయ్యారు. వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. రూపాదేవికి 12 ఏండ్ల క్రితం మేడిపల్లి సత్యంతో ప్రేమ వివాహం జరిగింది. ఆమె ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

అసలేమైందంటే...

గురువారం రాత్రి ఇంట్లో రూపాదేవి, ఆమె కుమారుడు, కుమార్తె, రూపాదేవి తల్లి ఉన్నారు. భర్త చొప్పదండి వెళ్లాడు. అయితే రూపాదేవి 10 గంటల సమయంలో తన గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. గుర్తించిన తల్లి పక్కింటి వాళ్ల సాయంతో సమీపంలో ఉన్న ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఎమ్మెల్యే విషయం తెలుసుకుని హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు.

కడుపు నొప్పి తట్టుకోలేకే..!

రూపాదేవి మృతి చెందడంతో అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసిన అల్వాల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రూపాదేవి గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోందని ఆమె కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. దాంతో కడుపు నొప్పితోనే ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు భావిస్తున్నారు.

పలువురు నివాళ్లు

రూపాదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ వారి ఇంటి వద్దకు చేరుకుని ఆమెకు నివాళ్లర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే సతీమణి అంతక్రియలకు దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ లక్ష్మణ్, కాంగ్రెస్ ప్రముఖులు, నాయకులు ఎమ్మెల్యే సత్యంను పరామర్శించారు.



జి నారాయణమ్మ కాలేజీలో యోగా డే వేడుకలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జి నారాయణమ్మ కాలేజీలో 2024 సంవత్సరం టెన్త్ ఇంటర్నేషనల్ యోగ డే ఉత్సవాలను జూన్ నెల 19 నుండి 21 వరకు నిర్వహించారు. ది ఏక్ భారత్ శ్రేష్టభారత(ఈబీఎస్‌బీ) అండ్ ఫిట్ ఇండియా క్లబ్స్ ఆఫ్ జి నారాయణమ్మ కాలేజ్ విత్ హార్ట్ ఫుల్ నెస్ యోగా సెంటర్స్ తో కలిసి యోగా ఈవెంట్స్ ను నిర్వహించారు. సుమారు 600 మంది విద్యార్థులు విద్యార్థినులు, అధ్యాపకులు ఈ యోగా ఈవెంట్స్ లో పాల్గొన్నారు. యోగా ఎక్స్పర్ట్ రవి , నీలిమ రూప, సుజాత హార్ఫుల్నెస్ యోగా సెంటర్ ప్రతినిధులు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు .ఉపాధ్యాయులకు విద్యార్థులకు యోగా, మెడిటేషన్ చేయటంలో మెలకువలు నేర్పించారు .ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె రమేష్ రెడ్డి చీఫ్ గెస్ట్ గా హాజరయ్యారు .ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎం.వి.ఎల్ సూర్యకుమారి, కన్వీనర్, డాక్టర్ పి అనురాధ(హెచ్ అండ్ ఎం డిపార్ట్మెంట్) ,డాక్టర్ ఎస్ వసుంధర, హెచ్ అండ్ ఎం డిపార్ట్మెంట్, బీ భాగేశ్వరి రత్కాల్(సీఎస్ఈ డిపార్ట్‌మెంట్) తదితరులు ఈ



వందల ఏండ్ల క్రితం భారతీయ ఋషులు కనిపెట్టిన యోగ సాధన శారీరక మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని యోగా శిక్షకురాలు సరిత అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని సెంట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్లో చిన్నారులతో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు.చిన్నారులు యోగ ఆసనాలు సూర్య నమస్కారాలు చేసి ప్రతిభను కనబరిచారు.సెంట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్లో ప్రధాన ఉపాధ్యాయులు శిరీష జాతన్,ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బంజారాహిల్స్



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

రౌడీ షీటర్‌లు గొడవలలో తల దూరుస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సివిల్ తగాదాలు ఇతర విషయాల్లో తలదురుస్తూ గొడవలకు దిగుతూ ప్రజలకు ఇబ్బందికరమైన వాతావరణం సృష్టిస్తే వారిపై తీవ్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు. సమాజ హితం కోసం పాటుపడాలని బాధ్యతాయుతంగా నడుచుకుంటూ శాంతియుత వాతావరణంకు పాటుపడాలని రౌడీ షీటర్లకు తెలిపారు.

యువతి స్నానం చేస్తుండగా వీడియో తీసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-అంబర్‌పేట

బాత్రూమ్ లో యువతి స్నానం చేస్తుండగా దొంగ చాటుగా వీడియో తీసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ లంకలో నివాసం ఉంటున్న 25 ఏండ్ల యువతి తన ఇంట్లో బాత్‌రూంలో స్నానం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన యువకుడు జెల్ ఫేస్ దొంగ చాటుగా వీడియో తీస్తున్నాడు. అది గమనించిన యువతి అతనితో గొడవపడి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పెండ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి... యువకుడుపై పోక్సో కేసు

పెండ్లి చేసుకుంటానని మోసం చేసి యువతి పై లైంగికదాడికి పాల్పడిన ప్రయివేట్ ఉద్యోగిపై కాచిగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నామాకు చెందిన యువతి లక్డికాపూల్‌లో నివాసం ఉంటున్న విశాల్(27) ప్రేమించి పెండ్లి చేసుకుంటానని నమ్మించి వేరొక అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అది కాక ప్రేమించిన యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విశాల్ పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యోగసాధన ద్వారా ఆరోగ్యం పెరుగుతుంది

- ఇఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసింది భారతదేశం మాత్రమేనని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు తెలిపారు. గచ్చిబౌలిలోని కాలేజ్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అయన మాట్లాడారు.. గత తొమ్మిదేళ్లుగా యోగా దినోత్సవాన్ని తమ కాలేజీలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది యోగ థీమ్ 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ' అన్నారు. అంటే సంఘంలోని ప్రతి వ్యక్తి యోగాసనాలు చేయడం వలన సమాజంలోని అందరి ఆరోగ్యాలు బాగా వుంటాయని, సూర్యుడికి ప్రణమిల్లుతూ చేసే ప్రతి యోగ ప్రక్రియ శరీరంలోని ప్రతి కణానికి చేరి మనిషిని ఆరోగ్యవంతుడిని చేస్తుందన్నారు. యోగా చేసేవారిలో ఎలాంటి శారీరక, మానసిక ఒత్తిడి సమస్యలుండవని, ఆధ్యాత్మికత చింతన మనిషిలో పెరుగుతుందన్నారు. మనిషి తమ ఫిట్ నెస్ పెంచుకోవడంలో యోగ బాగా ఉపయోగ పడుతుందని, మనసుకు శరీరానికి మధ్య ఉన్న సంబంధాన్ని యోగా తెలుపుతుందన్నారు. యోగాలో సుమారు 173 ప్రక్రియలున్నాయన్నారు. పూర్వ కాలంలో యోగ సాధన ద్వారా మనిషి బలంగా పుష్టిగా ఆరోగ్యంగా గొప్ప తేజస్సుతో, అనంతమైన తెలివి తేటలతో ఉండేవారని గుర్తు చేశారు. శ్వాస ద్వారా ధ్యాసను కంట్రోల్ చేసినపుడు మనిషి ఒక అద్భుతాన్ని సష్టించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా యోగాలో పాల్గొన్నవారికి సూర్యనమస్కారాలతోపాటుగా తదితర ఎన్నో రకాలైన యోగ ప్రక్రియలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ చీఫ్ ఎస్. లక్ష్మి కాంత రావు యోగ నిర్వహించిన రామ మోహన్ గారికి ధన్యవాదాలు తెలిపారు. పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, వివిధ రాష్ట్రాల నుండి ట్రైనింగ్ కోసం కాలేజీకి వచ్చిన అభ్యర్థులు,కాలేజ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఎత్నిక్ మహారాజా బ్రైడల్ స్టూడియో ప్రారంభం



నవతెలంగాన-సిటీబ్యూరో

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఎత్నిక్ మహారాజా బ్రైడల్ స్టూడియో నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో రాజ్యసభ మెంబర్ అనిల్ కుమార్ యాదవ్, టీప్రీస్ ప్రెసి డెంట్ ఫహీం ఖ్యురేశ్‌తో కలిసి ప్రారంభించారు. డిజైనర్ దుస్తులుకు ఇపుడు చాలా డిమాండ్ ఉందనీ, అకేషన్ ఏదై నా డిజైనర్ కలెక్షన్స్ ఎక్కువగా వాడుతున్నారని అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఎత్నిక్ మహారాజా స్టూడియో నిర్వహకులు రాజు, వికాస్ మాట్లాడుతూ డిజైనర్ దుస్తులు చేయడంలో చాలా అనుభవం ఉందన్నారు. తమ దగ్గర 200 వందల మంది దాకా వర్క్ చేస్తారని తెలిపారు. హైద రాబాద్‌లో చాలా పెద్ద పెద్ద బోటిక్ వాళ్ళకి తాము సప్లయ్ చేస్తామని తెలిపారు. ఒక డిజైనర్ డ్రెస్ రూ. 50,000 ఉంటే తమ దగ్గర రూ.20 వేలకే వస్తుందన్నారు. మంచి నాణ్యత, ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందన్నా రు. ఫ్యాషన్ వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో, తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉందన్నారు. కస్టమర్లు సంతృప్తిక రమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాష న్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక, గొప్ప షాపింగ్ అనుభవం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేబీ విష్ణు చేతన, సంగీత, మోహన్, తేజస్వి పాల్గొన్నారు.

28న 'ఐఐఐడీ' డిజైన్ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్, హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లతో నిర్వహించబడిన ఎక్స్‌పో ప్రత్యేకంగా ఇంటీరియ ర్ డిజైన్, ఆర్కిటెక్చర్ ప్రదర్శన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. పరిశ్రమ నిపుణులను, సామాన్యులను ఒకే వేదిక పైకి తీసుకురావాలని లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగనుంది. హైదరాబాద్ రీజినల్ చాప్టర్, దాని ప్రతిష్టాత్మక ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ 'ఐఐఐడీ' షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024 ఐదో ఎడిషన్‌ను డిజైన్ ఇంటెలిజెన్స్ థీమ్‌తో ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. ఈ ఎగ్జిబిషన్ మొదటి రోజు ఉదయం 11.00 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు. ఆర్.సరోష్ వాడి యా, జాతీయ అధ్యక్షుడు, ఐఐఐడీ గౌరవ అతిథిగా పాల్గొం టారు. సాయంత్రం జరిగే ఫెలోషిప్ సమావేశంలో జోహన్నెస్‌బర్గ్, దక్షిణాఫ్రికా, ఆర్‌కి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్ కీలక ప్రసంగం చేస్తారు. హెచ్‌ఐసీలో లోటస్ ఆర్కిటెక్ట్స్ నుంచి సిద్ధార్థ్ తల్వార్‌కు జూన్ 29న సన్మాన కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఐఐఐడీ-హెచ్‌ఆర్‌సీ డిజైన్ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్, కన్వీనర్, కోశాధికారి రాకేష్ వాసు మాట్లాడుతూ 'ఐఐఐడీ' హైదరాబాద్ చాప్టర్ డిజైన్ పరిశ్రమలో సరికొత్త పోకడలు, ఆలోచనలు, ఆవిష్కరణలను హైదరాబాద్ సోదర వర్గానికి తీసుకురావడానికి ప్రతి ఏడాదీ డిజైన్ షోకేస్ ఈవెంట్‌ను నిర్వహిస్తుంది. ఇది స్మార్ట్ పరికరాల నుండి టర్న్‌కీ సొల్యూషన్‌ల వరకు ప్రతి ఎలిమెంట్‌ను అందించే ప్రతి నిలువుని కవర్ చేసే సమగ్ర ఫోరమ్. ఒకవైపు సామాన్యుల ఆకాంక్షలను నిర్వచిస్తూనే మరోవైపు మా ప్రభుత్వ శాఖల రూపకల్పన పరిష్కారాలలో సహాయం చేయడంలో మేం ముందుండాలనుకుంటున్నాం' అని తెలిపారు.



రాజ్యాంగం కల్పించిన హక్కులకు అనుగుణంగా వాటా ఇవ్వాలి

- తెలంగాణ సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ నాయక్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎస్సీ,ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకా రం జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని తెలంగాణ సేవా లాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ నాయక్ డిమాం డ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర స్థాయి విస్తృత సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు సైదా నాయక్ హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు ఎంత జనాభా ఉంటే అంత శాతం రిజర్వేషన్ కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచి ఉందన్నారు. రిజర్వేషన్ల అమలుపై సుప్రీంకోర్టు ఒకలాగా హైకోర్టు మరోలా తీర్పు ఇస్తుందన్నారు. బీహార్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 60 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లతో 70% రిజర్వేషన్లు అమలవుతున్నా యన్నారు. సుప్రీంకోర్టులో కొట్టేసిన జీవో నెంబర్ 3ను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఏజెన్సీ ప్రాంతంలో 100% ఉద్యోగ నియామకాలకు, మరో జీవో అమలు చేయాల న్నారు. జీవో నెంబర్ 33 ద్వారా గిరిజనులకు అందాల్సిన టువంటి 10 శాతం రిజర్వేషన్‌పై అది అమలు కాకుండా కోర్టులో కేసులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న నాయక్, భాస్కర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ హసేన్ నాయక్, ముషీరాబాద్ కన్వీనర్ కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని ఇచ్చే ఒకేషనల్ కోర్సులు..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి బజార్‌ఘాట్‌లో గల గవర్నమెంట్ ఒకేషనల్ కాలేజీలో 2 సంవత్సరాల వ్యవధి గల ఎలక్ట్రికల్ టెక్నిషి యన్, ఆటోమొబైల్ టెక్నిషియన్ ఎలక్ట్రానిక్స్ టెక్నిషియన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్స్ జరుగుతున్నాయని బజార్‌ఘాట్ ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ కే.ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎలక్ట్రికల్ టెక్నిషియన్ కోర్సు పూర్తి చేసిన వారికి గవర్నమెంట్ ఎలక్ట్రికల్ వంటి డిపార్టుమెంట్‌లో జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగం పొందడానికి అవకాశం ఉందన్నారు. ఒకేషనల్ కోర్సులు చదువుతున్న సమయంలో ఆయా కోర్సులకు సంబంధించిన పరిశ్రమలు, ఎల్‌జీ, టాటా మోటర్స్ లాంటి సంస్థల యందు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి అప్రెంటిస్ చేస్తూ సైపండ్ పొందే అవకాశం ఉందన్నారు. తమ కళాశాలలో వివిధ ఒకేషనల్ కోర్సులలో అడ్మిషన్ పొందడానికి 10వ తరగతి పాసై ఉండాలన్నారు. మిగతా వివరాల కొరకు గవర్నమెంట్ ఒకేషనల్ కాలేజీలో సంప్రదించగలరని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి
- డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో యోగా దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాల యంలో శుక్రవారం ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకన్య ఆరోగ్య సిబ్బందితో యోగా సరం చేయించారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్ఓ చాలా ఆరోగ్య సమస్యలకు యోగా చక్కని పరిష్కారాలు చూపి స్తుందన్నారు. ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటే ఆనందంగా జీవించవచ్చున్నారు. ప్రతిరోజూ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సాయంత్రం 5 గంటల నుంచి 5.30 వరకు యోగా కార్యక్రమం నిర్వహిస్తామని, సిబ్బంది, అధికారులు స్వచ్ఛందంగా ఈ కార్యక్ర మంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెమో రాములు, ఎస్ఓ ఆనంద్, శ్రీనివాస రావు, నిరంజన్, డాక్టర్ శ్రీలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉస్మానియా ఆస్పత్రుల్లో నెలకొల్పిన వివిధ ప్రారంభోత్సవాలకు వచ్చిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు స్వాగతం పలికిన వైద్య భూషణ్ అవార్డు గ్రహీత మాణిక్ రావు తదితరులు నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

12

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్

శనివారం | జూన్ 22, 2024 | www.navatelangana.com



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎంబి. కృష్ణయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఉద్యోగుల సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

సింగరేణి పరిరక్షణకు ఆందోళనకు సిద్ధం కండి

- సింగరేణి కార్మిక వర్గానికి పిలుపు
- ఐఎఫ్‌టీయు జాతీయ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్



నవతెలంగాణ - ముషీరాబాద్

సింగరేణి తో సహా కోల్ ఇండియా పరిరక్షణకు సిద్ధం కావాలని గని కార్మిక వర్గానికి ఐఎఫ్‌టీయు జాతీయ అధ్యక్షులు, గోదావరి లోయ బొగ్గుని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులైన సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ తరపున విడుదల చేసిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 60 బ్లాకులను ప్రైవేటుకరించడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని అందులో భాగంగానే సింగరేణిలో నాలుగు బ్లాకులను కల్యాణిగని, కోయగూడెం, సత్తుపల్లి, బ్రాహ్మణపల్లి తదితర బ్లాకులను ప్రైవేటీకరించడానికి పాలకులు పూనుకున్నారని పేర్కొన్నారు. 2014లో తొలిసారి ప్రభుత్వ అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ స్వదేశీ విదేశీ బడా కార్పొరేట్ శక్తులకు ముఖ్యంగా మన దేశ ఆదానీ, అంబానీ బడా పెట్టుబడి శక్తులకు బొగ్గు గనులను అప్పగించడానికి 2015లో నూతన మైనింగ్ పాలసీ తెచ్చిందని, అందులో భాగంగా సింగరేణి తో సహా కోల్ ఇండియాలో 500 బ్లాకులు ప్రైవేటుకరించడానికి విధానాల రూపకల్పన చేశారన్నారు. గత మూడు నాలుగు రోజులుగా మన రాష్ట్రంలో ప్రచార ప్రసార మాధ్యమాలలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఆరోపణలు ప్రతి ఆరోపణలు చేసుకుంటున్నారని ఇది అసలు విషయాన్ని మరుగునపరిచే ఎత్తుగడ తప్ప వేరు కాదన్నారు. ఆ పార్టీలకు నిజాయితీ, చిత్తశుద్ధి ఉండి ఉంటే వాళ్ల ఆరోపణలు ప్రతి ఆరోపణలలో ఏమైనా వాస్తవం ఉండి ఉంటే సింగరేణి సంస్థ ప్రైవేటీకరణకు తమ విధానాలే కారణమని అంగీకరించాల్సి ఉంటుందన్నారు. పాలక వర్గ పార్టీలు ఆడుతున్న నాటకాన్ని అర్థం చేసుకొని సింగరేణి కార్మిక వర్గం ఐక్యంగా సంఘటితంగా సంస్థ పరిరక్షణ కోసం ఆందోళనకి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ 2019-20 మధ్య కాలంలో పార్లమెంటు చేత ఆమోదింపబడ్డ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను తక్షణమే రద్దు చేయుటకు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఒక తీర్మానాన్ని చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దుకు భవిష్యత్తు ఆందోళన కార్యచరణను రూపొందించుకోవడానికి జూన్ 23న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవో నెంబర్ 5ను జారీ చేసిందనీ తక్షణమే ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు జి.అనురాధ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శివ బాబు, జిల్లా నాయకులు యాదయ్య, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలపై వేధింపులను ఆపాలి

- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- రాష్ట్ర ఆరోగ్య మిత్రల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆరోగ్య మిత్రలపై వేధింపులను ఆపాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని రాష్ట్ర ఆరోగ్య మిత్రల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆరోగ్య మిత్రుల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యమిత్రల డాటా ప్రాసెసింగ్ క్యాడర్ పై ఎన్నిమార్లు వినతి పత్రాలు ఇచ్చినా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. గత ప్రభుత్వాల నుండి కూడా ఈ కార్యాచరణ కొనసాగుతుందని, నేడు రేవంత్ రెడ్డి పాలనలో కూడా ఇచ్చిన హామీ ప్రకారం చీఫ్ సెక్రటేరియట్‌కు, ఆరోగ్య శాఖ మంత్రితో విన్నవించిన కూడా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలను పెంచాలని, ఆరోగ్యం మిత్రులపై వేధింపులను అపాలన్నారు. ఆరోగ్య మిత్రులకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన రూ.35వేలతో పాటు టీఏడీఏ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 16 సంవత్సరాల నుండి పీహెచ్సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రులను తిరిగి పీహెచ్సీలో నియమించాలన్నారు. ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నుండి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించి, ఉద్యోగులందరికి హెల్త్ కార్డ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆరోగ్య మిత్రలపై ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి పక్కకు తప్పుకోవాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహించడంలో పూర్తి స్థాయిలో విఫలమైందని కేంద్ర విద్యా శాఖ మంత్రి పక్కకు తప్పుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నీట్ పరీక్ష విధానంపై శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలలోనే వైద్య, విద్యకు భారతదేశంలో ప్రత్యేకమైనటువంటి గుర్తింపు ఉందన్నారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్ట కాపాడాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని గుర్తు చేశారు. నీట్ పరీక్ష నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వం వహించాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేసి నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు నీట్ పై అనేక ఉద్యమాలు జరుగుతున్న ప్రధాన మంత్రి కేంద్ర మంత్రులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నీట్ నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సర్క్యులర్ ఇచ్చినా.. ఆగని దోపిడీ..!

- యథేచ్ఛగా స్కూళ్లలో పుస్తకాల నుంచి యూనిఫామ్స్ దాకా విక్రయం
- రూల్స్‌కు తూట్లు పొడుస్తూ.. స్కూళ్లను కిరాణా షాపులుగా మార్చేస్తున్న వైనం..!
- మార్కెట్ కంటే రెండింతలు ధరలతో కోట్ల రూపాయల దోపిడీ
- అడ్డగోలు ధరలకు హడలిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- కరువైన విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ



ఆ పాఠశాలలో పుస్తకాల గదిని సీజ్ చేశారు.



శ్రీచైతన్య పాఠశాలల ఘటనే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా అక్రమంగా పుస్తకాలు, యూనిఫామ్స్ తదితర వస్తువులు అమ్ముకుంటూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన విద్యాసంవత్సరం ప్రారంభం అయింది. విద్యార్థులు బడిబాట పట్టారు. మరోవైపు ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు తమ దోపిడీకి తెరలేపాయి. టెక్నో, సీబీఎస్, ఐసీఎస్ఈ.. ఇలా రకరకాల పేర్లతో పుట్టగొడుల్లాగా పుట్టుకొస్తున్నా ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లు.. ఒకవైపు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి. మరోవైపు పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, టై, బెల్టు, విక్రయిస్తూ పాఠశాలలను కిరాణా షాపులుగా మార్చి దోచుకుంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా తమ పాఠశాలలోనే పుస్తకాలను కొనుగోలు చేయాలని యాజమాన్యాలు ఒత్తిడి తేవడం గమనార్హం. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, అమ్యామ్యల మత్తులో నగర పరిధిలో ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్ట్ యథేచ్ఛగా అమ్ముకుంటున్నాయి. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నాతో.. మండల విద్యాశాఖ అధికారి సుమన్ ఆ పాఠశాలలో పుస్తకాల గదిని సీజ్ చేశారు.

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 1953 ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో 8.40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 776 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,05,281 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా సరఫరా చేస్తుండగా.. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు మాత్రం తమకు ఇష్టమైన ధరలకు అమ్ముకుంటున్నారు. బయట మార్కెట్‌లో దొరికే వస్తువుల ధరలకు ప్రయివేట్ పాఠశాలల్లో లభించే వాటికి బోలెడు వ్యత్యాసం ఉంటుంది. నర్సరీ నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు, దుస్తులు, టైలు, గుర్తింపు కార్డులు, బ్యాగులు, పెన్నులు, కవర్లు, పెన్సిళ్లు ఇలా అన్ని రకాల వస్తుసామాగ్రికి రూ. 6వేల నుంచి 18వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు ధరల్లో వేలల్లో వ్యత్యాసం ఉంటుంది. అంతేగాక ఈ పాఠశాలల్లో విక్రయించే పాఠ్యపుస్తకాలు మార్కెట్‌లో ఎక్కడా దొరక్కుండా జాగ్రత్త తీసుకుంటున్నారు. తమ వద్ద అన్ని కొనుగోలు చేస్తేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని మెలిక పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తుండడం గమనార్హం.

బదిలీలు, పదోన్నతుల బిజిలో విద్యాశాఖ

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి స్టేట్ లేదా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పేరుతో నడిచే అన్ని రకాల పాఠశాలల్లోనూ పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయాలు చేయవద్దని హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి మే 30న ఒక సర్క్యులర్ జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోనూ అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసి.. ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఈ అమ్మకాలు జరగకుండా చూడాలని కోరారు. ఆయా స్కూళ్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని చెప్పారు. ఆ మేరకు మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు ఆదేశాల ప్రకారం.. పాఠశాల కౌంటర్‌లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు ఏవైనా ఉంటే లాభాపేక్ష లేకుండా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉల్లంఘనలు జరిపితే తమ దృష్టికి తీసుకురావాని డీఈవో సూచించారు. కానీ గడిచిన 20 రోజులుగా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో బిజీబిజీగా ఉండటంతో మండల విద్యాధికారుల పర్యవేక్షణ, నిఘా లేకుండాపోయింది. ఇదికాస్త ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు కలిసొచ్చింది. డీఈవో ఇచ్చిన సర్క్యులర్‌ను బేఖాతరు చేస్తూ.. అడ్డగోలు ధరలకు పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నాయి. మరోవైపు ఫిర్యాదు చేస్తే తప్ప.. మండల విద్యాధికారులు కదిలే పరిస్థితి కనిపించడంలేదు. హిమయత్‌నగర్ శ్రీచైతన్య పాఠశాలల ఘటనే ఇందుకు నిదర్శనం.

శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కె. అశోక్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి

ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్లో బుక్స్, యూనిఫామ్స్ అమ్మవద్దని హైదరాబాద్ జిల్లా డీఈవో స్పష్టమైన ఆదేశాలిచ్చిన.. శ్రీచైతన్య స్కూల్లో పుస్తకాలు, యూనిఫాంలు విక్రయించడం నిబంధనల ఉల్లంఘనే. ఎల్‌కేజీకి రూ.9వేలు, యూకేజీకి రూ.12వేలకు చొప్పున పుస్తకాలు, ఇతర స్టేషనరీ అమ్ముకుంటూ తల్లిదండ్రులను దోపిడీ చేయడం దారుణం. నిబంధనలు ఉల్లంఘించిన హిమయత్‌నగర్ శ్రీ చైతన్య స్కూల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. జిల్లాలో మండల విద్యాధికారుల పర్యవేక్షణ పెంచాలి.

బోనాల ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి

- సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న అధికారులను ఆదేశించారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో శుక్రవారం జోనల్ కమిషనర్ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య, మాజీ అధ్యక్షులు రాకేష్ తివారి, కమిటీ ప్రతినిధులు, అన్ని విభాగాలు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఉమ్మడి దేవాలయాల కమిటీ సభ్యులు, అధికారులతో ఆరా తీసి.. చేపట్టాల్సిన ఏర్పాట్లను జోనల్ కమిషనర్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జులై 7 నుంచి ప్రారంభం కానున్న ఆషాడ మాసం బోనాల ఉత్సవాలకు సమస్యలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహించే బోనాల పండగ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన పనులపై చర్యలు తీసుకుంటామ న్నారు. ప్రధాన ఆలయాలు, బోనాలు సమర్పించే దేవాల యాల వద్ద ప్యాచ్ వర్క్, వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఘట్టాల ఊరేగింపు కొనసాగే ప్రాంతాల్లో భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మలక్ పేట్, చాంద్రాయణ గుట్ట, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డీప్యూటీ కమిషనర్లు జయంత్, సురేందర్, శ్రీనివాస్ రెడ్డి రవికుమార్ , ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, యూబీడీ డీప్యూటీ డైరెక్టర్ అమ్మినా బీ, వెటర్నరీ డీప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ లు నరేందర్ గౌడ్, హరి కిషోర్, పీర్ సింగ్, ప్రకాశం, ఏకాంబ రం, జలమండలి జీఎం సుబ్బారాయుడు, డీజీఎంలు నాగ రాజు, విద్యాసాగర్, సురేష్ కుమార్, డిఈలు, ఎలక్ట్రికల్ విభాగమ అధికారులు, ఆరోగ్యం పారిశుద్ధ్యం విభాగం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోఠి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రికి తీవ్రమైన కడుపు నొప్పితో ఖైరతాబాద్ చెందిన లావణ్య (27) వచ్చింది. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. సివిల్ సర్జన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, అన్ని స్థితిషియవిభాగాధిపతి శేష్ కుమార్ ఆధ్వర్యంలో జనరల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ రోగికి ఆపరేషన్ చేసి పిత్తాశయం 2 రాళ్ళను తొలగించారు. ఆపరేషన్ విజయ వంతంగా నిర్వహించిన వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ అభినందించారు. ఈ శాస్త్ర చికిత్స సుమారు రూ.2లక్షల విలువచేసే ఆపరేషన్‌ను వైద్యులు ఉచితంగా నిర్వహించడం పట్ల రోగి బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ మోటర్ అవార్డుకు ఎంపికైన బలరాం వెంకటేష్ ప్రసాద్



నవతెలంగాణ-అంబర్‌పేట

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వం వికాస తరగతుల అనే అంశంపై నిర్వహించిన పోటీలో ఎల్బీనగర్ డీసీపీ ఆఫీసులో పనిచేస్తున్న బలరాం వెంకటేష్ ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని పోలీసులకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని భవిష్యత్తులో మరిన్ని అవార్డులు తీసుకునే విధంగా పనిచేస్తానని తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం



సుల్తాన్‌బజార్‌లో..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వీటిపై అవగాహన పెంచుకోవడం కోసమే ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సాధన, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ మిజరత్, డాక్టర్ సుప్రజా, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, నర్సింగ్ సూపరెండెంట్ రజియా, హెడ్ నర్స్ పాలిన, సహెదా, నర్సింగ్ ఆఫీసర్స్ నాగలక్ష్మి, జయలీల, అర్చనా, విశిష్ట, శైలజ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రిన్, ఎంపి హెచ్ డబ్ల్యు (ఎఫ్) జోష్ణ ఆస్పత్రి సిబ్బంది తదితరులు

ఆర్ఎఫ్‌టీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా ఆర్ఎఫ్‌టీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న కింగ్ కోఠి క్లస్టర్ డీప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ నర్సు బాయి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు

మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్,ఏఎన్ఎంలు ,ఆశ వర్కర్లు తదితరులు



న్యూ పారామౌంట్ స్కూల్‌లో యోగా

న్యూ పారామౌంట్ స్కూల్‌లో యోగా

నవతెలంగాణ-ధూల్‌పేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అగాపురాలోని పారామౌంట్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం యోగా చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి.పద్మావతి మాట్లాడుతూ... విద్యార్థి దశలో నుండి యోగా చేయడం ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. శారీరక, ఆరోగ్య ఏకాగ్రతను పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ మని, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ బాయ్స్ టౌన్ స్కూల్‌లో..

సెయింట్ బాయ్స్ టౌన్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాలో పాల్గొన్నారు.

ప్రభుత్వ షాహినాత్ గంజ్ ఉన్నత పాఠశాలలో..

జుమ్మెరత్ బజార్ లోని షాహినాత్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఉపాధ్యాయుల యోగా చేయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సీతారామ శాస్త్రి మాట్లాడుతూ.. యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు.

ఎస్పీనగర్ లోని

ఆరోగ్యానికి యోగా శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందిస్తుందని పురానాపూల్ ఎస్పీనగర్‌లోని అఫ్జల్ గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో యోగా అభ్యసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. శ్వాసపై ధ్యాస ముఖ్యమని చెప్పారు.



సెయింట్ బాయ్స్ టౌన్ స్కూల్‌లో..



అంబర్‌పేటలో..

యోగా అభ్యసనాలు పి.ఈ.టి. నక్క శ్రీనివాస్ చేయించారు. సీనియర్ ఉపాధ్యాయులు డాక్టర్.ఎస్. విజయ భాస్కర్, జ్యోతి, ప్రద్యుమ్న రెడ్డి, డాక్టర్ సురేష్ కుమార్, కౌసర్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో యోగా వేడుకల్లో హాజరైన విద్యార్థులు



సుల్తాన్‌బజార్

విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో రాణించాలి


- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యార్థులు విద్యలో ఆశించిన స్థాయిలో మెరుగుపరచుకొని ప్రతి విద్యార్థి అత్యుత్తమ స్థాయిలో తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని లకోటియా గవర్నమెంట్ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్ సీపీఎల్, అంబర్‌పేటలో 2024 పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శాలువాతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాలు విద్యార్థులు కష్టపడి చదివతే భవిష్యత్తులో వారి స్వతగా చదువుకుంటారని చెడు మార్గంలో నడవకుండా మంచి మార్గంలో నడిచి ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడవాలని విద్యార్థులకు నిరంతరం వ్యక్తిగతంగా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, హెచ్ఎమ్ సుశీలమ్మ , ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు.

భార్య నుండి భర్త, భర్త నుండి భార్య ప్రేమా, అప్యాయతలు కోరుకోవడం చాలా సహజం. వారి మధ్య బంధం ఏర్పడి ఎన్నేండ్లయినా సరే ఒకరితో ఒకరు ప్రేమగా మాట్లాడుకోవడం చాలా అవసరం. అప్పుడే వారి మధ్య బంధం మరింత బలపడుతుంది. అయితే కొన్ని సార్లు ఇంత చిన్న కోరికల కోసం వీరు ఈ వయసులో గొడవ పడుతున్నారా? అనిపిస్తుంది. కానీ ఆ చిన్న కోర్కెలే తీరనపుడు మనసు ఆవేదన చెందుతుంది. జీవితం విరక్తిగా అనిపిస్తుంది. ఇలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో చదవండీ...



న్యాయమైన కోరికలు

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అంజలికి 42 ఏండ్లు ఉంటాయి. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఆమెకు పెండ్లయి ఇరవై ఏండ్లు దాటింది. ఆమెకూ తన భర్త వంశీకి మధ్య 12 ఏండ్ల తేడా వుంది. పెద్దలు కుదిర్చిన వివాహం. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం వాళ్ళు డిగ్రీ చేస్తున్నారు. అంజలి ఎప్పుడూ జాలీగా, సరదాగా ఉండాలి అనుకుంటుంది. జీవితం ఎప్పుడు ఎలా మారిపోతుందో తెలియదు. ఈ రోజు ఉన్నట్టుగా రేపు ఉండదు. కనుక చిన్న చిన్న విషయాల్లోనే ఆనందం వెదుక్కోవాలి అనుకుంటుంది. కానీ వంశీ అలా కాదు. సరదాగా మాట్లాడడం రాదు. అంతెందుకు రోజు మొత్తంలో కనీసం ఆమెతో ఐదు నిమిషాలు కూడా సరిగ్గా మాట్లాడడు. ఇంట్లో ఉన్న రోజుల్లో కూడా టీవీ చూస్తూనో, ఫోన్ చూస్తూనో గడిపేస్తాడు. అంతే తప్ప అంజలి కోసం సమయం కేటాయించడు.

భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ లేకపోతే ఎలా అనేది అంజలి ఆవేదన. పెండ్లయిన కొత్తలో అయితే అంతా కొత్త కాబట్టి మాట్లాడటానికి ఇబ్బంది అనుకోవచ్చు. కానీ వీరి పెండ్లయి చాలా ఏండ్లు గడుస్తోంది. పిల్లలు కూడా పెద్దవాళ్ళయ్యారు. అసలు వంశీ ఆలోచనలు ఏమిటో ఆమెకు అర్థం కావడం లేదు.

తను ఎటూ మాట్లాడడు కాబట్టి అంజలినే చొరవ తీసుకొని మాట్లాడించడానికి ప్రయత్నించినా విసుక్కుంటాడు. ఇలా భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ లేకపోతే ఎలా అనేది అంజలి ఆవేదన. పెండ్లయిన కొత్తలో అయితే అంతా కొత్త కాబట్టి మాట్లాడటానికి ఇబ్బంది అనుకోవచ్చు. కానీ వీరి పెండ్లయి చాలా ఏండ్లు గడుస్తోంది. పిల్లలు కూడా పెద్దవాళ్ళయ్యారు. అసలు వంశీ ఆలోచనలు ఏమిటో ఆమెకు అర్థం కావడం లేదు.

అతనికి జీతం ఎంత వస్తుంది, ఏమైనా అప్పులు ఉన్నాయా? ఏమైనా పొదుపు చేస్తున్నాడా? ఇవేవీ ఆమెకు తెలీదు. సరదాగా ఎక్కడికైనా బయటకు వెళదామన్నా రాడు. ఇంట్లో పెద్దవాళ్ళు, పక్కన బంధువులు ఉన్నారు. దాంతో మాట్లాడటానికి ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి అలా బయటకు వెళ్లినపుడో, పండగలకు, ఫంక్షన్లకు అందరూ కలిసినపుడైనా మాట్లాడతాడా అంటే అప్పుడు కూడా చాలా సీరియస్‌గా ఉంటాడు. ఏదైనా సమస్య ఉంటే అదైనా చెప్తాడా అంటే అదీ లేదు.

ఎప్పుడైనా ఆమె పలకరించడానికి ప్రయత్నిస్తే కసురుకోవడం, తిట్టడం తప్ప అతని నోటి నుండి వేరే మాటలు ఏమీ రావు. ఎప్పుడైనా మెసేజ్ పెట్టినా రిప్లయ్ ఇవ్వడు. ఫోన్ చేస్తే 'ఇంటికి వస్తున్నా' అని వెంటనే కట్ చేసేస్తాడు. అలాంటి వ్యక్తిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అంజలీ తనలో తానే మదనపడుతోంది. ఒకవేళ ఇద్దరి మధ్య ఉన్న ఏజ్ గ్యాప్ వల్ల పరిస్థితి ఇలా ఉందా అనే అనుమానం కూడా వచ్చింది. కనీసం పిల్లల భవిష్యత్ గురించి అయినా మాట్లాడుకోవాలి కదా అని ఆమె దిగులు. ఎలాగైనా తన భర్తతో మాట్లాడి అసలు తన సమస్య ఏంటో తెలిసుకోమంటూ మా దగ్గరకు వచ్చి ప్రాధేయపడింది.

మేము వెంటనే వంశీని పిలిపించి మాట్లాడితే 'టైం ఎవ్వడం అంటే ఏమిటీ? ఒకరిని ఒకరు చూసుకోవడమేనా? ఇదేమీ సినిమా కాదు కదా! జీవితం సినిమాల్లో చూపించినట్టు ఉంటుందా? ఆమెకు ఏదైనా అవసరం ఉంటే చెప్పమనండి, వెంటనే తెచ్చిపెడతాను. తాను ఎక్కడికైనా వెళతానంటే నేను ఎప్పుడూ ఎందుకు అని ప్రశ్నించలేదు, అడ్డుచెప్పలేదు. అదే వేరే వాళ్ళయితే ఇలా ఒప్పుకుంటారా? తనని ఎప్పుడూ నేను ఇబ్బంది పెట్టలేదు. మా ఇంట్లో మాతోపాటు మా అమ్మ కూడా ఉంటుంది. చుట్టుపక్కల బంధువులు ఉంటారు. వాళ్ళ పిల్లలు కూడా మా ఇంటికి ఎప్పుడూ వస్తూ ఉంటారు. అందరి ముందు నేను అంజలితో ఏం మాట్లాడాలి? నాకు ఇది కావాలి అని అడక్క ముందే ఆమె నాకు అన్నీ చేసి పెడుతుంది. ఉదయం నేను స్నానం చేసి వచ్చేలోపు టిఫిన్ చేసి పెడుతుంది. ఇక నాకు ఆమెను పిలవడానికి అవకాశం ఎక్కడుంది. మా ఇంట్లో వారి ఆలోచనలు పాతకాలంలా ఉంటాయి. నేను తనతో కలిసి టీవీ చూసినా మా బంధువులు ఎగతాళి చేస్తారు. వారు చేయకపోయినా పిల్లలు ఎప్పుడు మా ఇంట్లోనే వుంటారు. వాళ్ళు ఎప్పుడూ మేము ఏం చేస్తున్నామో గమనిస్తుంటారు. కాబట్టి నేను అంజలితో మాట్లాడడం చాలా తక్కువ. మేము బయటకు వెళ్ళినపుడు మాత్రం మాట్లాడుకుంటాం. కానీ మేము ఇద్దరం కలిసి బయటకు వెళ్ళటం చాలా తక్కువ. నాకు ఇంట్లో ఉంటే నేను పుట్టి పెరిగిన వాతావరణం కారణంగా అంజలితో సరదాగా ఉండలేను. కానీ నాకు కూడా ఆమెతో సరదాగా మాట్లాడాలని ఉంటుంది. బయటకు చెబితే తను ఎలా ఫీల్ అవుతుందో అని చెప్పలేదు' అని అన్నాడు.

మా ఇంట్లో వారి ఆలోచనలు పాతకాలంలా ఉంటాయి. నేను తనతో కలిసి టీవీ చూసినా మా బంధువులు ఎగతాళి చేస్తారు. వారు చేయకపోయినా పిల్లలు ఎప్పుడు మా ఇంట్లోనే వుంటారు. వాళ్లు ఎప్పుడూ మేము ఏం చేస్తున్నామో గమనిస్తుంటారు. కాబట్టి నేను అంజలితో మాట్లాడడం చాలా తక్కువ.

'అంజలి మీతో తన మనసులో విషయాలు చెప్పాలనుకుంటుంది. పిల్లల చదువు, భవిష్యత్ గురించి మాట్లాడాలనుకుంటుంది. ఇదేం తప్పు కాదుకదా? అంజలివి చిన్న చిన్న కోరికలే. ఆమె కోసం కాస్త సమయం కేటాయిస్తే సరిపోతుంది. వాళ్లేమనుకుంటారో, వీళ్లేమనుకుంటారో అని మీ భార్యను దూరం పెడుతున్నారు. ఇంటి పనిలో తనకు సహాయం చేయండి. మీ ఇద్దరి మధ్య ఉన్న దూరం తగ్గుతుంది. ఇక పోతే మీ బంధువులు, వారి పిల్లలు గమనిస్తారు అంటున్నారు. భార్యాభర్తలంటే ఎంత అన్యోన్యంగా కలిసి మాట్లాడుకోవాలో, పనులు చేసుకోవాలో మిమ్మల్ని చూసి వాళ్ళ నేర్చుకుంటారు. ఇందులో తప్పేమీ లేదు. పిల్లలకు అన్నీ నేర్పించాల్సింది తల్లిదండ్రులే. ఇప్పటికైతే మీరు అంజలికి కాస్త సమయం కేటాయించండి. అన్ని విషయాలు ఆమెతో చర్చించండి. ఆమె అభిప్రాయాలు కూడా తీసుకోండి. మీ పిల్లల భవిష్యత్ వారి చదువు, పెండ్లి వంటి విషయాల్లో మీరిద్దరు కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. మీరు తీసుకునే నిర్ణయమే వారి భవిష్యత్‌కు బంగారు బాట వేస్తుంది" అని చెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి
9948794051

ఇలా తెలుసుకోండి..

మార్కెట్లో కల్తీ రాజ్యమేలుతోంది. వ్యాపారులు అత్యాశతో ప్రతీ వస్తువును కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిత్యవసరమైన నూనెనూ కల్తీ చేస్తున్నారు కేటుగాళ్లు. ఇలాంటి కల్తీ నూనె తీసుకోవడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హృద్రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. మరి కల్తీ నూనెను ఎలా గుర్తించాలో ఇప్పుడు తెలుసుకుందాం..



- ఆలివ్ నూనె బంగారు ఆకుపచ్చ, పొద్దుతిరుగుడు నూనె లేత పసుపు రంగులో ఉంటాయి. స్వచ్ఛమైన నూనెలు సహజమైన రుచిని కలిగి ఉంటాయి. కల్తీ నూనె రంగులో కూడా మార్పు గమనించవచ్చు. రంగులో ఏదైనా తేడా కనిపిస్తే కల్తీ నూనె అని అర్థం చేసుకోవాలి.
- మీరు ఉపయోగిస్తున్న నూనె నాణ్యమైందో కాదో తెలుసుకోవాలంటే.. ముందుగా గిన్నెలో కొంచెం నూనె పోసి ఫ్రీజర్‌లో ఉంచాలి. ఒకవేళ మీరు వాడుతున్న నూనె స్వచ్ఛమైనదైతే.. అది గడ్డగా మారుతుంది. లేదంటే.. ద్రవ రూపంలోనే ఉంటుంది. 30 నిమిషాల్లోగా గడ్డ కడితే అది నాణ్యమైన నూనె అని అర్థం.
- ఒక తెల్ల కాగితాన్ని తీసుకొని కొద్దిగా నూనె రాసి ఆరబెట్టాలి. నూనె స్వచ్ఛంగా ఉంటే, అది వృత్తంలా వ్యాపిస్తుంది. నకిలీ నూనె అయితే, అది ప్రవహిస్తుంది దీని బట్టి మీరు వాడేది నకిలీ నూనెనా.? అసలైందా.? అర్థం చేసుకోవచ్చు.
- ఇక మీరు ఉపయోగిస్తున్న కొబ్బరి నూనె స్వచ్ఛమైందో కాదో తెలుసుకోవడానికి కూడా ఒక ట్రిక్ ఉంది. ఇందుకోసం ఒక గిన్నెలో కొంచెం కొబ్బరి నూనెను తీసుకుని 60 నుంచి 90 నిమిషాల పాటు ఫ్రీజర్‌లో ఉంచండి. మంచి స్వచ్ఛమైన నూనె అయితే చిక్కగా ఉంటుంది. కల్తీ అయితే పైభాగం మాత్రమే ఘనంగానూ, కింది భాగం ద్రవ రూపంలోనే ఉంటుంది.

కేంద్రమంత్రికి నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు.

కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించాలి: సీతారాం ఏచూరి

విద్యా వ్యవస్థలో ఈ రకమైన వాణిజ్య ధోరణులు సరికాదని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఈ అక్రమాలతో కోట్లాది మంది విద్యార్థుల జీవితాలు బలవుతున్నాయని తెలిపారు. దేశ భవిష్యత్‌కు కీలకమైన యువత భవితకు భరోసా లేకుండా పోయిందని అన్నారు. నీట్ అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో అక్రమాలతో పాటు యూజీసీ నెట్ పరీక్షల రద్దు వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజ్ సుస్పష్టమని, వీటిని బహిరంగంగా విక్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో

న్యూఢిల్లీ : నీట్ పరీక్ష వివాదాల సుడిగుండంలో చిక్కుకున్న నేపథ్యంలో జులై 6 నుంచి ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేయడానికి సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇదేమీ 'తెరిచి, మూసివేసేది కాదు' అని వ్యాఖ్యానించింది. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు జరిగినట్టు తీవ్ర స్థాయిలో ఆరోపణలు రావడంతో మొత్తంగా పరీక్షను రద్దు చేయాలని కోరుతున్న పిటిషన్‌పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), కేంద్రానికి, ఇతరులకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఈ వివాదంపై పెండింగ్‌లో వున్న ఇతర పిటిషన్లతో కలిపి దీనిపై కూడా జులై 8న విచారణకు నిర్ణయించింది. 8న సుప్రీం కోర్టు ఈ పిటిషన్లన్నింటినీ విచారిస్తున్నందున, రెండు రోజుల పాటు కౌన్సెలింగ్‌కు విరామం ఇవ్వాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టును కోరారు. మొత్తంగా కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని మేం కోరడం లేదు. కేవలం రెండు రోజులు వాయిదా వేయాలని మాత్రమే కోరుతున్నాం. ప్రధాన అంశంపై 8న విచారణ జరుగుతున్నందునే ఈ అభ్యర్థన చేశామని న్యాయవాది వివరించారు. దానిపై బెంచ్ జోక్యం చేసుకుంటూ కౌన్సెలింగ్ అంటే తెరిచి, మూసివేసేది కాదు, ఇదొక సుదీర్ఘ క్రమం. ఆ క్రమం 6న ప్రారంభమవుతోందని పేర్కొంది. మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌కు ఎంత సమయం పడుతుందని ప్రశ్నించగా దాదాపు వారం రోజులు వుంటుందని ఈ విషయంలో వాదనలు వినిపిస్తున్న లాయర్లు చెప్పారు. అయినా కౌన్సెలింగ్‌ను ఆపేది లేదని బెంచ్ స్పష్టం చేసింది. దీనిపై రెండు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని ఎన్‌టీఏ, కేంద్రం తరపు న్యాయవాదులను కోరారు.

ఎన్‌టీఏకు నిర్దిష్టంగా కొన్ని ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విడిగా దాఖలైన మరో పిటిషన్‌పై కూడా బెంచ్ విచారించింది. జూన్ 23 తిరిగి నీట్ పరీక్షను నిర్వహించడానికి సంబంధించి ఎన్‌టీఏ వద్ద కొంత సమాచారం వుందని అది వెల్లడించాలని ఎన్‌టీఏను ఆదేశించాల్సిందిగా పిటిషనర్ కోరారు. దానిపై సమాధానం ఇవ్వాల్సిందిగా ఎన్‌టీఏ తరపు న్యాయవాదిని ఆదేశిస్తూ జులై 8న విచారణకు నిర్దేశించింది.

పరీక్షను తిరిగి నిర్వహించాలన్న అంశాన్ని లేవదీస్తూ దీనివల్ల మళ్లీ అభ్యర్థులు ఒత్తిడికి లోనవుతారని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. మే 5 పరీక్షను పక్కకు పెట్టే అవకాశం వున్నపుడు అన్నీ పక్కకు పెట్టేయవచ్చని బెంచ్ వ్యాఖ్యానించింది. తన అనారోగ్యం కారణంగా మళ్లీ పరీక్షకు హాజరయేందుకు అనుమతించాలని ఒక అభ్యర్థి పెట్టుకున్న పిటిషన్‌ను కూడా సుప్రీం విచారించింది. 1563 మంది అభ్యర్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడానికి ముందుగానే ఈ పిటిషనర్ తనను అనుమతించాలంటూ ఎన్‌టీఏను కోరారని ఆయన తరపు న్యాయవాది చెప్పారు. తెలంగాణా హైకోర్టులో కూడా పిటిషనర్ రిట్ పిటిషన్ వేశారని తెలిపారు. దానిపై ఇంకా ఎన్‌టీఏ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని చెప్పారు.

కేజ్రీవాల్ విడుదలకు బ్రేక్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విడుదలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. మద్యం స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన ఆదేశాలను శుక్రవారం నిలిపేసింది. అయితే ఢిల్లీ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు బెయిల్ ఉత్తర్వులపై 48 గంటల పాటు నిలుపుదల చేయాలన్న ఈడీ అభ్యర్థనను ప్రత్యేక జడ్జి నియయ్ బింధు గురువారం తిరస్కరించారు. రూ.లక్ష వ్యక్తిగత బాండ్ పూచీకత్తుపై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. ఈ తీర్పును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రంగా వ్యతిరేకించింది. శుక్రవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేజ్రీవాల్ బెయిల్‌పై సవాల్ చేసింది. ఈడీ తరపు న్యాయవాది ఎఎస్‌జి ఎస్‌వి రాజు వాదించారు. కేజ్రీవాల్ బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించేందుకు దర్యాప్తు సంస్థకు పూర్తి అవకాశం ఇవ్వలేదని హైకోర్టుకు తెలియజేశారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మనుసంఘ్వీ మాట్లాడుతూ కేజ్రీవాల్‌కు ట్రయిల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేయడం, బెయిల్ రద్దుతో సమానమని అభివర్ణించారు. బెయిల్ మంజూరు చేయడానికి, రద్దు చేయడానికి మధ్య స్పష్ట మైన వ్యత్యాసముందన్నారు. చట్టాన్ని దాట వేయడానికి ప్రయత్నిస్తోందంటూ ఈడీపై అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇరువైపుల వాదలను విన్న ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ బెయిల్‌పై మంగళ వారం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అప్పటి వరకు కేజ్రీవాల్‌ను తీహార్ జైలులోనే ఉండాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ సతీశ్ కుమార్ జైన్ శుక్రవారం తన ఆదేశాల్లో స్పష్టం చేశారు.

బెయిల్ ఆర్డర్ అప్‌లోడ్ కాకముందే హైకోర్టు ఎలా వెళ్తారు? సునీతా కేజ్రీవాల్

ఈడీ తీరుపై కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ మండిపడ్డారు. అసలు బెయిల్ ఆర్డర్ అప్‌లోడ్ కాకముందే హైకోర్టుకు ఎలా వెళ్తారు..? అని ప్రశ్నించారు. 'అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ ఆర్డర్‌ను ట్రయల్ కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకముందే.. ఈడీ హైకోర్టును ఎలా ఆశ్రయిస్తుంది? సీఎం స్థాయిలో ఉన్న నా భర్తను ప్రభుత్వం, కేంద్ర సంస్థలు వాంటెడ్ టెర్రరిస్టులా చూస్తున్నాయి. దేశంలో నియంతృత్వం పెరిగిపోయింది. హైకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం' అని అన్నారు. 'ఇలాంటి ఘటనను ఎన్నడూ గతంలో వినలేదు. దిగువ కోర్టు బెయిల్ ఉత్తర్వులు ఇంతవరకూ అప్‌లోడ్ కాలేదు. తాము వాటిని ఇంకా తీసుకోలేదు. అసలు ఉత్తర్వులే వెలువడనప్పుడు హైకోర్టు ఏం విచారి స్తుంది' అని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. అసలు ఈడీ ఏ ఆధారాలతో కోర్టును ఆశ్రయిం చిందని ప్రశ్నించారు. ఈ అంశాన్ని విచారిస్తామని న్యాయస్థానం ఏ ప్రాతిపదికన చెబుతుందని విస్మయం వ్యక్తం చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత కక్షతో ఇదంతా చేస్తోందని దుయ్యబట్టారు.

కవిత కస్టడీ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

వర్చువల్ మోడ్‌లో కోర్టులో ప్రొడ్యూస్ చేశారు. ఈ సందర్భంగా కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని సీబీఐ విజ్ఞప్తి చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, జులై 5 వరకు కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, లిక్కర్ స్కాం కేసులో ఏప్రిల్ 11న కవితను సీబీఐ తీహార్ జైల్‌లో అరెస్ట్ చేసింది. ఇటీవల కవిత పాత్రపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేయగా పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణను ట్రయల్ కోర్టు వాయిదా వేసింది. మరోవైపు ఇదే కేసులో కవితను ఈడీ ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసింది. ఈ కేసులో కవిత రోల్‌ను వివరిస్తూ ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. దీన్నీ పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం జులై 3న విచారణ చేపట్టనుంది. మరోవైపు కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

జమ్మూకాశ్మీర్ సహా 3 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

- సమరానికి ఈసీఐ కసరత్తు..

ఢిల్లీ: జమ్మూకాశ్మీర్‌తో పాటు హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. 2018లో జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ రద్దైన తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూకాశ్మీర్‌ఓటర్ల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ క్రమంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని ఈసీ నిర్ణయించింది. అర్హులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించింది. మరోవైపు హర్యానా అసెంబ్లీ గడువు నవంబర్ 11తో ముగుస్తుండగా.. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26, జార్ఖండ్ అసెంబ్లీ గడువు జనవరి 5, 2025తో ముగియనుంది. ఈనేపథ్యంలో వీటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైనచోట కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించింది. జులై 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. జులై 25న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తామని, ఆగస్టు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొంది. అలాగే ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఈసీఐ వారం రోజుల్లో సమావేశం కానుంది.

పడావేనా..!

(మొదటిపేజీ తరువాయి)

కోసం దరఖాస్తు చేసుకున్న ఎంతోమంది ఎదురుచూస్తున్నారు.

పడావుపడుతున్న డబుల్ ఇండ్లు

కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు పడావు పడ్డాయి. వంద శాతం నిర్మాణం పూర్తయిన ఇండ్లను కూడా పేదలకు అలాట్ చేసి పంపిణీ చేయక పోవడంతో అవన్నీ వృథాగా పడి ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ పట్టణంలో 785 డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించారు. వంద శాతం నిర్మాణం పూర్తయ్యింది. లబ్దిదారుల జాబితా సిద్ధం చేసి అలాట్‌మెంట్ చేశారు. అయితే లబ్దిదారులకు పట్టా ఇవ్వలేదు. ఎంపికైన పేదలకు ఇండ్లను కూడా అప్పజెప్పలేదు.

దీంతో 785 పూర్తయిన ఇండ్లు పడావు పడి ఉన్నాయి. జహీరాబాద్ నియోజకవర్గంలోనూ 99 శాతం పనులు పూర్తయిన 660 ఇండ్లు పడావుగా ఉన్నాయి. ఇక్కడ కూడా లబ్దిదారులకు అప్పజెప్పలేదు. అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్‌లో 48 ఇండ్లను నిర్మించి లబ్దిదారులకు కేటాయించి పంపిణీ చేయకుండా వదిలేశారు. సిద్ధిపేట జిల్లాలో 15 వేల ఇండ్లు మంజూరవగా ఇందులో 11803 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇందులో లబ్దిదారులకు కేవలం 10 వేల ఇండ్లను మాత్రమే లబ్దిదారులకు కేటాయించి పంపిణీ చేశారు. మరో 4057 ఇండ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో పేదలు ఎదురు చూస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 4243 ఇండ్లు మంజూరవ్వగా వీటిలో 3408 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. వీటిలో 3వేల ఇండ్లను లబ్దిదారులకు కేటాయించి పంపిణీ చేశారు.

మరో వెయ్యి ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఆగిపోయింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో నిర్మించిన ఇండ్లను కూడా ఇప్పటికీ లబ్దిదారులకు కేటాయించలేదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఇండ్లు కట్టిస్తామని చెప్పగానే పేదలు తాము నివాసముంటున్న రేకుల షెడ్లను కూలగొట్టి ..వేరేచోట నివాసం ఉంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని పేదలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆందోళనలు చేపడుతున్నారు.

నిర్మాణం పూర్తయిన ఇండ్లను పేదలకివ్వాలి: సీపీఐ(ఎం)

రాష్ట్రంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్ రూం ఇండ్లను అర్హులైన పేదలకు మంజూరు చేసి పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుంది. మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట, రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, పుల్కల్, సిద్ధిపేట జిల్లాలోని గజ్వేల్ ఇతర ప్రాంతాల్లో ప్రారంభానికి సిద్ధమైన ఇండ్లను వెంటనే ప్రభుత్వం పేదలకు అలాట్‌మెంట్ చేసి పొజిషన్ చూపాలని కోరుతూ ఇప్పటికే జిల్లా అధికారుల్ని కలిశారు. చాలా చోట్ల నిర్మాణ పనులు వివిధ దశలో ఆగిపోయిన ఇండ్లనిర్మాణాన్ని కూడా పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల్ని మంజూరు చేయాలని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్ కోరారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాలులివ్వాలి

నవతెలంగాణ-మియాపూర్

పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మహిళలు ప్రభుత్వ భూమిలో ధర్నాకు దిగారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని 100, 101సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల మహిళలు పెద్దఎత్తున స్వతంత్రంగా శుక్రవారం తరలివచ్చారు. స్థలాలు ఆక్రమించుకుని అక్కడే బైటాయించారు.

సర్వే నెంబర్ 100, 101లో సుమారు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై కొన్నేండ్లుగా కోర్టులో కేసు విచారణలో ఉంది. అయితే శుక్రవారం సుమారు 30మందికిపైగా మహిళలు, చుట్టుపక్కల ప్రజలు ఒకేసారి భూమిలోకి వచ్చారు. అక్కడ ఇండ్ల స్థలాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారులు పోలీసు బందోబస్తుతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారికి అధికారులు, పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ మహిళలు అక్కడి నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వం గతంలో చెప్పిన మాదిరిగా ఇండ్లు ఇవ్వాలని కోరారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి వెళ్లేది లేదని తేల్చి చెప్పారు. రాత్రి వరకు అక్కడే ఉన్నారు.

47 లక్షల మంది రైతులు రూ.31 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి జులై 15లోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని తెలిపారు. ఆ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి అందరి సూచనలతో అర్హులైన రైతులకు పారదర్శకంగా రైతుభరోసాను అమలు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రివర్గ నిర్ణయాలు, ప్రభుత్వ పరిపాలనపరమైన నిర్ణయాలను వెల్లడించే బాధ్యత మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారిద్దరిచ్చే సమాచారమే ప్రభుత్వ అధికారిక సమాచారమని స్పష్టం చేశారు. ఏవైనా అపోహలుంటే అవసరమైన సమాచారం వారి నుంచి తీసుకోవాలని సూచించారు. రుణమాఫీపై త్వరలోనే విధివిధానాలతో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడతాయని చెప్పారు. నియమ నిబంధనలన్నింటినీ ఆ జీవోలో పొందుపరుస్తామని వెల్లడించారు.

సేద్యం దండగ కాదు..పండుగే..

వ్యవసాయమంటే దండగ కాదు పండుగ అనేలా చేయాలనేదే కాంగ్రెస్ విధానమని సీఎం స్పష్టం చేశారు. తమ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే మాటలను శిలాశాసనంగా అమలు చేస్తామని తెలిపారు. 2004లో కరీంనగర్‌లో జరిగిన సభలో తెలంగాణ ఏర్పాటుకు సోనియాగాంధీ మాటిచ్చి, పార్టీ విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్నప్పటికీ నిలబెట్టుకున్నదని గుర్తుచేశారు. 2022 మే 6న వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం 2014లో రూ.16 వేల కోట్లు, 2018లో రూ.12 వేల కోట్లు...మొత్తంగా పదేండ్లలో రెండు దఫాలుగా రూ.28 వేల కోట్లు రుణమాఫీ చేసిందని చెప్పారు. తమ ప్రభుత్వం మాత్రం ఏకకాలంలో రూ.31 వేల కోట్లను మాఫీ చేయబోతున్నదని వివరించారు. గత సర్కార్ చివరిసారిగా రైతు రుణమాఫీకి కటాఫ్ తేదీగా 2018 డిసెంబర్ 11ను తీసుకున్నారనీ, అందుకే తాము 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. విలేకర్ల సమావేశంలో సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు మంత్రివర్గ సహచరులందరు పాల్గొన్నారు.

పదేండ్ల ఐసీసీ టైటిల్ నిరీక్షణకు తెరదించటమే లక్ష్యంగా దూసుకెళ్తున్న టీమ్ ఇండియా.. ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్త్ దిశగా అడుగులు వేస్తోంది. సూపర్8లో తొలి సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న భారత్.. నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. కంగారూలతో మ్యాచ్‌కు ముందే సెమీస్ బెర్త్ దక్కించుకునేందుకు రోహిత్‌సేన నేడు నార్త్‌సౌండ్‌లో బరిలోకి దిగనుంది. భారత్, బంగ్లాదేశ్ సూపర్8 సమరం నేడు.

సెమీస్ చేరాలని..



నేడు బంగ్లాదేశ్‌తో భారత్ పోరు
జోరుమీదున్న టీమ్ ఇండియా
రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..
ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్





నవతెలంగాణ-నార్త్‌సౌండ్

టీ20 ప్రపంచకప్‌లో నేడు భారత్ మరో సవాల్‌కు సిద్ధమైంది. సూపర్8 దశలో నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. అఫ్గనిస్థాన్‌పై విజయం సాధించిన రోహిత్‌సేన నేడు బంగ్లాదేశ్‌పై గెలిస్తే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకునే అవకాశం ఉంది. దీంతో భారత్ ఈ మ్యాచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. మరోవైపు ఓ ఓటమితో సెమీస్ రేసు నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉండటంతో బంగ్లాదేశ్ సైతం నేడు అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. నార్త్‌సౌండ్ వేదికగా భారత్, బంగ్లాదేశ్ సూపర్8 పోరు నేడు.

కోహ్లి ఫామ్‌లోకి వచ్చేనా?

టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాకు పెద్దగా ఆందోళన లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పటిష్టంగా ఉంది. కానీ బ్యాటింగ్ లైనప్‌లో స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఫామ్ సమస్యగా మారుతోంది. గ్రూప్ దశ మ్యాచులు పూర్తిగా అమెరికాలో జరుగగా అక్కడ కోహ్లి తేలిపోయాడు. సూపర్8లో అఫ్గనిస్థాన్‌తోనూ కోహ్లి అంచనాలను అందుకోలేదు. కీలక సెమీఫైనల్స్ ముంగిట విరాట్ కోహ్లి పరుగుల వేట సాగిస్తే.. భారత్‌కు తిరుగుండదు. కెప్టెన్ రోహిత్ శర్మ సైతం ఇటీవల మ్యాచుల్లో నిరాశపరిచాడు. సీనియర్ బ్యాటర్లు కోహ్లి, రోహిత్ జోరందుకుంటే భారత్ సులువుగా భారీ స్కోర్లు నమోదు చేయగలదు. రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె సహా హార్దిక్ పాండ్య మంచి ఫామ్‌లో ఉన్నారు. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఆల్‌రౌండర్లుగా ఆశించిన ప్రదర్శన చేస్తున్నారు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బౌలింగ్ విభాగానికి వైవిధ్యత తీసుకొచ్చాడు. జశ్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ పేసర్లుగా అద్భుతంగా రాణిస్తున్నారు. వార్మప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడిన అనుభవం సైతం ఇప్పుడు సూపర్8లో కలిసొచ్చే అవకాశం ఉంది.

బంగ్లా నిలిచేనా?

బంగ్లాదేశ్ గ్రూప్ దశలో మెరిసినా.. సూపర్8లో భిన్నంగా కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో చిత్తుగా ఓడింది. నార్త్‌సౌండ్‌లోనే వరుసగా రెండో మ్యాచ్ ఆడటం బంగ్లాదేశ్‌కు కలిసొచ్చే అంశం. కానీ ఆ జట్టులో కీలక ఆటగాళ్లు ఫామ్‌లో లేరు. బ్యాటింగ్ లైనప్‌లో కెప్టెన్ నజ్ముల్ శాంటో, తౌహిద్ హృదయ్ మినహా అందరూ నిరాశపరుస్తున్నారు. భారత్‌పై లిటన్ దాస్, షకిల్ అల్ హసన్ సహా మహ్మదుల్లాకు మంచి రికార్డు ఉంది. దీంతో నేడు ఈ ముగ్గురు కీలకం కానున్నారు. బౌలింగ్ విభాగంలో ముస్తాఫిజుర్ రెహమాన్, మెహిది హసన్‌లతో పాటు మెహిది హసన్ భారత బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

పరిస్థితులు

ఆంటిగ్వాలోని వివ్ రిచర్డ్స్ స్టేడియం బ్యాటర్లకు, బౌలర్లకు సమానంగా అనుకూలం. ఇక్కడ ఇప్పటివరకు 200 పైచిలుకు స్కోరు నమోదు కాలేదు. ఇక్కడ జరిగిన టీ20 మ్యాచుల్లో ఎక్కువగా ఓ మోస్తరు స్కోర్లు మాత్రమే నమోదయ్యాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్‌కు వాతావరణం సైతం అనుకూలంగానే ఉండనుంది. మ్యాచ్ సమయంలో ఎటువంటి వర్షం సూచనలు లేవు. కానీ మ్యాచ్ రోజు 20 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

తుది జట్లు (అంచనా)


భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

బంగ్లాదేశ్ : హసన్, లిటన్ దాస్, నజ్ముల్ శాంటో (కెప్టెన్), రిషద్, హృదయ్, షకిబ్ అల్ హసన్, మహ్మదుల్లా, మెహెది హసన్, టస్కిన్ అహ్మద్, హసన్ షకిబ్, ముస్తాఫిజుర్ రెహమాన్.

సఫారీతో 4 టీ20లు

షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ, సీఎస్ఏ

ముంబయి : టీమ్ ఇండియా 2024-25 సీజన్ స్వదేశీ సీజన్ షెడ్యూల్ ప్రకటించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం ఓ విదేశీ పర్యటనను ఖరారు చేసింది. క్రికెట్ దక్షిణాఫ్రికాతో కలిసి నాలుగు మ్యాచుల టీ20 సిరీస్ షెడ్యూల్ ప్రకటించింది. నవంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు నాలుగు టీ20 మ్యాచులు ఆడనుంది. నవంబర్ 8, నవంబర్ 10, నవంబర్ 13, నవంబర్ 16న వరుసగా డర్బన్, పోర్ట్ ఎలిజబెత్, సెంచూరియన్, జొహనెస్‌బర్గ్‌లో మ్యాచులు జరుగనున్నాయి. ఈ మేరకు బీసీసీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.



మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా అదరగొట్టింది. సెమీఫైనల్ బెర్త్ వేటను సూపర్ 8లో అలవోక విజయంతో మొదలెట్టింది. పేసర్ పాట్ కమిన్స్ (3/29) హ్యాట్రిక్ వికెట్లతో విజృంభించగా తొలుత బంగ్లాదేశ్ 140/8 పరుగులే చేసింది. ఛేదనలో డెవిడ్ వార్నర్ (53 నాటౌట్) అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కగా వర్షం అంతరాయం కలిగించినా ఆస్ట్రేలియా 28 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్దతిలో) తేడాతో ఘన విజయం సాధించింది.

ఆసీస్ అలవోకగా..!

ఛేదనలో డెవిడ్ వార్నర్ జోరు
పాట్ కమిన్స్‌కు హ్యాట్రిక్ వికెట్లు
బంగ్లాదేశ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం
ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్



నవతెలంగాణ-నార్త్‌సౌండ్

వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. 141 పరుగుల ఛేదనలో డెవిడ్ వార్నర్ (53 నాటౌట్, 35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. ట్రావిశ్ హెడ్ (31, 21 బంతుల్లో 3 సిక్సులు) రాణించాడు. 11.2 ఓవర్లలో ఆస్ట్రేలియా 100/2తో ఉండగా వర్షంతో మ్యాచ్ ఆగిపోయింది. డక్‌వర్త్ లూయిస్ పద్దతిలో ఆస్ట్రేలియా 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతకుముందు, పాట్ కమిన్స్ (3/29), ఆడం జంపా (2/24) మెరవటంతో బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 140 పరుగులు చేసింది. నజ్ముల్ హుస్సేన్ శాంటో (41, 36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), తౌహిద్ హృదయ్ (40, 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టిన పాట్ కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

వార్నర్ ధనాధన్ : ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్లు దంచికొట్టారు. తొలి వికెట్‌కు 6.5 ఓవర్లలోనే 65 పరుగులు జోడించి మ్యాచ్‌ను బంగ్లాదేశ్ నుంచి లాగేసుకున్నారు. డెవిడ్ వార్నర్ (53 నాటౌట్), ట్రావిశ్ హెడ్ (31) దంచికొట్టారు. 35 బంతుల్లోనే ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో డెవిడ్ వార్నర్ దూకుడుగా ఆడాడు. అజేయ అర్థ సెంచరీతో బంగ్లాదేశ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ట్రావిశ్ హెడ్ తనదైన శైలిలో రెచ్చిపోయాడు. రెండు సిక్సర్లు, మూడు ఫోర్లతో కదం తొక్కాడు. ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్ (1) స్వల్ప విరామంలో వికెట్ కోల్పోయారు. అయినా, ఆసీస్ జోరు తగ్గలేదు. గ్లెన్ మాక్స్‌వెల్ (14 నాటౌట్, 6 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి డెవిడ్ వార్నర్ ఊచకోత కొనసాగించాడు. దీంతో 11.2 ఓవర్లలో 2 వికెట్లకు 100 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం కురవటంతో మ్యాచ్ నిలిచిపోయింది. ఆట కొనసాగించే పరిస్థితులు లేకపోవటంతో డక్‌వర్త్ లూయిస్ పద్దతిలో మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించారు. డక్‌వర్త్ పద్దతిలో 11.2 ఓవర్లలో బంగ్లాదేశ్ స్కోరు 72. దీంతో ఆస్ట్రేలియా లక్ష్యం 73 పరుగులు. అప్పటికే 100 పరుగులు చేయటంతో ఆస్ట్రేలియా 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో రిషద్ హుస్సేన్ (2/23) రెండు వికెట్లు పడగొట్టాడు.

ఆ ఇద్దరు మెరిసినా.. : తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ ఆశించిన ప్రదర్శన చేయలేదు. ఆసీస్ బౌలర్లు బంగ్లాదేశ్ బ్యాటర్లను కట్టడి చేశారు. స్పిన్నర్ ఆడం జంపా (2/24), పాట్ కమిన్స్ (3/29) వికెట్ల వేటలో విజృంభించారు. బంగ్లాదేశ్ ఓపెనర్ తంజిద్ హసన్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. లిటన్ దాస్ (16, 25 బంతుల్లో 2 ఫోర్లు) నిరాశపరిచాడు. ఓ ఎండ్‌లో కెప్టెన్ నజ్ముల్ శాటో (41) నిలువగా మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. రిషద్ హుస్సేన్ (2) సైతం నిరాశపరిచాడు. ఈ సమయంలో శాంటో జతకలిసిన తౌహిద్ హృదయ్ (40) బంగ్లాదేశ్‌ను మంచి స్కోరు దిశగా నడిపించారు. ఈ ఇద్దరు నిష్క్రమించిన తర్వాత బంగ్లాదేశ్ నుంచి ఎవరూ రాణించలేదు. షకిబ్ అల్ హసన్ (8), మహ్మదుల్లా (2), మెహిది హసన్ (0) తేలిపోయారు. పాట్ కమిన్స్ వరుస బంతుల్లో మూడు వికెట్లు కూల్చి కెరీర్ తొలి హ్యాట్రిక్ సాధించాడు. 20 ఓవర్లలో 8 వికెట్లకు బంగ్లాదేశ్ 140 పరుగులే చేసింది. కీలక బ్యాటర్లు షకిబ్ అల్ హసన్, మహ్మదుల్లా నిరాశపరచటం బంగ్లాదేశ్ స్కోరుపై ప్రతికూల ప్రభావం చూపించింది.

స్కోరు వివరాలు :

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : హసన్ (బి) స్టార్క్ 0, లిటన్ దాస్ (బి) జంపా 16, శాంటో (ఎల్బీ) జంపా 41, రిషద్ (సి) జంపా (బి) మాక్స్‌వెల్ 2, హృదయ్ (సి) హేజిల్‌వుడ్ (బి) కమిన్స్ 40, షకిబ్ (సి,బి) స్టొయినిస్ 8, మహ్మదుల్లా (బి) కమిన్స్ 2, మెహిది (సి) జంపా (బి) కమిన్స్ 0, టస్కిన్ నాటౌట్ 13, హసన్ షకిబ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 14, **మొత్తం : (20 ఓవర్లలో 8 వికెట్లకు) 140.**


వికెట్ల పతనం : 1-0, 2-58, 3-67, 4-84, 5-103, 6-122, 7-122, 8-133.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 4-0-21-1, జోశ్ హేజిల్‌వుడ్ 4-1-25-0, పాట్ కమిన్స్ 4-0-29-3, ఆడం జంపా 4-0-24-2, మార్కస్ స్టొయినిస్ 2-0-24-1, గ్లెన్ మాక్స్‌వెల్ 2-0-14-1.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : డెవిడ్ వార్నర్ నాటౌట్ 53, ట్రావిశ్ హెడ్ (బి) రిషద్ 31, మిచెల్ మార్ష్ (ఎల్బీ) రిషద్ 1, మాక్స్‌వెల్ నాటౌట్ 14, ఎక్స్‌ట్రాలు : 1, మొత్తం : (11.2 ఓవర్లలో 2 వికెట్లకు) 100.

వికెట్ల పతనం : 1-65, 2-69.

బౌలింగ్ : మెహిది హసన్ 4-0-22-0, హసన్ షకిబ్ 1-0-9-0, టస్కిన్ అహ్మద్ 1.2-0-22-0, ముస్తాఫిజుర్ 2-0-23-0, రిషద్ 3-0-23-2.



విజయ్ ఆంటోనీ

వెతికా నేనే నా జాడే..

హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తుఫాన్'. ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ సంస్థ గతంలో విజయ్ ఆంటోనీ హీరోగా 'రాఘవన్, హత్య' సినిమాలను నిర్మించింది.
పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్ లో ఈ సినిమాని రూపొందిస్తున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్. ఈ సినిమాను త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'వెతికా నేనే నా జాడే'ని చిత్ర బృందం రిలీజ్ చేసింది. ఈ పాటకు భాష్యశ్రీ లిరిక్స్ అందించారు. మాష్మి నేహా పాడారు. హరి దఫూషియా సంగీతాన్ని అందించారు. 'వెతికా నేనే నా జాడే నిలిచి దారిలో...నా ఒళ్లే వెతికే నేడు కొత్త పేరునే, నాకు నేనై తప్పి పోయా గాలై సాగుతూ..కాలం కరిగిపోయే తీరం చేరుతూ' అంటూ ఆలోచింపజేసే లిరిక్స్‌తో సాగుతుందీ పాట. ఈ సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది అని మేకర్స్ తెలిపారు. శరత్ కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాష్, మురళీ శర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటిస్తున్నారు.

విభిన్న ప్రేమకథా చిత్రం



రామ్ యోగి వెలగపూడి

సూర్య శ్రీనివాస్, శివ బొడ్డు రాజు హీరోలుగా జెనిఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన సినిమా 'ఇవోల్'. (ఏ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్) అనేది క్యాప్షన్. ఈ టైటిల్‌ని రివర్స్‌లో చూస్తే లవ్ అని ఉండటం విశేషం. టైటిల్ మాదిరిగానే ఈ సినిమా కూడా ఒక రివర్స్ లవ్ స్టోరీగా మన ముందుకు రాబోతుంది.
తాజాగా విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో నిర్మాత, డైరెక్టర్ రామ్ యోగి వెలగపూడి మాట్లాడుతూ, 'తేడా బ్యాచ్ సినిమా సమర్పణలో నక్షత్ర ఫిల్మ్ ల్యాబ్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకుని, విడుదలకు సిద్ధంగా ఉంది. ఇద్దరు స్నేహితుల మధ్య అండర్‌స్టాండింగ్ నేపథ్యంలో సాగే కథ అని. సినిమా డిఫరెంట్ అంశాలు, వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కి, ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఈ చిత్రాన్ని హైదరాబాద్, వైజాగ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. సెన్సార్ పూర్తి చేసుకున్న మా చిత్రం 'ఎ' సర్టిఫికేట్‌ని సొంతం చేసుకుంది. త్వరలోనే రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం' అని తెలిపారు.
ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: సునీల్ కశ్యప్, కెమెరా: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటర్: విజయ్, కళ: యోగి వెలగపూడి, కొరియోగ్రాఫర్: జిన్నా కథ-స్క్రీన్ ప్లే-మాటలు-నిర్మాత-దర్శకత్వం: రామ్ యోగి వెలగపూడి.

మాయా సుందరి..



హెబ్బా పటేల్, చేతన్ కృష్ణ

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ధూం ధాం'. సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్‌గా సాగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన 'మల్లెపూల టాక్సీ..' పాట ఛాట్ బస్టర్ అయ్యింది. మంగ్లీ పాడిన ఈ పాట ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. తాజాగా ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మాయా సుందరి..'ని మేకర్స్ విడుదల చేశారు.
ఈ పాటకు సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, గోపీ సుందర్ మంచి బీట్‌తో కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి పాడారు. 'మాయా సుందరి..హే మాయా సుందరి..నా మాయా సుందరి..ఎక్కడున్నావో మరి..గుప్పెడు గుండెను నువ్వే పట్టుకు పోయావే, నా రెప్పల నిద్దురనంతా ఎత్తుకుపోయావే..' అంటూ సాగుతుందీ పాట.
సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, బెనర్జీ, సాయి శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్ నేని, గిరిధర్, భద్రమ్ తదితరులు ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.



సాయి దుర్గ తేజ్

పవర్‌ఫుల్ యూనివర్సల్ కాన్సెప్ట్

హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ఇటీవల ప్రారంభమైంది. 'విరూపాక్ష, బ్రో' చిత్రాలతో 100 కోట్ల క్లబ్‌లో చేరిన ఆయన ఈసారి మరింత ఉత్సాహంతో, అత్యంత ప్రతిష్టాత్మకమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను నిర్మాతలు శుక్రవారం విడుదల చేశారు.
ల్యాండ్ మైన్‌లతో చుట్టుముట్టబడిన ఎడారి భూమిలో పచ్చని చెట్టుతో ఉన్న పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ పోస్టర్ చూస్తుంటే ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతున్నట్లు చెప్పకనే చెబుతోంది. ఈ సినిమా గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'ఈ చిత్రం గ్రాండ్ స్కేల్‌తో, భారీ బడ్జెట్‌తో రూపొందనుంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి దుర్గ తేజ్ పాత్ర చాలా శక్తివంతంగా ఉంటుంది. ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం తొలిషెడ్యూల్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ఈ సినిమాని నిర్మిస్తున్నాం' అని తెలిపారు.

నవచిత్రం

మా ఊరు శ్రీకాకుళం..



వెన్నపూస రమణ రెడ్డి, మోహన్, హరీష్ శంకర్

వెన్నెల కిషోర్, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో రైటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందుతున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్ పై లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణ రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు.
ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. డైరెక్టర్ హరీష్ శంకర్ ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' టైటిల్ సాంగ్‌ని లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సాంగ్ చూశాను. సునీల్ కశ్యప్ ఈ సాంగ్‌ని క్యాచీ అండ్ టచ్చింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. శ్రీకాకుళం గురించి సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన లిరిక్స్ అద్భుతంగా ఆకట్టుకున్నాయి. మంగ్లీ ఎనర్జిటిక్ వోకల్స్ పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. విజువల్స్ సూపర్‌గా ఉన్నాయి. టైటిల్ చాలా ఫన్నీగా ఉంది. మోహన్ నాకు రైటర్‌గా ఉన్నప్పటి నుంచి పరిచయం. చాలా మంచి రైటర్. వెన్నెల కిషోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం' అని అన్నారు.
సీయా గౌతమ్, స్నేహ గుప్తా, రవితేజ మహాద్యం, బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్, బద్రం, అనీష్ కురివెళ్ల, నాగ మహేష్, మచ్చ రవి, ప్రభావతి, సంగీత, శుభోదయం సుబ్బారావు, శివమ్ మల్హోత్రా, వాజ్‌పేయ్ ఐడ్రీం నాగరాజు, ఎంవీఎస్ కశ్యప్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : రాజేష్ రామ్ బాల, సంగీతం: సునీల్ కశ్యప్, డీవోపీ: మల్లికార్జున్ ఎన్, ఎడిటర్ : అవినాష్ గుర్లింక, ఆర్ట్ డైరెక్టర్ : బేబీ సురేష్, స్టంట్స్: డ్రాగన్ ప్రకాష్.

భావోద్వేగ భరితంగా బుజ్జి మేక పాట..



సాహిత్ మోత్కూరి డైరెక్ట్ చేస్తున్న చిత్రం 'పొట్టేల్'. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్రెష్ అండ్ హానెస్ట్ నోవల్ కాన్సెప్ట్ మూవీ. ఇప్పటివరకు విడుదలైన కంటెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింతగా పెంచింది. పల్లెటూరి వాతావరణంలో జరిగే సినిమాల్లో ఎమోషన్స్ పండితే అద్భుతాలు సృష్టిస్తాయి. ఈ సినిమాలోని మొదటి 3 పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా అలరిస్తున్నాయి. ఇప్పుడు మేకర్స్ ఫోర్త్ సింగిల్‌ను విడుదల చేశారు. 'బుజ్జి మేక' సాంగ్ ఈ సినిమా ఎసెన్స్‌ని ప్రజెంట్ చేసే పవర్ ఫుల్ ట్రాక్. శేఖర్ చంద్ర పవర్ ఫుల్ కంపోజిషన్, కాసర్ల శ్యామ్ అందించిన ఎమోషనల్ లిరిక్స్‌తో ఈ పాట అందర్నీ బాగా అలరిస్తోంది. కాల భైరవ వోకల్స్ పాటకు ప్రాణం పోసాయి. ఎమోషన్‌ని మరో స్థాయికి తీసుకెళ్ళాయి. పాటలోని విజువల్స్ చాలా నేచురల్‌గా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ తమ బెస్ట్ వర్క్ అందించడంతో 'బుజ్జి మేక' హార్ట్ టచ్చింగ్ సాంగ్‌గా నిలిచింది అని చిత్ర బృందం తెలిపింది.పొట్టేల్ దర్శకుడిగా సాహిత్ మోత్కూరికి ఇది మూడో చిత్రం. ఇందులో యువ చంద్ర కృష్ణతో పాటు అనన్య నాగళ్ల లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.
అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్, జీవన్, రియాజ్, విక్రమ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం - సాహిత్ మోత్కూరి, నిర్మాతలు - నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె, సంగీతం- శేఖర్ చంద్ర, సినిమాటోగ్రాఫర్ - మోనిష్ భూపతి రాజు, ఎడిటర్ - కార్తీక శ్రీనివాస్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సింగరేణి అవకతవకలపై సీబీఐ విచారణకు ఆదేశించాలి : ఎస్.కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణిలో జరిగిన ఆర్థిక అవకతవకలు, బొగ్గు తవ్వకాలపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కోరారు. గనుల వేలం విషయంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జెన్‌కో, ట్రాన్స్ కో ద్వారా సింగరేణికి రావాల్సిన రూ.20 వేల కోట్లు ఎందుకు తేలేకపోతున్నారు? జీతాలివ్వడానికి బ్యాంకు రుణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్లాకుల వేలంలో వెసులుబాటు కల్పించింది బీజేపీ ప్రభుత్వమేననీ, దీనిని గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉపయోగించుకోలేదని విమర్శించారు. ఈ అవకాశాన్ని జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు ఉపయోగించుకుని లబ్ధి పొందాయని తెలిపారు. సింగరేణి బ్లాకుల వేలానికి ఇప్పటి వరకు మూడునాలుగు సార్లు టెండర్ నిర్వహించారని చెప్పారు. సింగరేణిని నిర్వీర్యం చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించిందని విమర్శించారు. అదే పార్టీ సింగరేణిని కేంద్రం ప్రయివేటు పరం చేస్తున్నదని కార్మికులను అయోమయానికి గురిచేసిందన్నారు. ఎరువుల కర్మాగారం ప్రారంభం సమయంలోనూ ప్రధాని మోడీ ప్రయివేటీకరించడం లేదని చెప్పినా విష ప్రచారం మాత్రం ఆగడం లేదని తెలిపారు. ఒడిశాలో నైనీ బ్లాక్‌ను కొన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ఎందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్, యూపీఏ కూటమి ప్రభుత్వాలున్న సమయంలో నామినేషన్ పద్ధతిలో 120 బ్లాకులు కేటాయించారనీ, కాంగ్రెస్ హయాంలోనే అతిపెద్ద బొగ్గు స్కామ్ జరిగిందని విమర్శించారు. బొగ్గు స్వరూపం తెలియని వారికి కూడా కాంగ్రెస్ గనులు కేటాయించిందనీ, కాంగ్రెస్ బొగ్గు అవినీతి కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్ళిందని గుర్తుచేశారు.

గ్రామీణ మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- సచివాలయంలో మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం, వారిని కోటీశ్వర్లుగా ఎదిగేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని కింది, మూడో అంతస్తుల్లో రెండు మహిళా శక్తి క్యాంటీన్లను సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలనీ, దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అమ్మచేతి వంటలా మహిళా శక్తి క్యాంటీన్లు నాణ్యతకు మారుపేరుగా నిలవాలనీ, పల్లె రుచులు, ఇప్ప పువ్వు లడ్డూలు, సన్నారి వంటి సాంప్రదాయ ఆహార పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు. రెండేండ్లలో రాష్ట్రంలో 151 మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులు, వస్తువుల ఆధారంగా, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ రూపొందించి ముందుకెళ్తున్నామనీ, రానున్న ఐదేండ్లలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే గుర్తించిన 17 వ్యాపారాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలన జరగాలంటే మహిళలు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా క్యాంటీన్లు, సోలార్ ఉత్పత్తి, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెకరేషన్ ఫొటోగ్రఫీ, మీసేవ, ఆధార్ కేంద్రాలు, పౌల్ట్రీ, డెయిరీ నిర్వహణ, స్టార్టప్ కంపెనీలకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందనీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతుందని భరోసానిచ్చారు. గ్రామాల్లో జరిగే ఫంక్షన్లకు మహిళా సంఘాలు పిండివంటలు సరఫరా చేసే స్థాయికి ఎదగాలన్నారు. 20 రోజుల్లో జిల్లా ఆస్పత్రుల్లో మహిళా శక్తి కాంటీన్లను ప్రారంభించే పనులను వేగవంతం చేయాలని సీఎస్ శాంతి కుమారికి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ముఖ్యమంత్రి కార్యదర్శులు మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, సెర్ప్ డైరెక్టర్ గోపాల్ రావు, సెర్ప్ అధికారులు నర్సింహారెడ్డి, సునితారెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.

సర్వపిండిని కొనుగోలు చేసిన మంత్రి సీతక్క

సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్లు కార్పొరేట్ క్యాంటీన్లకు తీసిపోని విధంగా ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల మహిళా సమాఖ్యలు ఏర్పాటు చేసిన రెండు క్యాంటీన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అందులో పిండివంటలు, చిరుతిళ్లు, స్వీట్లు, పొడులు, పచ్చళ్లు, సర్వప్ప, సకినాలు, అరిసెల వంటి తెలంగాణ వంటపదార్థాలను విక్రయిస్తున్నారు. మంత్రి సీతక్క సర్వపిండిని కొనుగోలు చేశారు. మహిళా సంఘాల ఆతిథ్యాన్ని స్వీకరించి పిండివంటల రుచి చూశారు. పచ్చడితో గారెలను చూసి తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు శిక్షణ ఇచ్చి క్యాంటిన్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించినందుకు మంత్రికి మహిళా సంఘాల సభ్యులు ధన్యవాదాలు తెలిపారు

312 ప్రాంతాల్లో కురిసిన వర్షం

- వచ్చే మూడు రోజులూ తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీజీడీపీఎస్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు 312 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండిలో అత్యధికంగా 9.13 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. మొత్తం 54 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. శనివారం నాడు ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని సూచించారు. శని, ఆది, సోమ వారాల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడొచ్చు. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

గుండి(కరీంనగర్ జిల్లా)	9.13 సెంటీమీటర్లు
మల్లారం(భూపాలపల్లి జిల్లా)	6.10 సెంటీమీటర్లు
కమాన్‌పూర్(పెద్దపల్లి జిల్లా)	4.65 సెంటీమీటర్లు
పెద్దంపేట(భూపాలపల్లి జిల్లా)	4.28 సెంటీమీటర్లు
మార్తన్‌పేట(రాజన్నసిరిసిల్ల జిల్లా)	4.20 సెంటీమీటర్లు

నీట్ పరీక్ష అక్రమాలకు నిరసనగా కాంగ్రెస్ ప్రదర్శన

- గాంధీభవన్ నుంచి ట్యాంక్‌బండ్ దాకా
- మోడీ క్షమాపణ చెప్పాలి : మహేష్‌కుమార్, బల్మూరి వెంకట్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నిరసన ప్రదర్శన చేపట్టింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి ట్యాంక్ బండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్, బల్మూరి మాట్లాడుతూ 24లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. నీట్ పరీక్షను బాధ్యతాయుతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

జూన్14న విడుదల చేయాల్సిన ఫలితాలను పది రోజులకు ముందుగా విడుదల చేయడంలో ఉద్దేశమేంటని ప్రశ్నించారు. బీహార్, గుజరాత్, హర్యానా వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ జరిగిందంటూ ఆధారాలతో సహా బయటకు వచ్చాయని గుర్తు చేశారు. నీట్ పేపర్ లీకేజి వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలనీ, పరీక్షలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేయాలనీ, విద్యార్థులు, తల్లితండ్రులకు కేంద్రప్రభుత్వం, ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేతలతో చర్చించాకే కొత్త అధ్యక్షున్ని నియమించాలి

- బీజేపీ అధిష్టానానికి ఎమ్మెల్యే రాజాసింగ్ సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్టీలోని నేతలతో చర్చించిన తర్వాతనే కొత్త అధ్యక్షున్ని నియమించాలని బీజేపీ జాతీయ నాయకత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ రోజురోజుకీ పెరుగుతున్నదని పేర్కొన్నారు. దేశం, ధర్మం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షునిగా నియమించాలని కోరారు. 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు, ఇతర సీనియర్ నేతల అభిప్రాయం తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐటీఐఆర్ రద్దును అడ్డుకోలేకపోయారు

- బీజేపీ మంత్రులపై జగ్గారెడ్డి ఫైర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్టుమెంట్ రిజియన్ (ఐటీఐఆర్)కు గత యూపీఏ ప్రభుత్వం అనుమతి ఇస్తే... నేటి బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందనీ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. బీజేపీ మంత్రులు దాన్ని అడ్డుకోలేకపోయారని ఫైరయ్యారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఐటీఐఆర్‌ను రద్దు చేస్తే కనీసం చర్చ కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేతల ప్రసంగాల్లో రెచ్చగొట్టే అంశాలే తప్ప ఉపాధి, ఉద్యోగాలపై చర్చలేదన్నారు.

విద్యుద్ఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి

- హాస్టల్ గోడ దూకేందుకు యత్నించగా ఘటన

నవతెలంగాణ-హాయత్ నగర్

హాస్టల్ గోడ దూకే క్రమంలో విద్యుద్ఘాతానికి గురై ఇంటర్ విద్యార్థి ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన హైదరాబాద్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న విజయ్ కుమార్- చాముండేశ్వరీ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు కర్రీ గిరీష్(16) ఈనెల 12న అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కోహెడ గ్రామ సమీపంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో చేరాడు. అతను ఇంటర్ మొదటి సంవత్సరం(ఎంపీసీ) చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే, హాస్టల్లో ఉండటం ఇష్టం లేని గిరీష్.. ఈనెల 20న అర్ధరాత్రి హాస్టల్ గోడ దూకేందుకు ప్రయత్నించగా విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బండి సంజయ్‌కి చివరి అవకాశం

- అడ్వకేట్ కమిషన్ ఎదుట హాజరుకావాలని హైకోర్టు ఆదేశం
- లేకపోతే ఎన్నికల పిటిషన్‌పై విచారణ మూసేస్తామని వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికలప్పుడు కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్ ఎన్నిక కావడం చెల్లదని ఆయన చేతిలో ఓడిపోయిన నాటి బీజేపీ అభ్యర్థి, నేటి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి హైకోర్టు చివరి అవకాశం ఇచ్చింది. ఎలక్షన్ పిటిషన్‌లో రెండు వైపులా వాంగ్మూలాలను నమోదు చేసేందుకు హైకోర్టు గతంలోనే అడ్వకేట్ కమిషన్‌ను నియమించింది. గతంలో కూడా హైకోర్టు ఆదేశించినా ఆ కమిషన్ ఎదుట బండి హాజరు కాలేదు. దీంతో గతంలోనే హైకోర్టు ఆయనకు జరిమానా కూడా విధించింది. శుక్రవారం ఆ కేసు విచారణ వచ్చినప్పుడు మరోసారి గడువు కావాలని బండి లాయర్ కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, పిటిషనర్ అడ్వకేట్ కమిషన్ ఎదుట కావాల్సిందేనని చెప్పారు. ఒకవేళ హాజరై సాక్ష్యం చెప్పకపోతే గంగులపై వేసిన ఎలక్షన్ పిటిషన్‌పై విచారణను మూసేస్తామని చెప్పారు. ఇదే చివరి అవకాశమని చెప్పారు. విచారణను జులై 8కి వాయిదా వేశారు.

ఆర్టీసీ అకౌంట్ల ఫ్రీజ్‌కు విముక్తి : హైకోర్టు ఆదేశం

ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించలేదని చెప్పి రాష్ట్ర ఆర్టీసీ బ్యాంక్ ఖాతాలను పీఎఫ్ అధికారులు ఫ్రీజ్ చేయడంపై హైకోర్టు స్టే విధించింది. ఫ్రీజ్ ఉత్తర్వుల అమలును నిలిపేసింది. తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేస్తున్నామనీ, ఈలోగా రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 రికవరీ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. రూ.940 కోట్ల పీఎఫ్ బకాయిలు పేరుకుపోవడంతో తమ బ్యాంకు ఖాతాలను పీఎఫ్ అధికారులు ఫ్రీజ్ చేయడం అన్యాయమని ఆర్టీసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిని శుక్రవారం జస్టిస్ భాస్కర్‌రెడ్డి విచారించి మధ్యంతర ఆదేశాలు వెలువరించారు. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లయినా ఇప్పటికీ ఆర్టీసీ పీఎఫ్ ఉమ్మడిగానే ఉందని ఏజీ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనే పీఎఫ్ బకాయిలున్నాయన్నారు. విభజన చట్టాన్ని పట్టించుకోకుండా పీఎఫ్ ఆఫీసర్లు రాష్ట్ర ఆర్టీసీ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం అన్యాయమన్నారు. తదుపరి విచారణ వచ్చే నెల 15కు వాయిదా పడింది.

మానవ అక్రమ రవాణాపై నోటీసులు

అక్రమంగా మహిళలను రవాణా చేస్తుంటే కాపాడి వారిని ఉంచేందుకు తగిన పునరావాస గృహాలకు చెందిన గైడ్‌లైన్స్ లేవంటూ ప్రజ్వల అనే ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దాఖలైన రిట్ పిటిషన్‌లపై హైకోర్టు స్పందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 10కి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ సూరేపల్లి నందా శుక్రవారం తెలిపారు. బాధితులకు రక్షిత గృహాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదని న్యాయవాది చెప్పారు.

రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పు బీసీలకు నష్టం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీహార్‌లో ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈబీసీ సామాజిక రిజర్వేషన్లు 50 శాతం దాటడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమనీ, కాబట్టి బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేషన్లు రద్దు చేస్తున్నట్టు గురువారం పాట్నా హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ తీర్పు బడుగు బలహీన వర్గాల వ్యతిరేకమని చెప్పారు. న్యాయస్థానాలు వెలువరించే తీర్పులో కూడా వివక్షత ఉంటుందనడానికి పాట్నా హైకోర్టు తీర్పే నిదర్శనమన్నారు. ఎలాంటి గణాంకాలు లేకుండా, కమిషన్ సిఫార్సులు లేకుండా రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లకు అనుకూలమైన తీర్పులు ఇస్తున్న కోర్టులు.. బడుగు , బలహీన వర్గాలకు సంబంధించిన తీర్పుల్లో మాత్రమే వ్యతిరేకంగా ఉండటం శోచనీయమన్నారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించి మొత్తం రిజర్వేషన్లు 60 శాతం సీలింగ్ పరిమితి దాటించినప్పుడు లేని అభ్యంతరం, ఇప్పుడెందుకని ప్రశ్నించారు. జనాభా దామాషా ప్రకారం వారికి న్యాయబద్ధంగా సామాజిక వాటా దక్కడం కోర్టులకు ఇష్టం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు అమలు కావాలంటే మొదటగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియాకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక రిజర్వేషన్లు రక్షించుకోవడానికి త్వరలోనే ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు దేశవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి ఆగస్టు చివరి వారంలో ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో 10 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించి బడుగు బలహీన వర్గాల తడఖా ఎంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ ఉప్పరి శేఖర్, సగర బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ దుర్గ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతిని ముందుకు తీసుకెళ్లాలి

- కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై బురద జల్లకుండా ఆ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలంగాణ ప్రగతి, సక్సెస్ ఫుల్ మోడల్ పై ప్రపంచ ప్రఖ్యాత మ్యాగజైన్ ది ఎకానమిస్ట్ కథనంలో ఇచ్చిన లెక్కలను ట్వీట్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివద్ధి మోడల్‌గా తయారైందని ఆ కథనంలో పేర్కొన్నారు. విద్యుత్, ఐటీ ఎగుమతులు, ఐటీ ఉద్యోగాలు, జీడీపీ పెరుగుదల తదితర గణాంకాలను పేర్కొన్నారు.

ఆ బిల్లు ప్రవేశపెట్టింది మన్మోహన్ సర్కారే
-భట్టికి వినోద్ కుమార్ కౌంటర్

మైన్స్, మినరల్స్ బిల్లును పార్లమెంటులో 2011లో ప్రవేశపెట్టింది మన్మోహన్ సర్కారే అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ బిల్లుకు 2015లో బీఆర్ఎస్ మద్దతిచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. యూపీఏ హయంలో స్టాండింగ్ కమిటీ సూచనలతో వచ్చిన బిల్లునే బీజేపీ సర్కార్ ఆర్డినెన్స్ రూపంలో తెచ్చిందని వివరించారు. భట్టి బేషరతుగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బొగ్గు నిల్వలను తెలంగాణ అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి వేలాన్ని నిలిపివేయాలని కోరారు.

ఒకటో తరగతిలో 70,116 మంది చేరిక

- 6 తరగతిలో 57,133 ప్రవేశాలు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 70,116 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల ఆరు నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రంలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఆరో తరగతిలో 57,133 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని వివరించారు. వారిలో ప్రయివేటు స్కూళ్ల నుంచి 9,117 మంది సర్కారు బడుల్లో చేరారని తెలిపారు.

ఎనిమిదో తరగతిలో ఇప్పటి వరకు 8,820 మంది విద్యార్థులు చేరారని పేర్కొన్నారు. ప్రయివేటు స్కూళ్ల నుంచి 1,196 మంది ప్రవేశం పొందారని వివరించారు. తొమ్మిదో తరగతిలో 2,814 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. 539 మంది ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రవేశం పొందారని పేర్కొన్నారు. ఇతర తరగతుల్లో 8,220 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 18,75,799 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫారాలను అందించామని పేర్కొన్నారు. 21,73,533 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, 11,65,748 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశామని వివరించారు. ఇప్పటి వరకు 4,33,337 మంది విద్యార్థులకు వర్క్ బుక్స్ ఇచ్చామని తెలిపారు.

సంతోశ్ కంపెనీతో ప్రభుత్వానికి రూ.39 కోట్లు నష్టం

- మహిపాల్, మధుసుదన్ లాకర్స్ తెరవాలి
- ఈడీ అధికారుల వెల్లడి





నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసుదన్‌రెడ్డికి చెందిన సంతోశ్ శాండ్ అండ్ గ్రానైట్ కంపెనీ ప్రభుత్వం ఖజానాకు రూ.39 కోట్ల నష్టాన్ని చేకూర్చిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం తెలిపారు. మహిపాల్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి యజమానులుగా ఉన్న సంతోశ్ శాండ్ అండ్ గ్రానైట్ కంపెనీ సంగారెడ్డి జిల్లాలోని లక్డారం గ్రామంలో గ్రానైట్ తవ్వకాలను జరుపుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయిల్టీని ఎగవేసిందని తాము జరిపిన దాడుల్లో వెల్లడైనట్టు ఈడీ తెలిపింది. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే, ఆయన సోదరుడి నివాసంతో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో తమ సోదాలు సాగాయని వివరించింది. ప్రభుత్వం కేటాయించిన భూమి కంటే ఎక్కువ భూమిలో గ్రానైట్ తవ్వకాలను ఈ కంపెనీ సాగించిందనీ, తమ కంపెనీ ద్వారా గ్రానైట్‌తో పాటు పలు ముడి సరుకులను దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువైన ఎగుమతులు చేశారనీ, దానికి సంబంధించిన అకౌంట్స్ పుస్తకాలను సక్రమంగా నిర్వహించకుండా ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపినట్టుగా కూడా తమ సోదాల్లో వెలుగు చూసిందని ఈడీ చెప్పింది. ఈ దాడుల్లో బినామీల పేర్లతో పెద్ద మొత్తంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కూడా నిర్వహించి నట్టు బయటపడిందనీ, అందుకు సంబంధించి పెద్ద మొత్తంలో భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెం ట్లను వీరి నివాసాల నుంచి స్వాధీనపర్చుకున్నా మని వివరించింది. అలాగే, రూ.19 లక్షల లెక్కపత్రాలు లేని డబ్బులను కూడా స్వాధీనప ర్చుకున్నామని ఈడీ తెలిపింది. ఇంకా, ఎమ్మెల్యే, ఆయన సోదరుడికి చెందిన బ్యాంకు లాకర్లను తెరవాల్సి ఉన్నదని దర్యాప్తు సంస్థ వివరించింది. మొత్తమ్మీద వీరిపై మనీలాండరింగ్ యాక్ట్ కింద కేసులను నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఈడీ తెలిపింది.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

- బస్తీ దవాఖానాల సిబ్బంది డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని బస్తీ దవాఖానాల సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న వందలాది బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు, నర్సులతో పాటు సపోర్టింగ్ స్టాఫ్ విధులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. చేస్తున్న పనికి ఇస్తున్న జీతాలు అంతంత మాత్రమైతే... అవి కూడా సమయానికి ఇవ్వకుంటే తాము బతికేది ఎలా? అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల పెండింగ్ విషయంపై ఇప్పటికే సంబంధిత మంత్రితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసినా సమస్యను పూర్తిగా పరిష్కరించలేకపోయారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గోడును అర్థం చేసుకుని వెంటనే పెండింగ్ వేతనాలను ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాళోజీ ఆరోగ్య వర్సిటీ వీసీ పోస్టుకు దరఖాస్తు గడువు 6 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్‌లో ఉన్న కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ) పోస్టుకు దరఖాస్తు చేసుకునే గడువును వచ్చేనెల ఆరో తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ పోస్టుకు అర్హులైన వైద్యరంగంలో విద్యావేత్తలుగా ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిం చడం కోసం ఈనెల ఏడో తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేశామని తెలిపారు.

అర్హులైన వారు దరఖాస్తుతోపాటు పూర్తిస్థాయి కర్రికులమ్ వీటను తాము రూపొందంచిన ప్రొఫార్మ ప్రకారం డాక్యుమెంట్ ఆధారాలతో రిజిస్టర్ పోస్టు చేయాలని సూచించారు.

ది సెక్రెటరీ టు గవర్నమెంట్, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, రూమ్ నెంబర్ 17, మొదటి అంతస్తు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం, హైదరాబాద్,500022కు దరఖాస్తులను పంపించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9140-23455824 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఐఐఆర్ఎం హైదరాబాద్ విద్యార్థుల అరుదైన ఘనత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ఎం) హైదరాబాద్ విద్యార్థులు అరుదైన ఘనతను సాధించారు. తెలంగాణ ప్రభుత్వం, ఐఆర్‌డీఏఐ సంయుక్తంగా ప్రమోట్ చేస్తోన్న ఈ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు గ్లోబల్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఛాలెంజ్‌ను గెలుపొందారు. అమెరికాలోని సాన్ డియాగో సీఏలో నిర్వహించిన స్పెన్సర్ ఫౌండేషన్, రిమ్స్ యూఎస్ఏ స్పాన్సర్ చేసిన రిస్క్ వరల్డ్ కాన్ఫరెన్స్‌లో ఈ గుర్తింపును పొందినట్టు ఐఐఆర్ఎం హైదరాబాద్ సంస్థ శుక్రవారం తెలిపింది. తొమ్మిది దేశాల నుంచి 38 బృందాలు పోటీపడగా.. ఐఐఆర్ఎం విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. భారత్ అదే విధంగా తెలంగాణ నుంచి ఈ ఛాలెంజ్‌లో నిలిచిన తొలి విద్యాసంస్థగా గుర్తింపు పొందిందని పేర్కొంది. తమ ఫ్యాకల్టీ రూప్ కుమార్ మెంటార్‌షిప్‌లో విద్యార్థులు రాణించగలిగారని ఆ సంస్థ తెలిపింది. ఛాలెంజ్‌లో నిలిచిన విద్యార్థులను ఐఐఆర్ఎం డైరెక్టర్ అతను కె దాస్ అభినందించారు.

24 నుంచి ఉపాధ్యాయుల సర్టిఫికట్ల వెరిఫికేషన్

- బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎంజేపీ బీసీ గురుకులాల్లో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఈనెల 24 నుంచి నిర్వహించే సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ధృవపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10లో సంత్ సేవాలాల్ బంజారా భవన్‌లో ఈనెల 30 వరకు ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్టు తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. 24న లైబ్రేరియన్(స్కూల్, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ), ఫిజికల్ డైరెక్టర్, (జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ), డిగ్రీ లెక్చరర్స్ అభ్యర్థులు హాజరు కావాలనీ, 25న జూనియర్ లెక్చరర్ (ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, హిస్టరీ) , 26న జూనియర్ లెక్చరర్ (హిందీ, తెలుగు, గణితం), పీజీటీ (తెలుగు, హిందీ), 27న పీజీటీ (ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్) ఫిజికల్ డైరెక్టర్ గ్రేడ్-క్కీక్కీ, 28న టీజీటీ (హిందీ, బయోలాజికల్ సైన్స్, సోషల్) 29న టీజీటీ (ఇంగ్లీష్ , ఫిజికల్ సైన్స్) 30న టీజీటీ (తెలుగు , గణితం) అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. ఆయా పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు షెడ్యూల్‌లో ఇచ్చిన తేదీల వారీగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు. వారందరికీ మెసేజ్‌లు పంపించామని తెలిపారు.

495 కేజీబీవీల్లో ప్రవేశాలు

- ఈ ఏడాది కొత్తగా 16లో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 495 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాల ప్రక్రియను చేపట్టనున్నారు. గత విద్యాసంవత్సరంలో 20 కొత్త కేజీబీవీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న మహమ్మదాబాద్ మండలంలో గండీడ్, సంగారెడ్డి జిల్లాలో ఉన్న మొగుదాంపల్లి మండలంలో హోతి కె, గుమ్మడిదల మండలంలో జిన్నారం, చౌటుకూర్ మండలంలో పుల్కల్‌లో గత విద్యాసంవత్సరంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ప్రవేశాల ప్రక్రియను నిర్వహించారు. మిగిలిన 16 కేజీబీవీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ప్రవేశాలను కల్పిస్తారు. తెలంగాణ ఆవిర్భావ సమయంలో 2014లో రాష్ట్రంలో 391 కేజీబీవీలుండేవి. 2017-18 విద్యాసంవత్సరంలో కొత్తగా 84 కేజీబీవీలను ప్రభుత్వం మంజూరుచేసింది. దీంతో రాష్ట్రంలో కేజీబీవీల సంఖ్య 475కి చేరింది. 2023-24 విద్యాసంవత్సరంలో మరో 20 కేజీబీవీలు మంజూరు చేసింది. దీంతో వాటి సంఖ్య 495కు చేరింది. వాటిలో 245 కేజీబీవీల్లో ఇంటర్ వరకు, మిగిలిన 250 కేజీబీవీల్లో పదో తరగతి వరకు విద్యార్థినిలు చదువుతున్నారు. రాష్ట్రంలో 479 కేజీబీవీల్లో గత విద్యాసంవత్సరంలో 1,24,153 మంది అమ్మాయిలు విద్యనభ్యసించారు. రాష్ట్రంలో 29 అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు (యూఆర్ఎస్) ఉన్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్తగా నాలుగు యూఆర్ఎస్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో వాటి సంఖ్య 33కు చేరింది. నారాయణపేట, ములుగు, రంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో కొత్త యూఆర్ఎస్‌లు మంజూరయ్యాయి.

కొత్తగా ప్రవేశాలు కల్పించే కేజీబీవీలు...

మావల (ఆదిలాబాద్), బీర్‌పూర్, బుగ్గారం (జగిత్యాల), కొత్తపల్లి, గన్నేరువరం (కరీంనగర్), దంతాలపల్లి (మహబూబాబాద్), నార్సింగి, నిజాంపేట, హవేలి ఘన్‌పూర్, మాసాయిపేట్ (మెదక్), నిజామాబాద్ (సౌత్), నిజామాబాద్ (నార్త్), నాగలిగిద్ద, వట్‌పల్లి (సంగారెడ్డి), దూల్మిట్ట (సిద్ధిపేట), చౌడాపూర్ (వికారాబాద్).



నీటి కోసం మంత్రి అతిషి సత్యాగ్రహ దీక్ష

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో నీటి పంచాయితీ ఇంకా తేలలేదు. ఎగువున ఉన్న హర్యానా నీరు విడుదల చేసేందుకు ససేమిరా అనడంతో ఢిల్లీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఢిల్లీ నీటి సంక్షోభంపై 'ఆప్' మంత్రి అతిషి శుక్రవారం మధ్యాహ్నం నిరవధిక 'సత్యాగ్రహ దీక్ష'ను ప్రారంభించారు. హర్యానా నుంచి తమకు న్యాయబద్ధంగా రావాల్సిన జలాలు రాకపోవడంతో దేశ రాజధాని నీటి సంక్షోభంలో చిక్కుకుందని, తక్షణమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోక్యం చేసుకోవాలని రెండు రోజుల క్రితం అతిషి లేఖ రాశారు. సంక్షోభాన్ని పరిష్కరించకుంటే ఈనెల 21 నుంచి సత్యాగ్రహ దీక్ష చేపడతానని కూడా ఆమె ప్రకటించారు. హర్యానా నుంచి ప్రతిరోజూ 100 మిలియన్ గ్యాలన్ల నీరు విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్‌తో మధ్యాహ్నం 12 గంటల సమయంలో సత్యాగ్రహ దీక్షకు దిగారు. దీనికి ముందు, ఒక ట్వీట్‌లో ఢిల్లీ నీటి సంక్షోభ పరిష్కారానికి తాము ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తమ వంతు జలాలను హర్యానా ప్రభుత్వం విడుదల చేయలేదంటూ అతిషి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆవేదన వ్యక్తం చేశారు. జాంగ్‌పురలోని భోగల్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు నిరాహార దీక్షలో కూర్చుంటున్నానని, హర్యానా నుంచి రావాల్సిన జలాలు వచ్చేంత వరకూ దీక్ష విరమించేది లేదని చెప్పారు. కాగా, దీక్షకు ముందు రాజ్‌ఘాట్ వద్దనున్న మహాత్మాగాంధీ సమాధి వద్ద ఆమె పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆమె వెంట ఢిల్లీ ముఖ్యమంత్రి సతీమణి సునీతా కేజ్రీవాల్, మంత్రి సంజయ్ సింగ్ తదితరులు రాజ్‌ఘాట్‌ను సందర్శించారు.

ఎల్గార్ పరిషద్ కేసులో మహేష్ రౌత్‌కు బెయిల్



న్యూఢిల్లీ : ఎల్గార్ పరిషద్ కేసులో సామాజిక కార్యకర్త మహేష్ రౌత్‌కు రెండు వారాల పాటు తాత్కాలిక బెయిల్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం మంజూరు చేసింది. అమ్మమ్మ అంతిమ సంస్కారాలు, ఇతరత్రా కార్యక్రమాలకు హాజరయ్యేందుకు గానూ ఈ బెయిల్ ఇచ్చింది. జూన్ 26 నుండి ఈ బెయిల్ అమల్లోకి వస్తుంది, జులై 10న రౌత్ తిరిగి లొంగిపోవాల్సి వుంటుందని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ స్పష్టం చేసింది. జూన్ 29-30, జులై 5-6 తేదీల్లో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వీలుగా తాత్కాలిక బెయిల్‌ను ఇవ్వాలని కోరుతూ రౌత్ దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ పిటిషన్‌ను విచారించిన బెంచ్ పై ఆదేశాలు జారీ చేసింది. 'వాస్తవాలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఈ వ్యక్తి ఇప్పటికే అనుభవించిన జైలు శిక్షను గమనంలోకి తీసుకుని, పైగా చేసిన అభ్యర్థన స్వభావాన్ని గుర్తిస్తూ పిటిషన్‌దారుడికి రెండు వారాల పాటు బెయిల్ మంజూరు చేయాలని నిర్ణయించాం' అని బెంచ్ పేర్కొంది. అవసరమైతే రౌత్ విడుదలకు విధించాల్సిన నిబంధనలు, షరతులను ట్రయల్ కోర్టును నిర్ణయించాల్సిందిగా కోరే స్వేచ్ఛ ప్రత్యేక కోర్టు, జాతీయ దర్యాప్తు సంస్థ వుంటుందని పేర్కొంది. రౌత్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై బాంబే హైకోర్టు ఇచ్చిన స్టేను గతేడాది సెప్టెంబరులో సుప్రీం కోర్టు పొడిగించింది. 2018 జూన్‌లో రౌత్ అరెస్టయ్యాడు. ప్రస్తుతం తలోజా జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో వున్నారు.

ఈపురుపాలెంలో అమానుషం

- యువతిపై సామూహిక లైంగికదాడి ..? ఆపై హత్య
- 48 గంటల్లో నిందితులను అరెస్టు చేస్తాం : రాష్ట్ర హోంమంత్రి అనిత





(ఫైల్)

అమరావతి : బాపట్ల జిల్లా చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెంలో యువతి హత్యకు గురైంది. ఆమె మృతదేహం వివస్త్రగా ఉండడం, ఒంటిపై గాయాలు ఉండడంతో సామూహిక లైంగికదాడి జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యువతి మృతదేహాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. నిందితులను 48 గంటల్లో అరెస్టు చేస్తామని ఆమె చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం... ఈపురుపాలెం గ్రామంలోని చేనేత కుటుంబమైన సీతారాంపేటకు చెందిన పౌజుల వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతుల పెద్ద కుమార్తె సుచరిత (21) ఇంటర్ చదివారు. టైలరింగ్ నేర్చుకొని ఇంటి వద్దే దుస్తులు కుడుతున్నారు. శుక్రవారం వేకువజామున సుమారు 5.30 గంటల సమయంలో ఎప్పటిలాగే బహిర్భూమికి వెళ్లారు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. రైలు పట్టాల పక్కన ఈపురుపాలెంలో గర్ల్స్ హైస్కూల్ గోడ పక్కన పొదల్లో సుచరిత మృతదేహం వివస్త్రగా ఉంది. ఆమె ఒంటిపై గాయాలు ఉన్నాయి. ముక్కు నుంచి రక్తం కారుతోంది. దీనిపై యువతి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతిపై సామూహిక లైంగికదాడి, హత్య జరిగిందని మీడియాలో ప్రచారం జరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగింది. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించారు. ఘటనాస్థలానికి వెళ్లాలని వెంటనే హోం మంత్రి అనితను ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారులతోనూ చర్చించి ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. యువతి మృతదేహాన్ని జిల్లా ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు పరిశీలించారు. ఐదు ప్రత్యేక పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు.

యువతి మృతదేహాన్ని పరిశీలించిన హోం మంత్రి

యువతిపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను 48 గంటల్లో పట్టుకుంటామని హోం మంత్రి అనిత చెప్పారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యతో కలిసి మంత్రి ఘటనా స్థలాన్ని ఆమె పరిశీలించారు. హత్యకు గురైన యువతి మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. లైంగికదాడా ? సామూహిక లైంగికదాడా? అనేది దర్యాప్తులో తేలనుందని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా హోంమంత్రి చెప్పారు. మంత్రి వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్‌డీఓలు తదితరులు ఉన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెక్కు రూపంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించండి : డిజిపికి సిఎం చంద్రబాబు ఆదేశం

ఈపూరుపాలెం ఘటనలో దోషులకు కఠిన శిక్షపడేలా పోలీసులు వ్యవహరించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశించారు. డిజిపిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమలరావు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల గురించి డిజిపితో సీఎం చర్చించారు. ఈపూరుపాలెంలో జరిగిన ఘటనలు వంటికి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించారు. త్వరలో పోలీస్ యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాల్సి ఉంటుందని, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

కఠిన చర్యలు తీసుకోండి : ఐద్వా

యువతిపై లైంగికదాడి, హత్య ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఐద్వా డిమాండ్ చేసింది. తక్షణం దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై నియంత్రణ లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఇలాంటి అఘాయిత్యాలు జరగకుండా తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

బిజినెస్

జెకె టైర్ నుంచి నూతన శ్రేణీ టైర్లు

- అర్అండ్‌డిపై రూ.125 కోట్ల పెట్టుబడి :

అనుజ్ కతూరియా వెల్లడి



హైదరాబాద్ : జెకె టైర్ కొత్తగా ట్రక్కులు, బస్సులు, ఇవిల కోసం నూతన శ్రేణి టైర్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇవి 10 శాతం అదనపు మన్నిక, సామర్థ్యం కలిగి ఉంటాయని వెల్లడించింది. శుక్రవారం హైదరాబాద్‌లో జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రెసిడెంట్ అనుజ్ కతూరియా ఐదు రకాల కొత్త టైర్లను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జెట్‌వే జెయుఎం ఎక్స్‌ఎం, జెట్‌వే జెయుసి ఎక్స్‌ఎం, జెట్ స్టీల్ జెడిసి ఎక్స్‌డి సహా విద్యుత్ బస్సుల కోసం ప్రత్యేకంగా జెట్‌వే జెయుఎక్స్‌ఇ వేరియంట్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. వాణిజ్య వాహనాల కోసం తమ పోర్టుపోలియోలో 500 పైగా రకాల టైర్లను ఉత్పత్తిని కలిగి ఉన్నామన్నారు. మైసూర్‌లో రూ.600 కోట్లతో ఆర్అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఏడాది పరిశోధన, అభివృద్ధిపై రూ.125 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. దేశంలో ప్రతీ నెల 1.10 కోట్ల యూనిట్ల టైర్లు తయారవుతున్నాయన్నారు. ఈ రంగం వచ్చే ఐదేళ్లలో 6-7 శాతం పెరగొచ్చన్నారు. ప్రస్తుతం దేశంలో 8500 విద్యుత్ బస్సులు ఉన్నాయన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 1.6 లక్షల యూనిట్లకు చేరొచ్చని.. ఈ రంగంలో విస్తృత అవకాశాలున్నాయన్నారు.

త్వరలో వస్త్ర వ్యాపారంలోకి శ్రేయాస్ గ్రూప్

త్వరలోనే వస్త్ర వ్యాపారంలోకి ప్రవేశించనున్నట్లు శ్రీనివాస్ రావు తెలిపారు. ఆగస్టు 15న మెన్స్‌వేర్ స్టోర్లను ప్రారంభించనున్నామన్నారు. ముందుగా తిరుపతి, మదనపల్లి, చిత్తూరులో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జిఆర్ఎం ఓవర్‌సీస్ బోర్డు భేటీ

న్యూఢిల్లీ : జిఆర్ఎం ఓవర్‌సీస్ లిమిటెడ్ బోర్డు శుక్రవారం భేటీ అయ్యింది. ఈ సమావేశంలో రూ.136.50 కోట్ల విలువ చేసే 91 లక్షల ప్రిఫరెన్షియల్ షేర్లను జారీ చేయాలని నిర్ణయించింది. రూ.2 ముఖ విలువ కలిగిన షేరును రూ.150 చొప్పున ఇష్యూ చేయనుంది. దీనికి రెగ్యూలేటరీ సంస్థల నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. బస్మతీ బియ్యం ఎగుమతుల్లో ఈ సంస్థ పరపతిని కలిగి ఉంది.



తెలుగు రాష్ట్రాల్లో రెట్టింపు అవుట్‌లెట్లు

- దక్కన్ చాయ్ సిఇఒ వెల్లడి

హైదరాబాద్ : వచ్చే ఏడాది మార్చి కల్లా తెలుగు రాష్ట్రాల్లో దక్కన్ చాయ్ అవుట్‌లెట్లను రెట్టింపు చేస్తామని శ్రేయాస్ గ్రూపు ఛైర్మన్ జి శ్రీనివాస్ రావు, దక్కన్ చాయ్ సిఇఒ జి వీరన్న తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం తమకు 220 దక్కన్ చాయ్ అవుట్‌లెట్‌లు ఉన్నాయని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలు సహా ఒడిస్సా, కర్నాటకలో తమ కార్యకలాపాలు ఉన్నాయని.. త్వరలోనే మహారాష్ట్ర, తమిళనాడుకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 1000 ఫ్రాంఛైజీ స్టోర్లకు విస్తరించాలనేది తమ ప్రధాన లక్ష్యమన్నారు. దీంతో 2000 మందికి ఉపాధి కల్పించాలని నిర్దేశించుకున్నామన్నారు. ఒక్కో ఫ్రాంఛైజీకి రూ.6.5 లక్షల వ్యయం అవుతుందన్నారు.

జెన్సోల్ ఇంజనీరింగ్‌కు రూ.1,340 కోట్ల ప్రాజెక్టు

న్యూఢిల్లీ : గుజరాత్ ఉర్జా వికాస్ నిగమ్‌నకు చెందిన 250 మెగావాట్ (500ఎండబ్ల్యుహెచ్) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టును బిడ్డింగ్‌లో విజయవంతంగా దక్కించుకున్నట్లు జెన్సోల్ ఇంజనీరింగ్ తెలిపింది. ఈ ప్రాజెక్టు గుజరాత్ రాష్ట్రంలోని డిస్కమ్‌లకు పీక్, ఆఫ్ అవర్స్‌లో ఆన్ డిమాండ్ ప్రతిపాదికన విద్యుత్‌ను సరఫరా చేయనుందని పేర్కొంది.

టెక్టోర్‌కు గూగుల్ గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డు

హైదరాబాద్ : ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజెస్ సొల్యూషన్‌ల విస్తరణ, ఇంటిగ్రేటెడ్‌లో సహకారం అందించినందుకు గూగుల్ నుండి టెక్టోరో కన్సల్టింగ్‌కు ప్రతిష్టాత్మక గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును పొందింది. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్టనర్ సమ్మిట్ 2024లో ఈ అవార్డును టెక్టోరో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ దన్నపనేని అందుకున్నారు. ఈ అవార్డును అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని శ్రీధర్ తెలిపారు. ఇది మా అంకితభావంతో కూడిన బృందం యొక్క కృషి, పట్టుదల, ఆండ్రాయిడ్ అడాప్షన్‌ను డ్రైవింగ్ చేయడంలో ఎడతెగని తమ శ్రమకు, సాధనకు నిదర్శనమన్నారు.

శివసత్తుల్ని గుర్తించండి

- మంత్రి కొండా సురేఖకు సంఘం వినతి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆషాడ బోనాల నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేయబోయే ఉత్సవ కమిటీలో తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘం సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ జోగిని కొలిపాక శ్యామల కోరారు. శుక్రవారంనాడామె సంఘం ప్రతినిధులతో కలిసి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో కలిసి, వినతిపత్రం సమర్పించారు. ఆషాడ బోనాల్లో ప్రజలు, శివసత్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైభవోపేతంగా పండుగను నిర్వహించాలని, శివసత్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలంగా బోనాల పండుగ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్న తెలంగాణ శివసత్తుల సంక్షేమ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు. పరిశీలించి, నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.



ఎమ్మెల్యేలతో జగన్ సమావేశం

అమరావతి : శాసనసభ ఆవరణలో తమకు కేటాయించిన కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలతో వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు. గతంలో పూర్తిస్థాయి మెజార్టీతో అధికారంలో ఉండి ప్రస్తుతం ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడంతో ఇకముందు సమావేశాలకు హాజరవ్వాలా? లేదా? అనే అంశంపై చర్చించారు. శనివారం పులివెందుల పర్యటన ఉన్న నేపథ్యంలో ఆయన నేరుగా అక్కడకు వెళతారని తెలిసింది. స్పీకరు ఎన్నిక అనంతరం వెళతారా, లేదా అనేది వైసిపి శాసనసభాపక్షం స్పష్టత ఇవ్వలేదు.

ఉక్రెయిన్ మద్దతును తగ్గించనున్న ఎన్నికల ఫలితాలు

- ఫ్రెంచ్ ప్రధాని



రాబోయే పార్లమెంటరీ ఎన్నికలలో అందరూ ఊహిస్తున్న రైట్-వింగ్ నేషనల్ ర్యాలీ పార్టీ అధికారంలోకి వస్తే దేశీయ, అంతర్జాతీయ సమస్యలపై దేశం వైఖరిలో చాలా తీవ్రమైన మార్పులు చేయగలదని ఫ్రెంచ్ ప్రధాన మంత్రి గాబ్రియేల్ అట్టల్ హెచ్చరించాడు. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలలో తన పార్టీ ఓటమి తర్వాత అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఫ్రెంచ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి ఈ నెల ప్రారంభంలో ముందస్తు ఎన్నికలను ప్రకటించాడు. జూన్ 30న కొత్త జాతీయ అసెంబ్లీని ఎంచుకోవడానికి ఫ్రాన్స్ ఎన్నికలకు వెళ్లనుంది. రెండవ రౌండ్ జూలై 7న జరగనుంది.

గురువారం బీఎఫ్ఎమ్ టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో మితవాద పార్టీల విజయం 2020లో యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమించినట్టుగా "ఫ్రెక్సిట్"కు దారితీస్తుందని అట్టల్ ప్రత్యేకించి ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో ఉక్రెయిన్‌కు చేస్తున్న సహాయం తగ్గిపోతుందని, "రష్యాకు సాష్టాంగపడే ప్రమాదాన్ని" పెంచుతుందని ఆయన అన్నాడు. ఇటీవల బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, అనేక ఇతర యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు కూడా ఇలాంటి ఆందోళనలను వ్యక్తం చేశాయి. మాక్రాన్ ఓటమి కీవ్ ప్రధాన మద్దతుదారుల్లో ఒకరిగా ఫ్రాన్స్ పాత్రను బలహీన పరుస్తుందని, ఉక్రెయిన్‌కు సైనిక బోధకులను పంపే ప్రణాళికలను కూడా ప్రభావితం చేయగలదని అనేక యూరోపియన్ దేశాలు విశ్వసిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

నేషనల్ ర్యాలీ పార్టీ ప్రధానమంత్రి మాక్రాన్‌కు పూర్తిగా విరుద్ధమైన రాజకీయ అవగాహన కలిగి ఉంటాడని, మాక్రాన్ అధ్యక్ష పదవి 2027 వరకు కొనసాగుతుందని సైన్సెస్ పో యూనివర్సిటీలోని రాజకీయ శాస్త్రవేత్త గిల్లెస్ ఇవాల్డి చెప్పాడు. ఇది రష్యా ఉక్రెయిన్, యూరోపియన్ రక్షణ వంటి సమస్యలను ప్రభావితం చేస్తుంది. వాతావరణ మార్పు, యూరోప్ బలహీనపడటానికి దారి తీస్తుంది. తాను అధికారంలోకి వస్తే, ఉక్రెయిన్‌కు మందుగుండు సామగ్రిని అందించడం కొనసాగిస్తానని, అయితే ఎలాంటి ఫ్రెంచ్ సైనిక సిబ్బందిని సంఘర్షణ ప్రాంతానికి పంపబోనని లేదా కీవ్‌కు సుదూర క్షిపణులను సరఫరా చేయబోనని నేషనల్ ర్యాలీ చైర్మన్ జోర్డాన్ బార్డెల్లా ప్రకటించాడు. నా అవగాహన మారలేదు. ఇది పరికరాలు, మందుగుండు సామగ్రి, కార్యాచరణ లాజిస్టిక్స్ మద్దతు, రక్షణ ఆయుధాలను అందించడం ద్వారా ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వడం, తద్వారా తనను తాను రక్షించుకోగలుగుతుంది అని బార్డెల్లా చెప్పాడు.

ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాలు చేస్తున్న సైనిక సహాయాన్ని మాస్కో పదేపదే ఖండించింది. దేశానికి ఎటువంటి నాటో దళాలను పంపకుండా హెచ్చరించింది. అలాంటి చర్య పశ్చిమ దేశాలకు యుద్ధంలో ప్రత్యక్ష ప్రమేయాన్ని కలిగిస్తుందని, వారు రష్యన్ సైన్యానికి చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతారని రష్యా ప్రకటించింది.

ఏర్పాటైన ఈజిప్ట్ సంక్షోభ విభాగం

- పెరుగుతున్న 'హజ్' మరణాల సంఖ్య



విపరీతమైన వేడి కారణంగా ముస్లింల మక్కా తీర్థయాత్రలో మరణాలు అధికమవుతున్నాయి. తమ పౌరులలో సంభవిస్తున్న సామూహిక మరణాలపై దర్యాప్తు చేయడానికి ఈజిప్టు గురువారం సంక్షోభ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు రాయిటర్స్ రిపోర్ట్ తెలిపింది. సౌదీ అరేబియాలో జూన్ 14 నుంచి 19 వరకు జరిగిన 'హజ్' యాత్రలో కనీసం 600 మంది ఈజిప్షియన్లు మరణించారని, అనేక మంది తప్పిపోయారని ఈజిప్ట్ జాతీయ మీడియా వైద్య, భద్రతా వర్గాలను ఉదహరిస్తూ పేర్కొంది. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉండటమే ప్రధాన కారణమని తెలిపింది. ఈ తీర్థయాత్రలో ప్రపంచవ్యాప్తంగా 18 లక్షలమంది యాత్రికులు పాల్గొన్నారు.

చాలా మంది బాధితులు తీర్థయాత్రకు అధికారికం నమోదు చేసుకోలేదని ఈజిప్టు ప్రతినిధి బృందంలోని వైద్యులు పేర్కొన్నారు. ప్రెసిడెంట్ అబ్దెల్ ఫట్టా అల్-సిసి నుంచి వచ్చిన ఆర్డర్‌ను అనుసరించి సంక్షోభ యూనిట్‌ను ప్రారంభించింది. తర్వాత అధికారికంగా నమోదైన 50,752 మంది ఈజిప్షియన్ యాత్రికుల సమూహం నుంచి 28 మరణాలను ఈజిప్ట్ క్యాబినెట్ ధృవీకరించింది. నమోదుకాని యాత్రికుల ప్రయాణాన్ని సులభతరం చేసే సంస్థలపై విచారణ జరిపి జరిమానా విధిస్తామని మంత్రివర్గం పేర్కొంది. ప్రతి యేటా వందలు, వేల మంది యాత్రికులు అధికారిక అనుమతులు పొందలేక అనధికారిక మార్గాల ద్వారా హజ్ యాత్రకు వచ్చేందుకు ప్రయత్నిస్తుంటారు.

ఇప్పటివరకు ఈ వార్షిక తీర్థయాత్రలో మొత్తం 1,081 మరణాలను 10 దేశాలు ప్రకటించాయని అరబ్ న్యూస్ వెబ్‌సైట్ పేర్కొంది. సౌదీ అరేబియాలోని వాతావరణ కేంద్రం సోమవారం మక్కాలోని గ్రాండ్ మసీదు వద్ద 51.8 డిగ్రీల సెల్సియస్ (125 డిగ్రీల ఫారెన్‌హీట్) గరిష్ట ఉష్ణోగ్రత ఉన్నట్టు పేర్కొంది. జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్ జర్నల్‌లో ప్రచురించబడిన 2019 అధ్యయనం ప్రకారం, వాతావరణ మార్పుల కారణంగా, హజ్ యాత్రికుల వేడి ఒత్తిడి 2047, 2052 మధ్య "అత్యంత ప్రమాదకరమైన పరిధి"ని అధిగమిస్తుందని, 2079 నుంచి 2086 వరకు, శతాబ్దమంతా దాని తీవ్రత పెరుగుతూనే ఉంటుందని వెల్లడించింది.